సాహిత్య గత వారం కాలమ్స్ పై చర్చలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం f: fb.com/vaartha

PUBLISHED FROM RAJAHMUNDRY, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

27-7-2023 గురువారం సంపుటి : 29 సంచిక : 177, పేజీలు : 12 వెల : 6.50



మచిలీపట్నంలో మహిళా డాక్టర్ హత్య 2లో

బీహార్‌లో కాల్పులు.. ఒకరి మృతి, పలువురుకి గాయాలు 5లో




## మోడీ సర్కార్‌పై అవిశ్వాస తీర్మానానికి స్పీకర్ అనుమతి

**న్యూఢిల్లీ, జులై 26:** కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గగోయ్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతి ఇచ్చారు. అయితే తీర్మానంపై చర్చకు చెందిన తేదీని, సమయాన్ని త్వరలో ప్రకటించనున్నట్లు స్పీకర్ తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీ కూడా అవిశ్వాస తీర్మానంపై నోటీసు ఇచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 11వ తేదీన ముగియనున్న విషయం తెలిసిందే. ఇక ఈ రోజు లోక్‌సభలో విపక్ష పార్టీలు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు కేవలం 13రోజులు మాత్రమేఉన్నాయి. అయితే పద్ధతి ప్రకారం అవిశ్వాస తీర్మానంపై చర్చను షెడ్యూల్ చేసేందుకు లోక్‌సభ స్పీకర్ 10 రోజుల సమయాన్ని తీసుకునే వీలుంది. బిఆర్‌ఎస్ ఎంపి నామా నాగేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గగోయ్ కేంద్రంపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. సుమారు 50 మంది ఎంపిలు ఆ నోటీసులపై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఇవాళ లోక్‌సభ, రాజ్య సభల్లోనూ మణిపూర్ అంశంపై రభస కొనసాగింది. రెండు సభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ≫2



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరద నీరు విడుదల చేస్తున్న దృశ్యం

# రాష్ట్రమంతా కుండపోత

- పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం
- మరో మూడు రోజులు భారీ వర్షసూచన
- కాకినాడ, కృష్ణా, ఎన్టీఆర్, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో పంటలకు భారీ నష్టం
- ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా చేరుతున్న వరద నీరు

గోదారి-శబరి నదుల ఉగ్రరూపం 2లో

**విజయవాడ, జులై26, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మరో మూడు రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. బుధవారం రాష్ట్రమంతట వర్షాలు కురుస్తునే ఉన్నాయి.నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో ప్రజాజీవనం అతాకుతల మవుతుంది. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని పలు జిల్లాలను వాతావరణ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.వానలకు పలు జిల్లాల్లో వారి నారుమళ్లు నీట మునిగాయి. వేకువ జాము నుంచి దాదాపు రోజంతా మధ్య,మధ్యలో కొంత తెరపి ఇచ్చినా వాన జల్లులు పడుతున్నాయి.బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేడు వాయు గుండంగా మారే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.దీని ప్రభావంతో మరో 72 గంటల పాటు వానలు రాష్ట్రమంతటా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఇది ఉత్తర ఆంధ్రప్రదేశ్ - దక్షిణ ఒడిశా తీరాల మీదుగా వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతోందని వెల్లడించారు.దీని ప్రభావంతో కోస్తా,రాయలసీమల్లో బుధ, గురువారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విజయవాడ (అమరావతి)వాతావరణ కేంద్రం డైరెక్టర్ స్టెల్లా తెలిపారు.గంటకు 30-40 కిలో మీటర్ల వేగంతో జలమైన గాలులు వీయవచ్చునని తెలిపారు.

అల్పపీడన ప్రభావంతో కోస్తాలో ఎడతెరపి లేకుండా వానలు పడుతున్నాయి.కాకినాడ, కృష్ణా, ఎన్టీఆర్,అనకాపల్లి,విశాఖ పట్టణం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.వానలు ప్రభావంతో కృష్ణా జిల్లాలో భారీగా వరి నారుమళ్లు నీట మునిగాయి.తిరువూరు,నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో వాగులు పొంగుతున్నాయి,ఎన్టీఆర్ జిల్లాలో కట్టలేరు. వైరా, మున్నేరు,పాలేరు వంటి కృష్ణానది ఉపనదులు పొంగుతున్నాయి. కంచికచర్ల సమీపంలో మున్నేరుపొంగిచెవిటికల్లు రోడ్డుమీదకురావడంతో ఆ దారిలో రాకపో ≫2



చింతూరువద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది



## సంక్షేమ హాస్టళ్లు డిజిటల్

### కలెక్టర్లు హాస్టళ్లను పర్యవేక్షించాలి : సిఎం జగన్

**విజయవాడ,జులై26.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అన్ని సంక్షేమ వసతిగృహాల్లో పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఎం జగన్ ఆదేశించారు.ఈ అంశంలో చేపట్టిన పనులన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు, రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను ఆధునీకరిస్తున్నారు.వీటన్నింటిని డిజిలైటేషన్, కంప్యూటర్లు సదుపాయం కల్పిస్తున్నారు. ఈ దిశలో సిఎం జగన్ ఆదేశాలను అనుసరించి అధికార యంత్రాంగం కార్యచరణను చేపట్టింది. కొత్తరూపం కల్పించే దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.అన్ని విధాలు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికబద్దంగా ప్రణాళికా యుతంగా కార్యచరణ చేపడుతుంది. ఆధునీకమైన రీతిలో సంక్షేమ హాస్టళ్ల గదుల్లో సదుపాయాలు,టాయిలెట్‌ల సౌకర్యం అందుబాటులోకి తీసుకుని వస్తున్నారు. ఈ సదు ≫2



## సీమ ప్రాజెక్టులు రద్దుచేసిన జగన్

### ఇరిగేషన్ ప్రాజెక్టులపై చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

**అమరావతి, జులై 26, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర చరిత్రంలో ఏ ముఖ్యమంత్రి చేయనంత ద్రోహం జగన్ రాయలసీమకు చేశారని, జగన్‌రెడ్డి ముమ్మాటికీ రాయలసీమ ద్రోహి అని అనటానికి ఆ ప్రాంతంలోని ప్రాజెక్టుల్లో నాలుగేళ్లలో జరిగిన పనులే నిదర్శనమని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు.. జగన్ పోవాలి సీమలో సిరులు పండాలని అన్నారు. ఒళ్లు చించుకుని నోటికొచ్చినట్టు మాట్లాడటం కాదని, సీమకు చేసిన అన్యాయంపై సమధానం చెప్పాలనిఅన్నారు.. కరువుప్రాంతాన్ని కరువు ప్రాంతంగా చూడకుండా, కులాలు, ≫6






విశాఖపట్నంలో భారీవర్షాలకు చెరువులను తలపిస్తున్న రోడ్లు



బుట్టాయగూడెం మండలం కెఆర్‌పురంలో రహదారిపై పొంగి ప్రవహిస్తున్న తూర్పు కాలువ



నందిగామ ఆర్టీసి బస్టాండ్‌లో భారీగా చేరిన వరదనీరు

# కుండపోత

>> కలు నిలిచిపోయాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి 7400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆనకట్టకు భారీగా వరద నీరు వచ్చిచేరుతుంది. జిల్లాలో వత్సవాయి, పెనుగంచి ప్రోలు శివారుల్లో మున్నేరు పొంగిపోర్లుతుంది. వత్సవాయి మండలం పోలంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ఉధృతి పెరుగుతుంది. ఉమ్మడి గోదావరి జిల్లాలో గోదావరి నది ఉప్పొంగుతుంది. అల్లూరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా నేడు భారీ వర్షాలు కురవచ్చునని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు.

విజయవాడ నగరంలో వర్షం భారీగా కురుస్తుంది. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వాననీటిలో మునిగి ఉన్నాయి, కారల్‌మార్క్స్, మహాత్మాగాంధీ రోడ్ల క్రాస్‌ల వద్ద అక్కడ వాన నీరు రోడ్డు మీదకు చేరుతుంది. రాష్ట్రంలో గుంటూరు, విశాఖ, ఏలూరు. కాకినాడ, శ్రీకాకుళం, భీమవరం, రాజమండ్రి నగరాలపై వర్షం ప్రభావం కన్పించింది.

# మచిలీపట్టణంలో మహిళా డాక్టర్ హత్య

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్టణం నగరంలో పిల్లల వైద్యనిపుణురాలుగా మంచి గుర్తింపు ఉన్న ముచ్చెర్ల రాధ హత్యకు గురయ్యారు. డాక్టర్ రాధ, తన భర్త డాక్టర్ ఉమామహేశ్వరరావుతో కలిసి నగరంలోని జవ్వారుపేట జంక్షన్‌లో నివాసముంటున్నారు. అక్కడే చిన్నపిల్ల వైద్యశాలను నిర్వహిస్తున్నారు, గత రాత్రి ఆమెను గుర్తు తెలియని దుండగులు గొంతు కోసి అతికిరాతకంగా హత్య చేసారని బుధవారం ఎస్పీ రవి ప్రకాష్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆస్పత్రిలోని కిందిఅంతస్తులో ఓపీ(అవుట్ పెషెంట్)లను చూస్తున్నారు. తన భార్య ఎంతకు కిందకు రాకపోవడంతో ఫోన్ చేసారు. అయినప్పటికి ఆమె స్పందించలేదు.



హత్యకు గురైన ముచ్చెర్ల రాధ (ఫైల్)

ఉమామహేశ్వరరావు మొదటి అంతస్తుకు వెళ్లి చూడగా, తల, గొంతు భాగంలో తీవ్రగాయాలతో రాధ రక్తపు మడుగులో పడి ఉంది. దీంతో వెంటనే ఆయన పోలీసులను ఫిర్యాదు చేసారు. ఇంట్లో కారంపొడి చల్లి ఉండటంతో పాటు, రాధ ఒంటిపై ఉన్న బంగారు నగలు అపహరణకు గురయ్యాయని చెప్పారు. ఘటనా స్ధలాన్ని పరిశీలించిన పోలీసులు క్లూస్‌టీం సాయంతో ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఘటన స్ధలానికి క్లూస్ టీమ్ చేరుకుంది. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆధారాలు సేకరిస్తున్నా రన్నారు, హత్య జరిగిన ప్రదేశాన్ని ఎస్పీ రవి ప్రకాశ్, డీఎస్పీ మాధవరెడ్డిలు పరిశీలించారు. ఇంటికి సమీపంలోని సీసీ పుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు

# సంక్షేమ హాస్టళ్లు డిజిటల్

>>పాయాలతో పాటుగా హాస్టళ్లలో డిజిలైటేషన్, విద్యార్థులకు ఉపకరించే రీతిలో కంప్యూటర్లు ఏర్పాటు చేసే దిశలో ఆలోచన చేస్తుంది. సమాచార, ప్రజాసంబంధ వ్యవహారాలశాఖ ద్వారా లభించిన సమాచారాన్ని అనుసరించి రాష్ట్రంలో వసతి గృహాల్లో అన్ని మెరుగైన పరిస్థితులుండాలనే దిశలో ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది, ఆయన సంక్షేమశాఖల పరిధిలో పనిచేస్తున్న ఈ వసతి గృహాల స్థితిగతులపై అవగాహనను అధికారులు కలిగి ఉండాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు కీలకంగాను, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అభివృద్ధిని గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు, నాడు-నేడు రెండో విడుత కార్యక్రమాలను అమలుచేసి, సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేయాలనుకుంటుంది. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన, బిసి, మైనారిటీ సంక్షేమశాఖలకు సంబంధించి 4,472 హాస్టళ్లలో 4,84,862 మంది విద్యార్థులున్నారని అధికారుల నివేదికలను అనుసరించిన సమాచారం. నాడు-నేడు 2వ దశ కార్యక్రమంలో ఆ హాస్టళ్లలో మార్పులు జరుగుతున్నాయని సిఎం జగన్ వ్యాఖ్యానించారు. విద్యవ్యవస్థలో అమ్మఒడి ఒక కార్యక్రమం విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. అనేక విధాలుగా విద్యవ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గోరుముద్ద, కంటివెలుగు, చిరునవ్వు కార్యక్రమాలను వారి క్షేమం కోసం ఏర్పాటు చేసామన్నారు. గోరుముద్ద ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు నాడు-నేడులో భాగంగా హాస్టళ్లలో పూర్తి వసతులు కల్పిస్తామన్నారు.

అన్ని హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రత (శానిటేషన్), చక్కటి వాతావరణం, విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు ఉండాలన్నారు. బెల్టులు, దుప్పట్లు, అల్మరాలు, మంచాలు, ఇతర కనీస వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. జగనన్న విద్యాకానుకను హాస్టల్ విద్యార్థులకు కూడా అందజేయాలి. కాబట్టి హాస్టళ్లలో కూడా స్థితిగతులు పూర్తిగా మారాలి. వసతి గృహాల్లో ఉన్న పిల్లల అవసరతలపై పూర్తి అధ్యయనం, అవగాహన ఉండాలన్నారు. అక్కడ మంచి వాతావరణం, మంచినీటి వసతి, టాయిలెట్స్, మంచి నివాస వసతి ఉండాలన్నారు. దీనిపై మనం ఏది చెప్పినా తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్లు కచ్చితంగా ఎప్పటికప్పుడు హాస్టళ్లపై అప్డెట్ సమాచారాన్ని తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి సమగ్ర అవగాహన కోసం జిల్లా కలెక్టర్లు ఒక షేడ్యూల్ నిర్ణయించుకుని హాస్టళ్లపై ఆకస్మిక దాడులు చేయాలన్నారు.

అవసరాన్ని బట్టి హాస్టళ్లలో నిద్రచేయాలన్నారు. హాస్టల్స్ లో వైద్య సదుపాయాలు విషయంలో అధికారులు పూర్తి శ్రద్దపట్టాలన్నారు. విధిగా ఆరోగ్యకార్యకర్తలు సంక్షేమ వసతి గృహాలకు వెళ్లి వైద్యపరీక్షలు అందించాలన్నారు. బి-12 వంటి విటమిన్‌లు అందించాలన్నారు. కీలకంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు విధిగా హాస్టల్స్‌కు నిర్దేశిత ప్రణాళికను అనుసరించి వెళ్ళాలన్నారు. అదే విధంగా ప్రతి సంక్షేమ హాస్టల్స్‌లో టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలన్నారు. హాస్టల్స్ వాతావరణం పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యస్థితిగతులపై కచ్చితమైన పర్యవేక్షణ ఉండాలన్నారు.

# అవిశ్వాస తీర్మానానికి స్పీకర్ అనుమతి

>> మధ్యాహ్నం 12 గంటల తర్వాత సమావేశమైన లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టేందుకు అనుమతి ఇచ్చారు. అవిశ్వాస తీర్మానాన్ని గగోయ్ సభలో ప్రవేశపెట్టారు. అందుకు స్పీకర్ స్పందిస్తూ త్వరలో చర్చ, తేదీ, సమయాన్ని వెల్లడించనున్నట్లు చెప్పారు. మణిపూర్ అంశంపై చర్చకు సిద్ధమే అని కేంద్రం అంటోంది. కానీ చర్చను తీసుకురావడం లేదని కాంగ్రెస్ ఎంపి కె సురేశ్ తెలిపారు. ప్రధాని మోడీ సభకు రావడం లేదని, ఆయన తన ఛాంబర్‌లో కూర్చుంటున్నారని, కేవలం మీడియాతో మాత్రమే మాట్లాడుతున్నారని ఎంపి సురేశ్ ఆరోపించారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు తమ వద్ద కావాల్సిన సంఖ్యాబలం ఉందన్నారు. బిఎస్పీ ఎంపి మాలూక్‌నగర్ లోక్‌సభలో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంపైచర్చిస్తామన్నారు. మణిపూర్‌పై పూర్తిస్థాయిలో చర్చ జరుగుతుందన్నారు. సిఎంను మార్చాలని డిమాండ్ చేశామన్నారు. రాజస్థాన్‌లో దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల గురించి కూడా చర్చించాలన్నారు.

మణిపుర్ అంశంపై పార్లమెంట్‌లో విపక్షాల ఆందోళన కొనసాగుతోంది. మణిపుర్‌పై ప్రధాని మోడీ మాట్లాడాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష ఎంపిలు నిరసనకు దిగారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. విపక్షాల ఆందోళన నడుమ లోక్‌సభను స్పీకర్ బుధవారం ఉదయం వాయిదా వేశారు. ప్రధానమంత్రి పార్లమెంటును గౌరవించాలి. ఇది రాష్ట్రపతి పాలన కాదు, ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లోక్‌సభ స్పీకర్ ఆమోదించిన అవిశ్వాస తీర్మానంపై కాంగ్రెస్ ఎంపి కార్తీ చిదంబరం మాట్లాడారు. ఢిల్లీ పాలనాధికారాల బిల్లుపై కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు విప్ జారీ చేశాయి. లోక్‌సభ ఎంపిలు సభకు తప్పనిసరిగా హాజరుకావాలని విప్‌జారీ చేశారు. ఢిల్లీ పాలనాధికారాల బిల్లుకు వ్యతిరేకంగా ఓటేయాలంటూ విప్‌లో పేర్కొన్నారు. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో నెలకొంటున్న గందరగోళంపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జునఖర్గే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. ప్రధాని మోడీ వచ్చి మాట్లాడమని మేం కోరుతున్నాం. ఆయన మౌనం ఆయన ప్రతిష్టకే భంగం కలిగిస్తుంది. దేశ ప్రజలకు మేం కట్టుబడి ఉన్నాం. అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటాం అంటూ లేఖలో పేర్కొన్నారు. ప్రధాని మోడీ గైర్హాజరు విపక్ష సభ్యులు నిలదీయడంతో సభలో గందరగోళం నెలకొనగా లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. బిఆర్ఎస్ ఎంపిల అవిశ్వాస తీర్మానంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ సంతకం చేశారు. రాజ్యసభలో కాంగ్రెస్ నేత మల్లిఖార్జునఖర్గే మైక్‌ను ఆపేశారంటూ ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. మైక్ ఆపేయడం వల్ల తన ఆత్మగౌరవం దెబ్బతిందని వాదించారాయన. అయితే తాను మైక్ ఆపలేదని చైర్మన్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. అయినా ఆ వివరణతో ప్రతిపక్ష సభ్యులు సంతృప్తి చెందక నిరసన కొనసాగిస్తున్నారు. రాజ్యసభలోనూవిపక్షాల మొండిపట్టు. మణిపూర్‌పై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. మణిపైర్ పరిస్థితులపై ప్రధాని మోడీ స్పందించాలని బిఆర్ఎస్ ఎంపిలు డిమాండ్ చేశాయి. లోక్‌సభలో ఎన్డీయే కూటమి బలం 330, ఇండియా కూటమి బలం 141, ఏ కూటమిలో లేని మరో 64 మంది ఎంపిలు. ఆరు ఎంపి స్థానాలు ఖాళీ ఉన్నాయి. అవిశ్వాస తీర్మానంపై 50 మంది ఎంపిలు సంతకం చేశారు. వీగిపోతుందని తెలిసికూడా. అవిశ్వాసంతో మణిపూర్ అంశంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చే దిశగా విపక్షకూటమి ప్రయత్నిస్తోంది. మణిపూర్ అంశంపై విపక్ష కూటమి ప్రభుత్వంపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను అడ్డుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రధాని చర్చకు రావాలన్న డిమాండ్‌కు కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేయడం లేదు.

SINGAM KUIL RED WEDNESDAY
DrawDate on:26/07/23

DAY - SINGAM SERIES Dr No:197
1st Prize Rs.100000/- 965830
2nd Prize Rs.7000/- 37358
3rd Prize Rs.3500/-
08020 15746 23397 42944 45683
45963 64446 85633 89789 90962
4th Prize Rs.200/-
0453 0477 2704 3186 4367 5268 5505
8160 9037 9875
5th Prize Rs.100/-
1237 1820 2104 3180 5779 7124 7600
8205 8936 9960
6th Prize Rs.50/-
0245 1572 3406 4525 6436 8474 9635
0320 1789 3420 4588 6498 8560 9650
0361 1812 3480 4611 6601 8591 9733
0386 1823 3533 4702 6611 8660 9764
0494 2093 3705 4781 6837 8867 9806
0627 2144 3737 4788 6840 8893 9872
0711 2227 3873 5048 6985 8932 9897
1309 2327 3877 5329 7429 8939 9908
1330 2582 3916 5342 7545 8963 9910
1331 2707 3962 5442 7603 9016 9953
1407 3014 4178 5466 7615 9054
1420 3016 4187 5787 7754 9117
1466 3071 4273 5826 7978 9297
1502 3072 4396 5829 8159 9369
1556 3216 4409 6348 8164 9428

DAY - KUIL SERIES Dr No:197
1st Prize Rs.100000/- 253459
2nd Prize Rs.7000/- 16405
3rd Prize Rs.3500/-
01346 10403 18242 43523 58854
62672 67535 84444 90639 91827
4th Prize Rs.200/-
1046 1282 1864 1880 5105 5506 6045
6193 7565 9984
5th Prize Rs.100/-
0529 1561 3217 4666 6467 6948 7362
7598 8000 9387
6th Prize Rs.50/-
0223 1188 2230 3210 5613 7224 8704
0388 1201 2289 3400 5730 7289 8776
0496 1231 2650 3498 5912 7299 8959
0543 1298 2662 3546 6170 7373 8998
0558 1314 2847 3695 6302 7417 9021
0596 1393 2851 4178 6468 7447 9133
0663 1674 2889 4320 6516 7458 9465
0865 1717 2915 4322 6565 7597 9670
0894 1754 2920 4359 6618 7631 9685
0944 1775 3000 4376 6786 7721 9779
0948 2058 3021 4405 6955 7764
1068 2097 3074 4483 7005 7784
1096 2139 3116 4720 7026 7870
1138 2167 3165 5276 7047 8145
1143 2198 3180 5458 7145 8363

ROSA DEAR PEARL WEDNESDAY
DrawDate on:26/07/23

DAY - ROSA SERIES Dr No:197
1st Prize Rs.100000/- 594593
2nd Prize Rs.7000/- 25617
3rd Prize Rs.3500/-
12518 39334 46287 50507 56979
61998 78425 80789 86859 89032
4th Prize Rs.200/-
0040 0504 0923 2577 3606 4232 4751
5136 6453 6526
5th Prize Rs.100/-
0006 1917 2653 3547 4396 4890 7637
7897 9013 9644
6th Prize Rs.50/-
0127 1778 4037 5580 6507 7604 9224
0137 1907 4055 5703 6582 7646 9239
0188 2563 4111 5751 6835 7675 9348
0280 2695 4120 5800 6852 7691 9387
0518 2722 4239 5890 6929 7766 9397
0631 2906 4248 5892 7033 7843 9572
0688 2989 4714 5980 7135 8041 9648
0756 3037 4862 6090 7247 8194 9752
0775 3052 4884 6095 7336 8231 9783
0930 3281 4930 6134 7338 8316 9809
1003 3402 5006 6199 7399 8387
1084 3587 5238 6290 7440 8819
1235 3659 5377 6356 7544 8830
1567 3832 5406 6456 7587 9150
1574 3840 5541 6459 7597 9218

DAY - DEAR SERIES Dr No:197
1st Prize Rs.100000/- 193428
2nd Prize Rs.7000/- 52605
3rd Prize Rs.3500/-
01090 14444 17014 49468 50234
69397 71824 71920 74491 90484
4th Prize Rs.200/-
0006 0419 0714 1674 2421 2665 3634
4638 5203 8574
5th Prize Rs.100/-
1360 3998 4026 4063 4350 4960 6417
8126 8256 8828
6th Prize Rs.50/-
0007 1387 2640 4989 6680 7847 9047
0105 1577 2710 5131 6685 7851 9144
0115 1591 2842 5160 6879 7903 9255
0215 1854 2858 5298 6909 7968 9302
0297 2003 2965 5583 6934 8222 9335
0330 2058 2971 5710 6962 8223 9378
0394 2071 3139 5750 7036 8368 9587
0423 2077 3300 5789 7272 8386 9791
0450 2151 3469 5826 7331 8516 9828
0700 2262 3503 5974 7351 8619 9998
0744 2272 3534 6034 7517 8808
1049 2337 4037 6057 7522 8819
1281 2488 4354 6066 7559 8841
1342 2494 4800 6483 7675 8897
1345 2495 4850 6585 7778 9021

THANGAM VAIRAM FORTUNE WEDNESDAY
DrawDate on:26/07/23

DAY - THANGAM SERIES Dr No:197
1st Prize Rs.100000/- 738176
2nd Prize Rs.7000/- 30713
3rd Prize Rs.3500/-
01604 04267 06162 15528 18322
27993 48446 75609 89752 99671
4th Prize Rs.200/-
1417 2689 3278 3972 4388 6118 7579
7761 8195 9921
5th Prize Rs.100/-
0199 1226 1853 2605 2643 3251 4913
8116 9746 9879
6th Prize Rs.50/-
0051 1190 2683 4221 6202 7973 9315
0208 1244 2805 4243 6261 8048 9348
0209 1367 2821 4504 6330 8300 9525
0269 1369 2870 4655 6450 8306 9574
0389 1412 2878 4664 6665 8375 9604
0543 1424 3061 4836 6803 8677 9609
0654 1464 3077 4900 7030 8693 9638
0682 1487 3142 4959 7065 8776 9806
0772 1602 3236 5001 7110 8812 9820
0854 1683 3315 5225 7128 8986 9904
0868 1837 3454 5429 7625 8993
0870 1935 3590 5906 7629 9071
1048 2231 3593 6002 7744 9153
1096 2678 3868 6057 7762 9242
1109 2681 4105 6194 7924 9265

DAY - VAIRAM SERIES Dr No:56
1st Prize Rs.50000/- 417385
2nd Prize Rs.7000/- 42608
3rd Prize Rs.3500/-
29783 35077 48632 64163 79350
84454 90972 91788 96409 97416
4th Prize Rs.200/-
1857 2556 4799 4819 6109 6399 6747
7379 8046 8126
5th Prize Rs.100/-
0595 0845 2819 3299 4124 5365 5409
5987 6427 8651
6th Prize Rs.50/-
0206 2342 3522 4884 6449 7793 9088
0330 2372 3546 4897 6504 7798 9196
0598 2398 3637 4903 6652 7827 9398
0795 2400 3765 4960 6703 7909 9553
1043 2698 3780 4979 6713 7956 9574
1104 2745 3852 5065 6715 7976 9580
1109 2800 3941 5194 6802 8272 9611
1596 2936 3980 5200 6819 8311 9760
1760 3023 3998 5610 7311 8411 9911
1793 3072 4017 5611 7497 8628 9997
1871 3136 4058 5884 7570 8662
1873 3158 4135 6006 7581 8827
1935 3271 4274 6086 7711 8879
1990 3296 4446 6142 7722 9070
2102 3460 4625 6421 7734 9085

NALLANERAM MANI FORTUNE WEDNESDAY
DrawDate on:26/07/23

DAY - NALLANERAM SERIES Dr No:197
1st Prize Rs.50000/- 792172
2nd Prize Rs.7000/- 94543
3rd Prize Rs.3500/-
09042 38200 62210 64499 73131
76986 78433 79795 86399 94036
4th Prize Rs.200/-
2493 3270 3481 4092 5947 6301 6451
6741 8849 9626
5th Prize Rs.100/-
0770 0924 2877 3055 5106 6718 6912
9441 9477 9786
6th Prize Rs.50/-
0063 1445 3011 4509 6274 8022 9002
0210 1597 3053 4574 6444 8123 9035
0282 1616 3144 4882 6595 8146 9184
0432 1754 3152 4960 6656 8155 9230
0846 1920 3332 5043 6785 8269 9269
0977 2084 4052 5119 6836 8475 9493
0981 2241 4109 5213 6860 8643 9522
1037 2503 4110 5458 6870 8673 9590
1118 2512 4153 5483 6883 8681 9817
1158 2559 4208 5577 7138 8747 9842
1200 2604 4252 5689 7146 8775
1262 2855 4298 5821 7167 8839
1298 2942 4308 6156 7422 8873
1312 2944 4340 6182 7444 8965
1423 2978 4438 6217 7805 8975

DAY - MANI SERIES Dr No:56
1st Prize Rs.50000/- 943696
2nd Prize Rs.7000/- 08967
3rd Prize Rs.3500/-
21164 40626 43220 48768 63880
80079 80302 87898 91106 93643
4th Prize Rs.200/-
0379 1459 4322 4449 4502 5511 6024
6784 8815 9619
5th Prize Rs.100/-
0684 2908 3438 4161 5460 6003 6955
7173 8867 9786
6th Prize Rs.50/-
0038 1465 3250 4526 5913 6780 8726
0130 1682 3299 4633 5918 7018 9173
0170 1835 3414 4846 5996 7040 9198
0233 1889 3419 4874 6450 7051 9301
0486 1895 3476 4927 6460 7391 9417
0530 1936 3502 5231 6481 7431 9624
0607 2257 3513 5366 6533 7490 9633
0637 2328 3771 5426 6561 7971 9644
0662 2436 4097 5440 6576 8030 9861
0803 2491 4177 5452 6602 8079 9999
0929 2669 4264 5554 6607 8097
1136 2759 4328 5583 6655 8198
1297 2886 4401 5653 6703 8258
1426 3045 4431 5707 6711 8266
1456 3144 4471 5751 6768 8670

KUMARAN VISHNU STAR WEDNESDAY
DrawDate on:26/07/23

DAY - KUMARAN SERIES Dr No:197
1st Prize Rs.50000/- 633928
2nd Prize Rs.7000/- 48112
3rd Prize Rs.3500/-
19401 26182 40130 43896 61663
72641 74990 82178 85913 88886
4th Prize Rs.200/-
1906 1935 2169 3414 3918 4089 5855
7273 7710 9076
5th Prize Rs.100/-
1643 2409 3381 4627 5062 5680 5828
6083 6251 6360
6th Prize Rs.50/-
0079 1133 2597 4762 6634 7298 8592
0127 1182 2619 4863 6724 7383 8646
0218 1272 3016 4911 6796 7518 8675
0224 1430 3056 5023 6834 7618 9188
0528 1568 3191 5118 6884 7689 9397
0538 1753 3261 5247 6908 7722 9508
0610 1881 3354 5345 6919 7802 9740
0659 2041 3805 5357 6960 7909 9795
0717 2049 3914 5394 6966 7995 9910
0792 2104 4290 5460 6978 8028 9950
0851 2255 4320 5506 7047 8045
0948 2345 4461 5812 7061 8057
1051 2357 4463 5822 7122 8143
1090 2378 4549 5988 7164 8216
1118 2400 4550 6058 7216 8416

DAY - VISHNU SERIES Dr No:197
1st Prize Rs.50000/- 846577
2nd Prize Rs.7000/- 54686
3rd Prize Rs.3500/-
20030 20597 33886 34342 37773
38189 39292 60926 68237 88497
4th Prize Rs.200/-
2658 3430 3673 4066 5277 6168 6560
7706 9784 9871
5th Prize Rs.100/-
0646 2144 2202 3353 4307 6439 7108
7130 9324 9789
6th Prize Rs.50/-
0019 1858 3035 3911 5118 6782 8735
0038 1864 3144 3996 5191 6817 8865
0123 1889 3211 4122 5198 6871 9101
0169 1893 3212 4188 5439 7242 9179
0198 2120 3219 4190 5463 7456 9281
0254 2266 3268 4200 5610 7560 9344
0559 2483 3347 4205 5708 7590 9528
0578 2527 3349 4245 5985 7869 9668
0594 2710 3424 4326 6094 8149 9928
0595 2715 3515 4389 6210 8235 9975
0900 2734 3567 4631 6227 8357
1233 2743 3728 4714 6270 8480
1599 2823 3786 4844 6496 8533
1762 2834 3818 4874 6612 8534
1848 2964 3879 4972 6726 8676

SWARNALAXMI LION EMERALD WEDNESDAY
DrawDate on:26/07/23

SWARNALAXMI SERIES Dr No:197
1st Prize Rs.50000/- 672117
2nd Prize Rs.7000/- 26827
3rd Prize Rs.3500/-
15606 26514 48129 59149 59932
61314 72408 72735 83219 94856
4th Prize Rs.200/-
0972 1171 1542 1545 1561 3913 5728
6849 7575 9584
5th Prize Rs.100/-
0938 1723 2390 3594 4063 4729 6275
8469 8497 9257
6th Prize Rs.50/-
0185 1588 3265 4764 6558 7473 9223
0250 1633 3355 5258 6561 7489 9245
0353 1725 3484 5445 6645 7490 9277
0395 1815 3528 5469 6649 7625 9523
0552 1847 3561 5493 6656 7692 9524
0663 1961 3672 5524 6834 8114 9583
0733 1975 3701 5736 6919 8205 9635
0786 1979 3837 5939 6980 8290 9646
0811 2554 4148 6193 7007 8335 9938
1119 2644 4364 6254 7040 8383 9992
1174 2779 4389 6318 7138 8701
1215 2809 4417 6470 7172 8952
1233 2839 4649 6476 7306 9041
1290 2880 4703 6490 7374 9068
1454 3228 4721 6539 7406 9122

DAY - LION SERIES Dr No:56
1st Prize Rs.50000/- 647677
2nd Prize Rs.7000/- 58872
3rd Prize Rs.3500/-
14342 25266 36350 36818 47224
58249 69589 71644 82715 93513
4th Prize Rs.200/-
0488 3854 4224 5707 6492 6838 7125
7195 7380 9112
5th Prize Rs.100/-
0041 0306 3714 4092 4121 4135 5789
6294 7128 9607
6th Prize Rs.50/-
0022 1649 2899 4563 5680 7105 8813
0044 1688 3244 4779 5693 7140 8855
0227 1700 3316 4847 5695 7241 9045
0491 1821 3380 4862 5714 7397 9177
0510 2006 3609 5061 5881 7433 9380
0632 2026 3683 5077 5966 7502 9755
0753 2153 4138 5089 6049 7559 9867
0809 2165 4158 5119 6122 7844 9912
0834 2361 4285 5140 6176 8284 9915
0894 2430 4366 5141 6328 8302 9964
1093 2460 4427 5395 6429 8444
1137 2530 4456 5604 6472 8465
1492 2664 4490 5620 6558 8745
1498 2671 4500 5632 6931 8753
1525 2831 4510 5656 6994 8782

# గోదావరి-శబరి నదుల ఉగ్రరూపం


## పొంచి ఉన్న మరో అల్పపీడనం

## నీటమునిగిన భద్రాచలం-కూనవరం రహదారి

**చింతూరు జులై26 ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా కుండపోతగా వర్షం కురుస్తుంది. దాంతో గోదావరి-శబరి నదులు ఉగ్రరూపం దాల్చాయి. భద్రాచలంవద్ద గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 48 అడుగులు దాటగా చింతూరు వద్ద శబరినది నీటిమట్టం 33 అడుగులు దాటింది. గత వారం రోజులుగా గోదావరి-శబరి నదుల్లో వరద ఉధృతి దోబూచులాడుతుండగా తాజాగా గత రాత్రి నుండి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న కుంభ వృష్టితో గంటల వ్యవధిలో గోదావరి-శబరి నదుల్లో 3అడుగులు మేర వరద ఉధృతి పెరగటం గమనార్హం. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనంతో పాటు మరో అల్పపీడనం పొంచి ఉన్నట్టు వాతావరణ శాఖ సూచిస్తుంది. భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరికకు చేరువలో గోదావరి నీటి మట్టం ఉండటంతో భద్రాచలం-కూనవరంల మధ్య రహదారి నీట మునిగింది. గంటల వ్యవధిలో గోదావరి-శబరి నదుల్లో మూడు అడుగులు మేర పెరగటంతో ముంపుప్రాంతాల్లో అలజడి మొదలైంది. గత ఏడాది పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న భయం లోతట్టు ప్రాంతాల ప్రజల గుండెల్లో రైళ్ళు పరుగెట్టిస్తుంది. గోదావరి, శబరి ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సాల్లో 86.4మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ఛత్తీస్‌ఘడ్‌లో భారీ వర్షాల కారణంగా చర్ల మండలంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగటంతో దాదాపు 25గేట్లను ఎత్తి సుమారు 2లక్షల క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. దాంతో భద్రాచలం-చర్ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఏడాదిలో తాలిపేరు నుండి 2లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదలటం ఇదె తొలిసారి. తెలంగాణాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తం అయ్యారు. తెలంగాణాలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కుంభ వృష్టితో వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. దాంతో భద్రాచలం దగ్గర గోదావరికి వరద ఉధృతితో ఉరకలేస్తుంది. దాదాపు 11లక్షల క్యూసెక్కుల వరద నీరు క్రిందకు వెళ్ళుతున్నట్టు అంచనా వేస్తుంది సిడ్ల్యుసి. చింతూరు వద్ద శబరి నది నీటి మట్టం గంట గంటకు పెరుగుతుంది. ఉదయం చింతూరు వద్ద 29 అడుగులు మాత్రమే ఉన్న శబరి గంటల వ్యధిలో నాలుగు అడుగులు పెరిగింది. దాంతో చింతూరు నుండి ఒరిస్సాను కలిపే రహదారి నీటి మునిగింది. చింతూరు నుంచి వి.ఆర్.పురం మండలాలను కలిపే రహదారి మొత్తం వాగులు పొంగి పొర్లుతుండటంతో వంతెనలు మునిగిపోయి రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఏడాది శబరి నది నీటి మట్టం తొలిసారిగా 33 అడుగులు దాటింది. శబరి నది ఎగువ ప్రాంతాలైన ఛత్తీస్‌ఘడ్ లోని సుకుమాలో 87మిల్లీమీటర్లు, మల్కనగిరిలో 49మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. సీలేరు ఎగువ ప్రాంతాల్లో కుంభ వృష్టితో సీలేరు కాంప్లెక్స్‌లోని జలశయాల్లోకి వరదనీరు వచ్చి చేరుతుంది. దాంతో విద్యుత్ ఉత్పత్తిని రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. ఒక్క సీలేరు కాంప్లేక్స్‌లోని వివిధ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 99855మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రికార్డును తిరగరాశారు. ప్రస్తుతం సీలేరు నదికి ఎగువ భాగంలో ఉన్న జోలపూట్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 2750అడుగులు కాగా ప్రస్తుతం 2702 అడుగుల వద్ద పెరుగుతుంది. బలిమేల (ఒరిస్సా) ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1510 అడుగులు కాగా ప్రస్తుతం 1464 అడుగుల వద్ద పెరుగుతుంది. సీలేరు డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1360 అడుగులు కాగా ప్రస్తుతం 1341 అడుగుల వద్ద పెరుగుతుంది. డొంకరాయి డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా 960 అడుగుల వద్ద పెరుగుతుంది. ఇది సీలేరు నదిపై ఉన్న ప్రాజెక్టుల్లో పరిస్థితి. ఇక శబరి నది ఎగువ ఉన్న ఇంద్రావతి నదిలో కాస్త వరద ఉధృతి తగ్గినట్టు తెలిసింది. పరిస్థితిని దృష్టిలో పెట్టు కొని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు ఎవరి వారు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవటం శ్రేయస్కరం. మరో రెండు రోజులు వర్షాలు ఇలానే కురిసే అవకాశం ఉన్నట్టు వాతవరణ శాఖ హెచ్చరిస్తుంది.

# తోటపల్లి కుడి కాలువకు గండి

**బొబ్బిలి, జులై 26,ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం అలజంగి గ్రామం వద్ద తోటపల్లి ఇరిగేష్‌ప్రోజెక్టు కుడికాలువ గండి పడింది. కాలువ గండి పడడంతో కాలువ క్రిందున్న నారుమడులు కొట్టుకు పోయాయి. దీనితో 50 ఎకరాలు భూమి పంటనష్టం జరిగినట్లు రైతులు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు వద్ద గోడు వినిపించుకొన్నారు. ఆయన గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి నీటిపారుదల శాఖ అధికార్లు, మండల రెవిన్యూ అధికార్లువీటిపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈకాలువ పటిష్టతకోసం జిల్లా కలెక్టర్, మంత్రిదృష్టికి తీసుకువెళ్లితామని అన్నారు. పంటనష్టం కట్టి రైతులు నష్టపరిహారం వచ్చే విదంగా చర్యలుతీసుకోవాలని అన్నారు. సిమెంట్ కట్టడాలే ఇలా గరిపడ్డాదంటే నాసిరం పనులే దీనికి ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు.



డిఈ కుమార్‌ను వివరణ కోరగా 31.625దగ్గర గండి పడిందని ,గతంలో రేక్ హోల్స్ వల్లగండి పడ్డాదని అన్నారు. ఇప్పుడు లైనింగ్‌వద్ద గండి పడిందని అన్నారు.

## వారం - వర్జ్యం

27-7-2023 గురువారం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, అధిక శ్రావణ మాసం, శుక్ల పక్షం, కార్తె పుష్యమి
నవమి ఉ.09-59; విశాఖ రా.09-08
వర్జ్యం రా.01-07 ల 02-42
రా.కా.మ.1-30 ల 3-00 వ
యమగండం ఉ.6-00 ల 7-30 వ
దుర్ముహూర్తం ఉ.10-00 ల 10-48 వ
మ.2-48 ల 3-36 వ

## వార్తాఫలం

**మేషం:** వాహన యోగం. పని వత్తిడి అధికంగా ఉంటుంది. చర్చలు వాయిదా.

**వృషభం:** సమస్యలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. వ్యాపారులకు లాభాలు.

**మిథునం:** ఆరోగ్య సమస్యలు ఉంటాయి. ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కర్కాటకం:** ఆర్థికాభివృద్ధి బాగుంటుంది. ఉత్సాహంగా గడుస్తుంది.

**సింహం:** సామాన్య ధన లాభం. ఎదురు చూస్తున్న శుభ వార్తలు వింటారు.

**కన్య:** ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి.

**తుల:** అన్ని వ్యవహారాల్లో విజయం. ప్రయాణ సూచనలున్నాయి.

**వృశ్చికం:** దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. ఆరోగ్య సలహాలు పాటించండి.

**ధనుస్సు:** సామాజిక సంఘర్షణకు లోనవుతారు. స్త్రీలకు శుభ యోగం.

**మకరం:** రుణాలు తీరుస్తారు. బంధు, మిత్రులను కలుసుకుంటారు.

**కుంభం:** ఉద్యోగులకు సమస్యలు ఉంటాయి. వ్యాపారులకు బాగుంటుంది.

**మీనం:** దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. ఆర్థికంగా బాగుంటుంది.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

# అభివృద్ధి దిశగా విద్యావిధానం

## విద్యార్థుల అభిరుచికి తగిన సాంకేతిక విద్య

## తిరుపతి ఐఐటిటి డైరెక్టర్ సత్యనారాయణ


మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

**శ్రీకాళహస్తి, జులై 26 ప్రభాతవార్త:** తిరుపతి ఐఐటిటిలో విద్యార్థుల అభిరుచికి తగిన విద్యను అందించటమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధిదిశగా పయనించేవిద్యావిధానాన్ని రూపొందించినట్లు డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. బుధవారం డైరెక్టర్ సత్యనారాయణ ప్రభాతవార్తతో మాట్లాడుతూ భవిష్యత్తు కోసం ఒక విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. కొత్తగా ఇక్కడ ఏర్పాటు చేసిన ఐఐటిటిలో సకల సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. పూర్తి స్థాయి తరగతులు, హాస్టల్ సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. జాతీయ స్థాయిలో ఐఐటిటికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావటానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. సహకారం, జ్ఞాన మార్పిడి బహుళ విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించే శక్తి వంతమైన, చైతన్యవంతమైన విద్యా, పర్యావరణ వ్యవస్థను రూపొందించటానికి కృషి చేస్తున్నామని వివరించారు.

**2020 ఎన్‌ఇపి సూత్రాలతో విద్యావిధానం:**
కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్ఇపి 2020 సూత్రాలను స్వీకరించటం ద్వారా, విద్యాసమూహాలను ఏర్పాటు చేయటం ద్వారా విద్యాసంస్థలో విద్యార్థులకు వారు ఎంచుకున్న రంగాలలో రాణించటానికి, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనటానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానాన్ని సమకూర్చటం ద్వారా విద్యార్థులకు సంపన్నమైన విద్యావిధానాన్ని, అనుభవాన్ని అందించుటకు లక్ష్యంగా రూపొందించినట్లు డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు.
తమ సంస్థ ప్రాంతీయ అభివృద్ధికి, సమ్మిళిత విద్యకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర మరియు స్థానిక విశ్వవిద్యాలయాకల సహకారం ద్వారా సంస్థ చురుకుగా ఆంధ్రప్రదేశ్ స్థానిక క్లస్టర్‌గా అభివృద్ధి చెందుతుంది. ఈ చొరవ బోధన, అభ్యాస పద్ధతులను మెరుగుపరచుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని సత్యనారాయణ వివరించారు.

**ఎడ్యుకేషన్ క్లస్టర్ల ఏర్పాటు:**
తిరుపతి ఐఐటిటి విద్యాక్లస్టర్లను ఏర్పాటు చేయటం ద్వారా సమీకృత బోధన, అభ్యాసాన్ని మెరుగుపరచటానికి చురుకైన చర్యలు తీసుకుంటుందన్నారు. తిరుపతి ఐసర్ మధ్య విజ్ఞానం, క్రేడిట్‌లను బదిలి చేయటానికి విద్యార్థులకు సమగ్ర విద్యా అనుభవాన్ని ప్రోత్సహించటానికి ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ వివరించారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (విజయవాడ) మరియు నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ డిజైన్ వంటి ఇతర విద్యా సంస్థలతో కూడా ఇలాంటి సహకారాలు చేయబడుతున్నాయని ఆయన వివరించారు. పాఠ్యప్రణాళిక సంస్కరణలతో పాటు పరిశోధన-కేంద్రీకృత అభ్యాసం దూర విద్య అవకాశాలను ప్రోత్సహించటంపై చురుకుగా దృష్టి సారించింది. సెంటర్ ఫర్ స్పాన్సర్డ్ రిసెర్చ్ సెల్ స్థాపన పరిశోధన కార్యక్రమాలను ప్రోత్సహించే పరిశ్రమ, అంతర్జాతీయ సహకారాలతో సహకారాన్ని సులభతరం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంచే స్పాన్సర్ చేయబడిన ఇండియన్ నాలెడ్జ్ సెంటర్, భారతీయ సైన్స్, టెక్నాలజీ, కళలు, సంస్కృతికి సంబంధించిన ప్రాజెక్టులను చేపడుతుందని వివరించారు.

**అందుబాటులో ఉన్న కోర్సులు:**
ఐఐటిటి తన విద్యాక్రమాలలో జాతీయ విద్యా విధానం తీసుకురావటానికి అమలు చేస్తున్నట్లు డైరెక్టర్ సత్యనారాయణరావు వివరించారు. బిటెక్ పాఠ్యాంశాల్లో గణనీయమైన మార్పులు చేసిందని వివరించారు.
ప్రస్తుతం ఐఐటిటిలో అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను అందిస్తుందన్నారు. బిటెక్ ప్రోగ్రామంలో కంప్యూటర్ సైన్స్, మెకానికల్‌ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లతో పాటు ఇన్‌స్టిట్యూట్ అన్ని ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లతో ఎంటెక్, ఎంఎస్ ప్రోగ్రామ్‌లను అందిస్తుందన్నారు.
ఎంఎస్‌సి గణితం, భౌతిక శాస్త్రం మరియు రసాయన శాస్త్రంలో పబ్లిక్ పాలసీల్లో ఎం.ఫిల్ పిహెచ్‌డి అన్ని విభాగాలలో కార్యక్రమాలను రూపొందించినట్లు వివరించారు. భారత దేశంలో తిరుపతి ఐఐటిటి(ఏర్పేడు)ని అత్యున్నత విద్యాసంస్థగా తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు వివరించారు. విద్యార్థులకు ఆకర్షణీయమైన హాస్టల్ వసతి కల్పించినట్లు వివరించారు. రాబోవు రోజుల్లో శివయ్య పాదాల చెంత వెలసిన ఐఐటిటి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నట్లు వివరించారు.


హీట్ షీల్డ్‌లో సింగపూర్ ఉపగ్రహాల అమరిక

# కమ్మర్షియల్ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం

## షార్‌లో లాంచ్ రిహార్సల్స్ ప్రారంభం

**శ్రీహరికోట (తడ), జూలై 26 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో పక్కా కమర్షియల్ రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 30న ఉదయం 6.30 గంటలకు పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి పంపుతున్నారు. డిఎస్-సార్ శాటిలైట్ ఇందులో ప్రధానమైనది. ఇది కాకుండా వెలాక్స్ ఎఎం, ఆర్కేడ్, స్కూబ్-2, నులియన్, గెలాసియా-2, ఓఆర్‌బి-12 ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో ఉదయం పూట రాకెట్ ప్రయోగాన్ని వీక్షించడానికి సందర్శకులను ఆహ్వానించారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా పలువురు పేర్లు నమోదు చేసుకున్నారు. పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్ పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో 58వది. శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదికపై లాంచ్ రిహార్సల్స్ కొనసాగుతున్నాయి. నాలుగు దశల పిఎస్ఎల్‌వి రాకెట్‌ను ఈ సారి స్ట్రాపాన్ బూస్టర్లు లేకుండా కోర్ అలాన్ తరహాలో రూపొందించారు. ప్రస్తుతం ఉపగ్రహాలను రాకెట్ శీర్షభాగంలోని హీట్ షీల్డ్ మధ్య అమర్చారు. ఈనెల 28న లాంచ్ ఆథరైజేషన్ బోర్డు, మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశాలు నిర్వహించి ప్రయోగ సమయాన్ని నిర్ధారిస్తారు. అయితే ప్రస్తుతానికి 30న ఉదయం 6.30 గంటలకు ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రయోగం ద్వారా భారత్‌కు లాభాలు ఆర్జించే అవకాశం ఉంది.

# పవన్ పెళ్లిళ్ల కంటే బాబాయ్ హత్య తప్పు

## జగన్‌కు నారాయణ కౌంటర్

**అమరావతి, జులై 26, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పదేపదే పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్ల గురించి ప్రస్తావించడం ఆయన సిఎం హోదాను మరిచి మాట్లాడుతున్నట్లు ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. మణిపూర్ అల్లర్లకు సంబంధించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హోదాను మరిచి వ్యాఖ్యానాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. మూడు పెళ్లిళ్ల కంటే బాబాయ్‌ను చంపడం పెద్ద తప్పుగా ఆయన చెప్పారు. పవన్ కల్యాణ్ ముగ్గురితో కాపురం చేయడ లేదని, విడాకులు ఇచ్చారని ఆయన అన్నారు. వివేకానందరెడ్డి హత్యను పరోక్షంగా ప్రస్తావిస్తూ మూడు పెళ్లిళ్లు చేసుకుంటే జగన్‌కు ఏం సమస్య అని ప్రశ్నించారు. మూడు పెళ్లిళ్లు తప్పా, బాబాయ్‌ని హత్య చేయడం తప్పా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బాబాయ్‌ను చంపడం తప్పు కాదని జగన్ చెబుతారా అని ఆయన అన్నారు. సిఎం హోదాను మరిచి దిగజారి మాట్లాడటం సరికాదని ఆయన చెప్పారు. రాజకీయపరంగా ఎవరినైనా ప్రశ్నించవచ్చని, అయితే వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని ఆయన జగన్‌కు హితవు పలికారు. రాజకీయంగా విమర్శించడానికి ఏమీ లేకపోవడం వల్ల జగన్మోహన్‌రెడ్డి ఇలాంటి విమర్శలు చేస్తున్నారని నారాయణ అభిప్రాయపడ్డారు. జగన్మోహన్‌రెడ్డి ఇటీవల తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ వివాహాల గురించి ప్రస్తావించి విమర్శలు చేశారు. దీనితో నారాయణ ఇలాంటి విమర్శలు చేయడం సరికాదని చెప్పారు.



# వేంకటేశ్వరస్వామి దయతో ప్రజలు ఆయురారోగ్యాలతోఉండాలి

## మాజీ ఎంపి లగడపాటి

**తిరుమల, జులై 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ తెలిపారు. చాలా రోజుల తరు వాత కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చానని, ఉదయం దేవదేవుని దర్శనం చేసుకున్నానన్నారు. దేవుని దర్శనం కోసం వచ్చానని, సన్నిధిలో రాజకీయాలు మాట్లాడబోనని అన్నారు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆలయం వద్దకు చేరుకున్న లగడపాటి రాజగోపాల్ ఆలయంలోనికి చేరుకున్నారు. ఇష్టదైవం వెంకన్నను దర్శించుకున్నారు.

# 28నుంచి వారణాశిలో చతుర్వేద హావనం



**తిరుమల,జులై 26 ప్రభాతవార్తప్రతినిధి:** వారణాశిలోని శివాల ప్రాంతంల సమీపంలో ధాట్‌సింగ్ పోర్ట్ వద్ద జులై 28నుండి ఆగస్టు 3వతేదీ వరకు ఎస్వీ ఉన్నత వేదాధ్యయనసంస్థ ఆధ్వర్యంలో శ్రీనివాస చతుర్వేద హావనం నిర్వహిస్తున్నారు. లోకక్షేమం, ఆరోగ్యం, ఐశ్వర్య వృద్ధికోసం అలాగే అతివృష్టి. అనావృష్టి నుంచి ప్రపంచాన్ని కాపాడాలని వేడుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ చతుర్వేద హావనానికి హోమ గుండాలు ఏర్పాటుచేసి, ఏడు రోజులపాటు నాలుగువేదాల్లోని అన్ని మంత్రాలను పఠించి యజ్ఞేశ్వరునికి సమర్పణ చేస్తారు.



# భక్తులకు అందుబాటులోకి అగ్రసేన్ విశ్రాంతి భవనం

**తిరుమల, జులై 26ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో యాత్రికుల వసతి సౌకర్యం కోసం హైదరాబాద్‌కు చెందిన ఓమ్‌ప్రకాశ్ అగర్వాల్, సునీత అగర్వాల్ సంయుక్తంగా నిర్మించిన జగదీశ్ నారాయణి రెస్ట్ హౌస్(అగ్రసేన్)ను బుధవారం టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ప్రారంభించారు. నూతనంగా ఆధునీకరించిన ఈ భవనాన్ని దాతలతో కలసి ఛైర్మన్ యాత్రికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వసతికల్పన విభాగం డిప్యూటీ ఇఒ (ఆర్ 1)పి.హరీంధ్రనాథ్, ఓఎస్‌డి రామకృష్ణ, విజిఒ బాలిరెడ్డి, గిరిధర్ పాల్గొన్నారు

# 2024లో అధికారం మాదే

## కేసులెక్కువ ఉన్నవారికే నామినేటెడ్ పదవులు!

## శాసనసభ సాక్షిగా మా కుటుంబాన్ని అవమానించారు

## ఒంగోలు భారీ బహిరంగసభలో నారా లోకేష్


బుధవారం ఒంగోలు బహిరంగసభలో మాట్లాడుతున్న లోకేష్

**ప్రభాతవార్తప్రతినిధి, ఒంగోలు:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలుగుదేశం పార్టీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ధీమా వ్యక్తంచేశారు. లోకేష్ యువగళం పాదయాత్ర ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు కొనసాగింది. పాదయాత్ర అనంతరం మంగమూరు డొంకలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో టిడిపి జెండామోసిన కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుట్టామని, టిడిపి నాయకులను, కార్యకర్తలను వేధించిన ఏ ఒక్కరిని ఒదిలిపెట్టనని ఆయన పేర్కొన్నారు. కేసులెక్కువున్నవారే పార్టీ కోసం పోరాడినట్లని అదికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పదవులు ఇవ్వడం జరుగుతుందని స్పష్టంచేశారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌ది జైల్ లైఫ్ అని.. నాది కాలేజీ లైఫ్ అని ఎద్దేవాచేశారు. సంక్షేమానికి కేరాఫ్ అడ్రాస్ టిడిపి అయితే..దోపిడికి కేరాఫ్ వైఎస్సార్సీ అని ఆయన ఆరోపించారు. జగన్ చడ్డీలు వేసుకునే టైంలోనే దేశానికి సంక్షేమం పరిచయం చేసింది టిడిపి అని పేర్కొన్నారు. రెండు రూపాయలకే బియ్యం, పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు నిర్మించింది దివంగత నందమూరి తారకరామారావు అని పేర్కొన్నారు. సెంటుస్థలం పేరుతో 7వేలకోట్లు రూపాయల ప్రజాధనం లూటీ చేసింది జగనేనని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు అందరికి ఉచితంగా ఇళ్లు కట్టిస్తానన్నాడని, ప్రస్తుతం అప్పుచేసి ఇళ్లు కట్టకపోతే పట్టా లాక్కుంటున్నాడని ధ్వజమెత్తారు. అమరావతిలో 6నెలల్లో ఇళ్లు కడతానంటున్న జగన్ 4ఏళ్ల 3 నెలల్లో పేదలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు ఎందుకు నిర్మించలేదని ధ్వజమెత్తారు. 5 ఏళ్లలో తమ ప్రభుత్వం పేదవాడికి కట్టిన ఇళ్లు కట్టాలంటే జగన్ వంద జన్మలెత్తాలన్నారు. బాహుబలి సినిమాలో కుంతల రాజ్యాం చూసామని, జగన్ పాలనలో గుంతల పాలన చూస్తున్నామన్నారు. జగన్ రోడ్లపై ఒక్క గుంతకూడా పూడ్చలేదని ఆరోపించారు. రోడ్లపై ఉన్న గుంతల్లో మంచాలు వేసుకుని కొందరు, వరినాట్లు వెస్తూ కొందరు, చాపలు పడుతూ కొందరు నిరసన తెలుపుతున్నారని ఆయన ఆరోపించారు. శాసనసభ సాక్షిగా తన తల్లి భువనేశ్వరి, తన భార్య బ్రాహ్మణిని అవమానించారని, తనను కూడా అనేక సార్లు అవమానించారని, ఆసమయంలో ముఖ్యమంత్రి జగన్ నవ్వుకున్నాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారతిరెడ్డి గురించి, జగన్ ఇద్దరు కుమార్తెల గురించి మాట్లాడాలంటే నిమిషం పట్టదని, వాళ్లని విమర్శిస్తే జగన్ ఇలాగే నవ్వుకుంటాడా అని ప్రశ్నించాడు.
మహిళలంటే తమకు ఎంతో గౌరవమని అది గుర్తుపెట్టుకోవాలని ఆరోపించారు. జిల్లాలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి మంత్రి పదవి ఎందుకు పీకేశడో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి అడిగినందుకు పీకేశాడా..లేక అవినీతి హవాలా కుంభకోణాల గురించి పీకేశాడో చెప్పాలన్నారు. జగన్ పాలనలో ఒంగోలుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన మండిపడ్డారు. ఒంగోలుకు చెందిన కుప్పం ప్రసాద్‌ను వైశ్యకార్పొరేషన్ ఛైర్మన్‌ను చేసి 1000 కోట్లు ఇస్తానని జగన్ ప్రకటించాడని, ఆ నిధులు ఇచ్చాడా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించి, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. ఒంగోలులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుచేస్తామని, కొత్తపట్నం రోడ్‌లోని బకింగ్‌హాం కెనాల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలను ఫార్మహబ్బుగా తయారు చేస్తామన్నారు. టిడిపి నాయకులను, కార్యకర్తలను వేధించిన ఏఒక్కరిని ఒదిలిపెట్టనని లోకేష్ స్పష్టంచేశారు. వైఎస్సార్సీ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. జగన్ అదికారంలోకి వచ్చి కులానికో కుర్చి ఏర్పాటుచేసి అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. గుండ్లకమ్మను నాశనం చేశారని, ఆ ప్రాజెక్టు ప్రమాదంలో పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో జనార్ధన్ భారీ మెజార్టీతో గెలిపించాలని లోకేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఒంగోలు అభివృద్ధి చేసింది దామచర్ల జనార్ధనేని పేర్కొన్నారు. ఈ భారీ బహిరంగ సభలో ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కొండపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, వైపాలెం ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, దర్శి టిడిపి నాయకులు నారపుశెట్టి పాపారావు, కందుకూరు ఇంచార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఆడికృత్తిక మహోత్సవాలకు కుమారస్వామి కొండ ముస్తాబు

## ఆగస్టు 4 నుంచి ప్రారంభం


కుమారస్వామి కొండ దృశ్యం

**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త:** వచ్చేనెల 4 నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు నిలయంగా ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి నెల ఓ ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ నెపథ్యంలో ఆగస్టు 4 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో అంకుర్పారణతో ప్రారంభం అయ్యే ఉత్సవాలు కుమారస్వామితిప్పపై భక్తుల బాగస్వామ్యంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించటం ఆనవాయితి. ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్‌తో చర్చించారు. ఆయన వచ్చేనెల 4నుంచి ఉత్సవాలు ప్రారంభమౌతాయని వివరించారు.

**సంప్రదాయాలకు ప్రతీక ఉత్సవాలు:**
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉత్సవాలు మన సంప్రదాయాలు, సంస్కృతికి నిదర్శనాలని ధర్మకర్తల మండలిఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నెల నెలా ఓ ఉత్సవంతో నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్లు పట్టణం కళకళ లాడుతుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ఆలయం హృదయమని దీనిపై ప్రతి ఒక్కరి కన్ను ఉంటుందన్నారు. ఇక్కడి పాలన పారదర్శకంగా సాగాలన్నారు. ఒక్క మహాశివరాత్రి పర్వదినాన ఆలయంలో దర్శనంతప్ప మిగిలిన అన్ని ఉత్సవాలు కూడా జనంతో సంబంధం ఉన్నవే అన్నారు ధర్మరాజు స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిపిన అధికారులు అదే స్ఫూర్తితో రాబోవు ఆడికృత్తిక మహోత్సవాల్ని ఇంకా బాగా జరపాలని ఛైర్మెన్ అధికారులను కోరారు. గత ఏడాది ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన వెంటనే ఆడికృత్తిక వచ్చిందని ఈ ఏడాది సుమారు నెల వ్యవధి రావటంతో ఇంకా బాగా నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాసులు వివరించారు.

**ఉత్సవాలతో సందడి:**
'శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెలనెలా ఓ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. జూలై నెలలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు, అలాగే ఆలయంలోనూ, విజ్ఞాన గిరిపై వెలసిప కుమారస్వామి మహోత్సవాలు నిర్వహించటం ఆనవాయితీ. చెంగల్వరాయస్వామి ఉత్సవాలు ఆలయంలో నిర్వహించగా ఆడికృత్తిక నాలుగురోజులు భారీ ఎత్తున విజ్ఞాన గిరిపై ఉత్సవాలు నిర్వహించటం జరుగుతుంది. ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలి వస్తారు. కాబట్టి ఇక్కడ వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా వస్తారన్నారు. పట్టణంలోనూ పరిసర గ్రామాల్లో సుమారు 15వేల మందికి పైగా తమిళ సోదరులున్నారన్నారు. గతంలో శ్రీకాళహస్తికి చెందిన భక్తులు ఆడికృత్తికకు తిరుత్తణి వెళ్ళే వారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే నిర్వహిస్తున్నారని వివరించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజులఉత్సవాలు ఎలాంటి విమర్శలు, ఆరోపణలు లేకుండా పక్కా ప్రణాళికతో నిర్వహించారు. ఇందుకు దేవస్థానం పోలీసు, మున్సిపల్ అధికారులు సిబ్బందిని అభినందించాలి. ఆగస్టు 4 నుంచి ఆలయంలోనూ, 8 నుంచి విజ్ఞానగిరిపై జరిగే మహోత్సవాలను కూడా అంతే ప్రణాళికతో పోలీసుల సహకారంతో విజయవంతం చేస్తామన్నారు. తాను ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత వచ్చిన తరువాత నిర్వహిస్తున్న ఉత్సవాల్లో జవాబుదారితనంతో మంచి పేరు వస్తుం దన్నారు. అలాగే ఈ ఏడాది ఆడికృత్తిక మహోత్సవాల్ని కూడా గతంలో నిర్వహించని రీతిలో నిర్వహించాలని శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి సూచించారని ఈ మేరకు అధికారులకు ఏర్పాట్ల గురించి వివరించామన్నారు.

# సకాలంలో కర్ణాటక సత్రాల నిర్మాణం పూర్తిచేయాలి

## అవసరమైన డిజైన్లను అందించండి

## కర్ణాటక మంత్రితో టిటిడి ఇఒ ధర్మారెడ్డి సమీక్ష



**తిరుమల,జులై 26ప్రభాతవార్తప్రతినిధి:** కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తిరుమలలో నిర్మిస్తున్న సత్రాలను సకాలంలో పూర్తిచేసేందుకు, అవసరమైన డిజైన్లను అందించాలని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి కోరారు. బ్లాక్ ఎ,బి భవనాలు, కల్యాణమండపంలో గదుల వివరాలతో తయారుచేసిన ప్రణాళికను తెలియజేశారు. 2021 డిసెంబర్ 27వతేదీ 220కోట్ల రూపాయల వ్యయంతో కర్ణాటక ప్రభుత్వం కర్ణాటక సత్రాల అభివృద్ధి కోసం తిరుమలలో స్థలాన్ని టిటిడికి అప్పగించింది. ఈ భవనంలో మొత్తం 242 గదులతో రెండు బ్లాక్‌లు, 12 డార్మిటరీలు, ఒక కల్యాణమండపం, ఒక సూట్‌బ్లాక్, 86గదులతో పాత బ్లాక్ ఉన్నాయి. తిరుమలలో కర్ణాటక సత్రాల పురోగతిపై బుధవారం ఉదయం కర్ణాటకరాష్ట్ర రవాణా, దేవాదాయశాఖ మంత్రి రామలింగారెడ్డితో కలసి టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సమీక్షించారు. టిటిడి సిఇ నాగేశ్వరరావు, కర్ణాటక దేవాదాయశాఖ కార్యదర్శి రాజేంద్ర కటారియా, కమిషనర్ డాక్టర్ బసవరాజ్ అధికారుల బృందం, టిటిడి డిఇ ఎలక్ట్రికల్ రవిశంకర్‌రెడ్డి, డిప్యూటీ ఇఇ సుధాకర్‌తో కలసి కర్నాటక సత్రాల నిర్మాణం పనుల పురోగతిని వివరించారు.

# కర్ణాటకలో ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదు

## తిరుమలలో కర్ణాటక దేవాదాయశాఖమంత్రి రామలింగారెడ్డి

**తిరుమల, జులై 26, ప్రభాతవార్తప్రతినిధి:** కర్నాటకలో 135మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ళపాటు అధికారంలో ఉంటుందని, మా ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదని ఆరాష్ట్ర దేవాదాయశాఖమంత్రి రామలింగారెడ్డి విశ్వాసం వెలిబుచ్చారు. ప్రభుత్వంలో 30మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారనేది బిజెపి కుట్రలో భాగమేనన్నారు. ఫోర్జరీ లేఖను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని కూల్చేందుకు సింగపూర్‌కేంద్రంగా కుట్ర జరుగుతోందని డికె వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో బిజెపి నాయకులను ప్రజలు నమ్మలేక కాంగ్రెస్‌ను ఆదరించారన్నారు. కుయుక్తులు చేయడంలో బిజెపి తన గోతిలో తానే పడినచందంగా ఓటర్లు వ్యతిరేకించారన్నారు.
ఇంకా పూర్తిస్థాయి మెజార్టీతో పాలన సాగిస్తున్న అధికార ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని ఆరోపణలు చేయడం, దుష్ప్రచారం చేయడం బిజెపికి తెలిసిన విద్య అన్నారు. బుధవారం ఉదయం అనుచరులతో, దేవాదాయశాఖ అధికారు లతో కలసి తిరుమలకు వచ్చిన కర్ణాటక దేవాదాయ మంత్రి రామలింగారెడ్డి ఆలయం వద్దకు చేరుకు న్నారు. విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పలు ప్రత్యేక రైళ్ల గడువు పెంపు

**గుంతకల్లు రైల్వే, జులై 26 ప్రభాతవార్త :** తెలుగు రాష్ట్రాల మీదుగా, దక్షిణ మధ్యరైల్వే వివిధ ప్రాంతాలకు నడుపుతున్న పలు వారాంతపు ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసుల గడువును పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి మంగళవారం హైదరాబాద్ నుంచి కటక్‌కు బయల్దేరే నెంబర్ 07165 ప్రత్యేక ఎక్సప్రెస్ రైలు సర్వీసును సెప్టెంబర్ 26 వరకు పొడిగించారు. అలాగే ప్రతి బుధవారం కటక్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరే నెంబర్07166 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 27 వరకు, ప్రతి మంగళవారం తిరుపతి నుంచి జాల్నాకు బయల్దేరే నెంబర్ 07413 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును సెప్టెంబర్ 26 వరకు, ప్రతి ఆదివారం జాల్నా నుంచి తిరుపతికి బయల్దేరే నెంబర్ 07414 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 01 వరకు పొడిగించారు. ప్రతి బుధవారం జాల్నా నుంచి ఛాప్రాకు బయల్దేరే నెంబర్08651 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 27 వరకు, ప్రతి శుక్రవారం ఛాప్రా నుంచి జాల్నకు బయల్దేరే నెంబర్ 07652 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 29 వరకు, ప్రతి శుక్రవారం హైదరాబాద్‌నుంచి గోరఖ్‌పూర్‌కు బయల్దేరే నెంబర్ 02575 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 29 వరకు, ప్రతి ఆదివారం గోరఖ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరే నెంబర్ 02576వీక్లీ సూపర్ ఫాస్ట్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 01 వరకు పొడిగించామన్నారు.

వార్త

మాటకేగాని మౌనానికి సాక్షులుండరు.

- ఆల్డస్ హాక్స్లీ

# కాలుష్యకాసారంలో నగరాలు!

ఊదురుగొట్టంవాడు ఊదుతూ ఉంటే చల్లార్పుడు గొట్టం వాడు చల్లార్పుతున్నట్లు ఉంది కాలుష్యం విషయంలో పాలకులు, కొందరు పారిశ్రామికవేత్తలు వ్యవహరిస్తున్న తీరు. కాలకూట విషంగా మారుతున్న కాలుష్య విషవలయం నుంచి ప్రజలను కాపాడేందుకు పాలకులు చట్టాలపై చట్టాలు చేస్తున్నా,ఎందరిపై చర్యలు తీసుకుంటున్నా కాలుష్యకాటుకు బలయ్యేవారి సంఖ్య అంతకంతకు పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయం.ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు ఇంకా జాప్యం, నిర్లక్ష్యం చేస్తే కాలుష్యకాటుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది బలి కాకతప్పదని పర్యావరణశాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. జీవించే హక్కు కల్పించాల్సిందిగా కోరుతూ ఎందరో ఈ కాలుష్యకాసారంలో చిక్కుకున్న నిర్భాగ్యుల వేదన అరణ్యరోదనగా మిగిలిపోతున్నది. కాలుష్యనియంత్రణ మండలిని ఏర్పాటు చేశారు. అనేక చట్టాలు తెచ్చారు. చర్యలు తీసుకుంటున్నారు. అయినా ఇవేవీ కాలుష్యం నుండి ప్రజలను కాపాడలేకపోతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో కాలుష్యం అంతకంతకు పెరిగి ఇప్పుడు నగరాల పరిసర ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నది. ప్రపంచ జనాభాలో ప్రస్తుతం సగం జనాభా నగరాల్లోనే నివసిస్తున్నది. మరో మూడు దశాబ్దాల నాటికి నగరాల జనాభా అదనంగా మూడువందల కోట్లకుపెరుగుతుందని అధికారులఅంచనా. భూభాగంపై నగరాల వైశాల్యం రెండు శాతానికి మించకపోయినా కాలుష్యంలో మాత్రం అది ప్రపంచ జనాభా ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపించే స్థాయిలో విస్తరిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా స్థూల దేశీయోత్పత్తిలో అరవై శాతం ఆరువందల పట్టణాల్లో కేంద్రీకృతమై ఉన్నదంటే నగరాల ప్రాధాన్యత ఎంతగా ఉందో చెప్పనవసరం లేదు. వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభం, గ్రామీణ ప్రాంతాలను అతలాకుతలం చేయడంతో వలసలు పెరిగిపోయాయి. అందుకే గ్రామీణ జనాభా తగ్గుతుంటే మరొకపక్క పట్టణాలు, నగరాల జనాభా యేడాదియేడాదికి పెరిగిపోతున్నది. భారతదేశంలో అయితే పట్టణీకరణ అందుకోలేనంతగా విస్తరిస్తున్నది. 2001లో పట్టణ ప్రాంతాల్లో జనాభా దాదాపు 29 కోట్లు ఉండగా ఇప్పుడది నలభైఐదు కోట్లకుపైగా పెరిగిపోయింది. అయితే ఈ వలసలు ఆపేందుకు ఎన్నో పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్నా అవి ఆశించిన మేరకు ఫలితాలు ఇవ్వడం లేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో కాలుష్య నివారణకు చేపడుతున్న పథకాలు కూడా ఆశించిన ప్రయోజనాలను చేకూర్చలేకపోతున్నాయి. 2005లో ప్రారంభించిన జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయపట్టణ నవీకరణ పథకం (జెఎన్ఎన్‌యుఆర్ఎమ్) కింద పట్టణ ప్రాంతాలకు మరికొన్ని సౌకర్యాలు కల్పించి మెరుగైన జీవనంకల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పెరుగుతున్న అవసరాలు, జనాభాకు అనుగుణంగా అవి అందుకోలేకపోతున్నాయి. భారత్‌లో ఆరు మెట్రో నగరాల్లో ఢిల్లీ, చెన్నై,కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూర్ తదితర నగరాల్లో ఒక ప్రైవేట్‌సంస్థ సర్వే నిర్వహించింది. పర్యావరణం గాలినాణ్యత, నీటినాణ్యత, అటవీ విస్తీర్ణం, పచ్చదనం, వాతావరణ మార్పులు, చెత్తనిర్వహణ ప్రాతిపదికగా ఈసర్వే నిర్వహించారు. విస్తరణ, తదితర అంశాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా చేపట్టడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగానగరాల్లో ఎక్కడికక్కడ ఒక పథకం, ప్రణాళిక లేకుండా కాలనీలు విస్తరించడంతోపాటు మురికివాడలు కూడా పెరిగిపోతున్నాయి. ఫలితంగా నగరాల్లో నీటి కాలుష్యంతో పాటు వాయుకాలుష్యం వల్ల పౌరుల ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తున్నదని ఆనివేదికలో వెల్లడైంది. చెన్నై, కోల్‌కోతా, ముంబాయిలలో వాహనకాలుష్యం తీవ్రంగాఉంది. తర్వాత స్థానం పారిశ్రామిక కాలుష్యానిది. బెంగళూరులో పరిస్థితి మరోరకంగా ఉంది. అక్కడ వాయుకాలుష్యం తీవ్రస్థాయికి చేరినట్లు ఒక సర్వేలో బయట పడింది. ఇక వాహనాలు, నీటికాలుష్యంలో హైదరాబాద్ అగ్రస్థానంలోఉంది. నిర్మాణ రంగం వల్ల పీల్చే గాలిలో అధికశాతం దుమ్ముధూళి చేరుతుండడంతో ప్రజారోగ్యం రానురాను ప్రశ్నార్థకంగా మారుతున్నది. హైదరాబాద్ నగరంలో వాయుకాలుష్యానికి నీటికాలుష్యం తోడుకావడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. నగరశివారులో పరిశ్రమల నుండి గాలిలో వదులుతున్న కాలుష్యానికి అడ్డూఅదుపు లేకుండాపోవడం దురదృష్టకరం. ముఖ్యంగా విషపూరితమైన రసాయనిక కలుషిత జలాలుశుద్ధి చేయకుండా మూసీలో కలుపుతున్న పరిశ్రమలపై చర్యలు అంతంతమాత్రంగానే ఉండడంతో మూసీపరివాహక ప్రాంతమంతా కాలుష్యకాసారంలో కొట్టుమిట్టాడుతున్నది. వాస్తవానికి ఈ సమస్య ఇప్పుడు కొత్తగా పుట్టుకొచ్చింది కాకపోయినా ప్రభుత్వ విధానాలు, కొందరు అధికారుల అవినీతి, అసమర్థత అంతులేని నిర్లక్ష్యం కారణంగా సమస్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ఒక్క మూసీయే కాదు ఎన్నో చెరువులు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. ఇంకా మారుతూనేఉన్నాయి. ఇక హైదరాబాద్‌లోనే కాదు అటు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర ఆంధ్రప్రదేశ్‌లోని అనేక పట్టణాలతో పాటు తెలంగాణలోని వరంగల్, కరీంనగర్ లాంటి పట్టణాల పరిస్థితి కూడాఇందుకు భిన్నంగా లేదు. ముఖ్యంగా నీటికాలుష్యంతో మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నది. భారతదేశంలో వాతావరణంలో ధూళికణాలు ఉండాల్సినస్థాయి కన్నా ఐదురెట్లు అధికంగా ఉండడంతో శ్వాస సమస్యనుంచి కేన్సర్ దాకా అనేక రోగాలబారినపడుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. ప్రజలు తమ జీవితాలను తీర్చిదిద్దే పరిణామాలు, ప్రక్రియల్లో అర్థవంతంగా పాలు పంచుకోకపోతే జాతీయ మానవాళి అభివృద్ధి పథంలో పయనం ఆశించిన మేరకు సుస్థిరంగా సాగదని ఐక్యరాజ్య సమితి మానవాభివృద్ధికార్యక్రమంలో వెల్లడించిన అభిప్రాయాన్ని పాలకులు మనసుపెట్టి ఆలోచించాల్సిన తరుణమిది.

> మనిషిలో అంతర్గత పోరాటం ఆరంభమైనదంటే ఆ మనిషి ఎంతో కొంత విలువైనవాడే.



రాబర్ట్ బ్రౌనింగ్

> మానవ మేధ స్వేచ్ఛగా ఉన్నప్పుడే సమాజ సంక్షేమానికి నిజమైన భద్రత లభిస్తుంది.



లాస్కీ

## ప్రజావాక్కు



### అనుమతిలేని డయాగ్నోస్టిక్ సెంటర్లు

శ్రీకాకుళంలో నాణ్యతప్రమాణాలను గాలికొదిలేసి అనేక డయాగ్నోస్టిక్ సెంటర్ ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. కనీస నిబంధనలు, పూర్తిస్థాయి అనుమతి పత్రాలు, అర్హతా ప్రమాణాలు పాటించకుండానే చాలామంది ల్యాబ్‌లు నిర్వహిస్తూ రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్కానింగ్ సెంటర్లు, మెడికల్ ల్యాబ్‌ల్లో స్కానింగ్, రక్త ఇతర పరీక్షలకు ప్రభుత్వం నిర్దేశించిన రేట్లు ఎక్కడా అమలు చేయడం లేదు. కొన్ని యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా రేట్లు వసూలు చేస్తుండడంతోపాటు ఏ పరీక్షకు ఎంతధర చెల్లించాలో కనీసం బోర్డునూ కూడా ప్రదర్శించడం లేదు. ఇక డయాగ్నోస్టిక్ సెంటర్లు గ్రామప్రాంతాలలో కొందరు నకిలీలు లాబ్ టెక్నీషియన్లు చెలామణి అవుతూ అమాయక పేద ప్రజలను మోసం చేస్తున్నారు. ఇక్కడి నుండి పెద్ద సంఖ్యలో మహిళలు పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రానికి వెళ్లి గర్భస్థ పిండం తని ఖీలు చేయించుకుంటూ ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్లు చేయించుకుంటున్నారన్న వార్తలు మీడియాలో హల్చల్ చేస్తున్నాయి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రైతుకు దళారీ పోటు

రైతుపొలంలో విత్తు వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు ఆరుగాలం కష్టపడి తీరా పంట చేతికి వచ్చే సరికి దళారుల బెడద ఎక్కువ అవుతోంది. రైతు పంటను అమ్మడానికి వెళ్తే దళారులు అంతా కుమ్మక్కై పంటకు ధర లేకుండా చేస్తున్నారు. దీనితో రైతులు తీవ్రంగానష్టపోతున్నారు. రైతు కుటుంబంలో ఉన్న అందరూ పంటమీద ఆధారపడి కష్టపడి పనిచేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. కానీ దళారీలు మాత్రం రైతు పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక లాభాలు గడిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే దళారీ వ్యవస్థను రద్దు చేయాలి. రైతులను ఆదుకోవాలి.

-జాకీర్ మురవని, కర్నూల్

### ఎందుకీ బలప్రదర్శన

మా నాయకుడు మోడీ సింహం లాంటి వారని, చాలా బలమైనవారని ప్రతిపక్షాల వారేమోలేళ్లు, దుప్పిలు, గుర్రాలు, జీబ్రాలు, కుక్కల వంటి వారని వీరంతా ఏకమైనా మోడీని ఏమీ చేయలేరని, నరేంద్రమోడీ సింహం లా సింగిల్ లాగానే పోరాడి వారిని ఓడిస్తారని బీరాలు పలికిన వారు ఇప్పుడు 38 చిన్న చితక పార్టీల మద్దతు ఎందుకు తీసుకుంటున్నారు? వారితో కలిసి ఈభారీ బలప్రదర్శన .

-మిథునం, హైదరాబాద్

### చారిత్రక కట్టడాలను కాపాడుకుందాం

రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో మన పూర్వీకులు నిర్మించిన అపురూప, చారిత్రక కట్టడాలు శిధిలావస్థకు చేరువలో ఉన్నాయి. అనేక కోటలు, బురుజుల కాలగమనంలో కలిసిపోతున్నాయి. కరీంనగర్‌లోని ఎలాగంధుల ఖిల్లా, వరంగల్‌లో రాతి స్థంభాలు, రామప్పవేయి స్థంభాల గుడి ఇలా ఎన్నో అపురూప శిల్పకళాసంపద భవిష్యత్‌లో కనుమరుగు అవుతుందని భావన కలుగుతుంది. బహుజనుల రాజ్యాధికారం కోసం ఉద్యమించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న నిర్మించిన చారిత్రక కట్టడాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ కట్టడాన్ని ప్రభుత్వం, పురావస్తు శాఖ పునర్నిర్మించాలని అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చారిత్రాత్మక, సుందరమైన కట్టడాలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఎంతగానో ఉన్నది. తక్షణమే శిధిలా వస్థకు చేరుకున్న పురాతన కట్టడాలను గుర్తించి దానిని మరమ్మతు చేయాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లిజిల్లా

### రేషనలైజేషన్ పేరుతో భారీ కోత

రాష్ట్ర ప్రభుత్వం 80వేల ఉద్యోగాలను భర్తీచేస్తామని గత సంవత్సరం అసెంబ్లీలో మార్చి9 ప్రకటించారు. సియం స్వయంగా లెక్కలు చూపెట్టి విభాగాల వారీగా ఖాళీలు వెల్లడించారు. ఈ ఖాళీలు వెంటనే ఆర్థికశాఖ అనుమతి ఇచ్చి నోటిఫికేషన్లు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. 80వేల ఉద్యోగాల్లో 13,500 ఖాళీలుపాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉన్నాయని చూపించారు. టీచింగ్ నాన్ టీచింగ్ మోడల్ స్కూల్ పరిధిలో ఈ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో 9400 పోస్టులు, యస్జిటి స్కూల్ అసిస్టెంట్, పిఈటీ, పండిట్ పోస్టులు ఉన్నాయని ఆర్థికశాఖ అనుమతి కోసం ఫైల్‌పంపినారు. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగుసార్లు, తెలంగాణలో మూడుసార్లు టెట్ పరీక్షలు నిర్వహించగా నాలుగు లక్షలమంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. టీచర్ పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయలేదు.

-రావుల రామ్మోహన్ రెడ్డి, వరంగల్‌జిల్లా

### కఠినమైన చట్టాలు అవసరం

దేశంలో ఏదైనా పెద్ద అత్యాచారం జరగగానే ఒక కొత్త చట్టం తీసుకురావడం అలవాటుగా మారింది. చట్టాలు దేశంలోని హంతకులలో ఎలాంటిభయాన్ని తీసుకురాలేకపోతున్నాయి. మణిపూర్ ఘటన ఎంతటి అమానుష్యమో అందరికి తెలుసు. ఈ క్రమంలో దేశానికి కఠినమైన చట్టాలు తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది.

-ముక్కపల్లి సాగర్, సిద్దిపేట జిల్లా

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకమేనా?

**పార్లమెంటు ఆమోదించిన చట్టానికి కేంద్ర మంత్రివర్గం సవరణ చేసే అధికారంలేదని విభజన చట్టం మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రమే నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం అడిగే పరిస్థితి లేదు. ఇద్దరూ కలసి అడ్డదిడ్డమైన అంగీకారానికి వచ్చి దానికి 'తొలిదశ' అని నామకరణం చేసి మొత్తం ప్రాజెక్టును గోదావరిలో ముంచేస్తున్నారు.మరీ కొసమెరుపు ఏ మంటే తొలిదశ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 17,144 కోట్లు అవసరమని కోరితే వరదలకు దెబ్బతిన్న పనుల మరమ్మతులకు రెండువేల కోట్ల రూపాయల కలుపుకొని 12,911 కోట్లుమాత్రమే ఇచ్చేందుకు కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేసింది.**

వి.శంకరయ్య

యావత్తు అవశేష ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు గురించి కొన్ని ప్రాంతాల్లో సరైన అవగాహన లేకపోవడం విచారకరమే. ముందు తరాల వారికి అటు ఉత్తరాంధ్ర ఇటు రాయలసీమ జిల్లాలకు గోదావరి నీళ్ల దప్పిక తీర్చే అవకాశం ఉంది. దేశంలో గల పెద్ద నదుల్లో గోదావరి రెండు, మూడు స్థానాలు ఆక్రమిస్తుంది. ఇలాంటి జీవనాడిపై నిర్మింపబడుతున్న పోలవరం ప్రాజెక్టుకు గ్రహణం పడుతుంటే రాజకీయపార్టీలే కాకుండా మేధావులు, కవులు కళాకారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడమే నేటి విషాదం. తమిళనాడులో కేవలం నాలుగైదు జిల్లాలకే పరిమితమయ్యే కావేరీ నదీ జలాల అంశంలో అందరూ ఏకకంఠంతో డిమాండ్ చేశారు. తుదకు శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాగా నీటి కేటాయింపులు తన పరిధి కాకున్నా సుప్రీంకోర్టు జోక్యం చేసుకొన్నది. కాని ఈ పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో కన్పించడం లేదు. రాజ్యసభలో గతవారం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి షెకావత్ సహాయమంత్రి బిశ్వేశ్వర్ సభ్యుల ప్రశ్నలకిచ్చిన సమాధానాలు పరిశీలిస్తే ప్రత్యేకహోదా దుమ్ములో కలసినట్లే పోలవరం ప్రాజెక్టు గోదావరి వరదలకు కొట్టుకుబోతున్నట్లు భావించాలి. ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని కేంద్ర మంత్రులు ఇచ్చిన సమాధానం ఆంధ్రప్రదేశ్‌కు శరాఘాతమే! పోలవరం ప్రాజెక్టుకు అన్ని వైపుల నుండి సమస్యలు చుట్టుముడుతున్నాయి. నిర్వాసితుల సమస్య క్లిష్టమైనది. ఇప్పటికి జరిగిన హెడ్‌వర్క్స్ పనుల్లో లోసుగులు సరిదిద్దడం సాంకేతికంగా మరీ ఇబ్బందిగా ఉంది. పోలవరం ప్రాజెక్టుకు కీలకమైనవి రెండే. ఒకటి స్పిల్‌వే కాగా రెండవది డయాఫ్రమ్ వాల్. వరదలకు దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ గురించి ఇంకా ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. దీనికితోడు కేంద్రం నిధులు కొసరి కొసరి ఇస్తోంది. రెండవ డిపిఆర్ ఇంతవరకు అధికారయుతంగా ఆమోదించలేదు. పైగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలకు చెంది కోర్టు కేసులున్నాయి. ఈ ఏడు గోదావరికి వరద పోటెత్తుతున్న తీరు పరిశీలించితే నిర్వాసితుల ఘోష భాషకు అందకపోవచ్చు. 2020-21 సంవత్సరాల్లో వచ్చిన వరదలతోనే ప్రాజెక్టు నిర్మాణం కుంటుపడిందని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ అనుభవం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నట్లు లేదు. తొలిదశ అని పేరు పెట్టి కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంకా 5449 కుటుంబాలను తరలించి పునరావాసం కల్పించవలసి ఉంది. పునరావాస కార్యక్రమాలను బట్టి ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ జరగాలి. పునరావాసం ఆలస్యమయ్యే కొద్దీ హెడ్‌వర్క్స్ ఆలస్యమవడమే కాకుండా నిర్మాణ వ్యయం పెరిగి తడిసి మోపెడవుతుంది. మున్ముందు వచ్చే వరదలకు నిర్వాసితుల పరిస్థితి అనూహ్యం. ఇది ఒక లెక్క మాత్రమే. దురదృష్టం కొద్దీ వరద మరింతగా వెల్లువెత్తితే పూర్తి రిజర్వాయర్ కాంటూరు 45.72 మీటర్లకు మించి ముంపు ఉండవచ్చు. ఎంతగా సహాయ చర్యలు చేపట్టినా గోదావరి వరద తీరు ఎవరి చేతుల్లోనూ ఉండక పోగా ప్రభుత్వ యంత్రాంగంలో ఉండే రెడ్ టేపిజంతో వాటిల్లే నష్టం అపారంగా ఉండవచ్చు. సహజంగా ఏ సాగునీటి పథకం చేపట్టినా తద్వారా సర్వం కోల్పోయే మొదటి లబ్ధిదారులు నిర్వాసితులే. కానీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఈ సహజ న్యాయ సూత్రం నిస్సిగ్గుగా ఉల్లంఘించబడింది. ఎవరు మాట్లాడినా హెడ్ వర్క్స్ నిర్మాణ పురోగతి గురించి శాతాల్లో చెబుతుంటారు. కాని నిర్వాసితులు గురించి మాట్లాడరు. ఇక హెడ్‌వర్క్స్ నిర్మాణ పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికే నిర్మింపబడిన వివిధ విభాగాల్లో బయటపడిన లోసుగులను ఎలా సరిదిద్దాలో అని పరిశీలించి వెళ్లిన నిపుణులు సూచనలు ఇప్పటికీ ఇవ్వలేదు. స్పిల్‌వేకు దన్నుగా ఉండే గైడ్ బండ్ కుంగిపోయింది. ఎగువ కాఫర్ డ్యాం




నుండి సాధారణ పరిమితులకు మించి సిపేజీ రావడానికి తోడు దిగువ కాఫర్ డ్యాం నుండి వరద ఎగదన్ని హెడ్‌వర్క్స్ నిర్మాణ ప్రాంతమంతా జలమయమైంది. ప్రస్తుతం అనూహ్యమైన వరదలు వస్తే హెడ్‌వర్క్స్ ప్రాంతంలో పనులు చేయడం కుదరదు. కొత్త నిర్మాణాలు అటుంచి దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ పరిస్థితి అగమ్య గోచరమై ఈ ఏడు గడిచిపోతుంది. 2023 సంవత్సరం పూర్తిగా మల్లగుల్లాలతోనే ముగుస్తుంది. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు 2024 జూన్‌కు ప్రాజెక్టు తొలి దశ కూడా నిర్మాణ సాధ్యంకాదు. అందుకే రాజ్యసభలో కేంద్ర సహాయ మంత్రి ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తి అవుతుందో చెప్పలేమనిచేతులెత్తేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఈ గతి పట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత ఎంత ఉందో కేంద్ర ప్రభుత్వ వైఖరి అంతకన్నా రెట్టింపుగా ఉంది. దేశంలో నిర్మింపబడే జాతీయ ప్రాజెక్టులకు కేంద్రం 90శాతం నిధులు ఇవ్వగా ఆయా రాష్ట్రాలు పది శాతం నిధులు సమకూర్చవలసి ఉంది. కానీ పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టం మేరకు నిర్మాణం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు ఇవ్వాలి. అటవీ పర్యావరణ అనుమతులు కేంద్రమే తీసుకురావడమే కాకుండా నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించాలి. పైగా ఫలానా సంవత్సరం షెడ్యూల్ రేట్ల ప్రకారం అని కూడా విభజన చట్టంలో లేదు. కానీ కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించినదని ముద్రవేసి 2013-14 నాటి షెడ్యూల్ రేట్లకే నిధులు ఇస్తామని మొండికేస్తోంది. అదైనా తెగేసి చెప్పదు. అందులోనూ సాగునీటి వ్యయం మాత్రమే భరిస్తానని షరతు పెడుతోంది. పార్లమెంటు ఆమోదించిన చట్టానికి కేంద్ర మంత్రివర్గం సవరణ చేసే అధికారం లేదని విభజన చట్టం మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రమే నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం అడిగే పరిస్థితి లేదు. ఇద్దరూ కలసి అడ్డదిడ్డమైన అంగీకారానికి వచ్చి దానికి 'తొలిదశ' అని నామకరణం చేసి మొత్తం ప్రాజెక్టును గోదావరిలో ముంచేస్తున్నారు. మరీ కొసమెరుపు ఏ మంటే తొలిదశ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 17,144 కోట్లు అవసరమని కోరితే వరదలకు దెబ్బతిన్న పనుల మరమ్మతులకు రెండువేల కోట్ల రూపాయల కలుపుకొని 12,911 కోట్లు మాత్రమే ఇచ్చేందుకు కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేసింది. వాస్తవం ఇదైతే కేంద్ర మంత్రులు తరచూ వచ్చిపోయే నిపుణులు మొదలు కొని రాష్ట్ర నేతల వరకు ఈ దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వాన్ని బోనులో నిలబెడుతుంటే నిధులు సమకూర్చకపోవడం, అడిగిన నిధులు కొసరి కొసరి ఇవ్వడం కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు చెప్పలేని స్థితిలో ఉన్నారు. ఈ కారణంగానే ఎప్పటికప్పుడు కేంద్రం వేలెత్తి చూపుతుంటే రాష్ట్ర ప్రభుత్వం అచేతనంగా ఉంటోంది. రాజ్యసభలో మంత్రులు చెప్పిన దాన్ని బట్టి చూస్తే ప్రాజెక్టుకు కీలకమైన రెండవ డిపిఆర్ ఆమోదం గురించి రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు లేదు. ఇది ప్రాజెక్టు ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోంది. కేవలం తొలి దశ 41.15 మీటర్ల వరకు పూర్తి చేయడానికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నిధులు కోరినట్లు వెల్లడించారు. అదే జరిగితే ప్రాజెక్టులో 92 టియంసిలు మాత్రమే నిల్వ చేయగలరు. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 194.60 టియంసిలు. అంటే లైవ్ కెపాసిటీ 75.20 టియంసిలు గురించి మరచిపోవాల్సి ఉంటుంది. యండిడియల్ లెవల్ 41.15 మీటర్లు కాబట్టి ఆ లెవల్‌లో కుడి, ఎడమ కాలువలకు గ్రావెటీ ద్వారా నీరు తరలించలేరు. కుడి కాలువ సిల్‌లెవల్ 40.242 మీటర్లు. ఎడమ కాలువ సిల్ లెవల్ 40.54మీటర్లు. కాబట్టి ప్రాజెక్టు నిర్మించి ఎత్తిపోతలు పెట్టుకోవలసినదే. గ్రావెటీతో నీళ్ల తరలించడం కుదరదు. ఈ యేడాది గడిచిపోతే రాష్ట్ర ప్రభుత్వం కోరిన నిధులతో కూడా తొలిదశ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాదు. పైగా రేపు ఎన్నికల లోపు నిర్మాణం అసలే కుదరదు. వచ్చే సాధారణ ఎన్నికలలోపు పోలవరం ద్వారా వైసిపి పార్టీ పొందేలబ్ధి ఏమీ ఉండక పోగా ప్రతిపక్షాలకు ప్రచార అస్త్రంగా మిగులుతుందేమో! ●

(రచయిత: విశ్రాంత పాత్రికేయులు)

# ఈ సమావేశాల్లో బిసి బిల్లుకు మోక్షం లభించేనా?

కైలసాని శివప్రసాద్

భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచినా వెనుకబడిన తరగతి జాతుల జీవితాలలో నామమాత్రపు అభివృద్ధి కూడా మన పాలకులు సాధించలేకపోవడం దురదృష్టకరం. అదే సమయంలో బిసిల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న జనాభాలో బిసిలు 54శాతం ఉన్నారు. అయినా విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో బిసిలు ఇప్పటి వరకు కేవలం 14 శాతం మంది మాత్రమే అవకాశాలు పొందడం గమనార్హం. ఆర్టికల్ 46 ప్రకారం విద్యారంగంలో, ఆర్థిక రంగంలో వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వం తగిన ప్రయోజనాలు కల్పించే వెసులుబాటు రాజ్యాంగంలో స్పష్టంగా పొందుపరచబడింది. అదే విధంగా ఆర్టికల్ 16(4) ప్రకారం, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించే బాధ్యతను కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించబడింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బిసిలకు నాలుగు దశాబ్దాల క్రితం రూపొందించిన రిజర్వేషన్లు నేటికీ అమలు చేస్తుండడం గమనార్హం. నాలుగు దశాబ్దాల నుంచి జనాభా మూడింతలు పెరిగినా రాజకీయ రంగంలో గతంలో కన్నా చట్టప్రకారం తెలుగు రాష్ట్రాలు ఇంకా తగ్గించడం బాధాకరం. ఆర్టికల్ 164 ప్రకారం వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతికి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయమని రాజ్యాంగంలో పొందుపరిచినా మన పాలకులు గత ఏడు దశాబ్దాలుగా ఈ విషయంపై ఇంతవరకు దృష్టి సారించకపోవడం ఆశ్చర్యకరం. ఇటువంటి విషయాలతోపాటు బిసిల జనగణన కొరకు, జనాభా దామాషా ప్రకారం చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించేబిల్లును పార్లమెంటుఉభయ సభలలో ప్రవేశపెట్టమని రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని బిసిలంతా ముక్తకంఠంతో కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నారు. 102వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా జాతీయ బిసి కమిషన్‌కు కేంద్రప్రభుత్వం 2018లో చట్టబద్ధత కల్పించింది.





అదే విధంగా బిసి జనగణన, చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని దేశవ్యాప్తంగా ఉన్న బిసిలు మోడీపై గంపెడు ఆశలుపెట్టుకున్నారు. బిసి జనగణనపై, చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్ట డంపై కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం బిసిలను తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తూ ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు, దేశంలోని అన్నీ రాజకీయ పార్టీలు ఉభయ సభల్లో తమకు ఉన్న సభ్యులద్వారా తమ గళంగట్టిగా వినిపించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినప్పుడే బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్ల బిల్లుకు మోక్షం లభించేటట్లు స్పష్టంగా అర్థమవుతుంది. వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం మూడు సంవత్సరాల వ్యవధిలోనే బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లకల్పన ప్రైవేట్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టడం గమనార్హం. 35 సంవత్సరాలు బిసిల ఓట్లతో మనుగడ సాధించి ఇప్పటికీ బిసిల పార్టీగా చెప్పుకునే తెలుగు దేశంపార్టీ ఈ నాలుగు దశాబ్దాల కాలంలో ఏనాడూ బిసిల సమస్యల గురించి పార్లమెంటులో ఉచ్ఛరించిన దాఖలాలు లేవు. తెలుగుదేశం పార్టీ కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే బిసిల గురించి ఉచ్ఛరిస్తూ వారిని ఎన్నికల్లో పావులుగా ఉపయోగించుకున్నట్లు బిసిలకు స్పష్టంగా అర్థమైంది. అందువల్లే బిసిలంతా ఏకపక్షంగా జగన్‌పార్టీతో మమేకమైనట్లు తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఏక తాటిపైకివచ్చి బిసిబిల్లు గూర్చికేంద్రంపై ఒత్తిడి తేవలసిన అవశ్య కత అన్ని పార్టీలపైఉంది. బిసి బిల్లుకొరకు పార్లమెంటులో గళం ఎత్తుతున్న పార్టీలకు బిసిలు ఏకపక్షంగా మద్దతు ఇస్తారనడంలో ఎటువంటి సందేహంలేదు. రాజ్యాధికారంతోనే అణగారుతున్న తమ జీవన ప్రమాణాలు పెరుగుతాయని బిసిలు గట్టిగా నమ్ముతున్నారు. అందులో భాగంగానే చట్టసభల్లో బిసిరిజర్వేషన్ల బిల్లుకొరకు వెనుకబడిన తరగతుల వారు దశాబ్దాల తరబడి అలు పెరగని పోరాటం చేస్తున్నారు. ఈ బిసి బిల్లును ఉభయసభల్లో ఆమోదింపచేస్తే ఖచ్చితంగా బిజెపి పార్టీకి బిసిలు శాశ్వత ఓటర్లుగా మారుతారానడంలో ఎటువంటి సందేహంలేదు. కనుక నానాటికీ దిగజారుతున్న బిసిల బతుకులకు భరోసా కల్పించేందుకు కేంద్రప్రభుత్వం బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెడతారని ఆశిద్దాం. ●

# మత్స్యకారులకు రాష్ట్రప్రభుత్వం చేయూత

మోటె చిరంజీవి

రాష్ట్రంలో నిండుకుండలా నదులు, చెరువులు, కాలువలు కనబడుతున్నాయి. కాకతీయులు, రెడ్డి రాజులు అందించిన చెరువులు మధ్యతరహా రిజర్వాయర్ల ఆసరాతో తెలంగాణ రాష్ట్రంలోని చెరువులలో మత్స్య పరిశ్రమ దినదినం అభివృద్ధి చెందుతుంది. దీనితో మత్స్యకారుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ప్రతి సంవత్సరం 11 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిలో ఐదువేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే కీలక ఆదాయ వనరుగా మత్స్య పరిశ్రమను తీర్చిదిద్దింది రాష్ట్ర ప్రభుత్వం. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది. రాష్ట్రంలో మత్స్యసంపద అభివృద్ధికి అద్భుత అవకాశాలున్నాయని గ్రహించిన సిఎం మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఫిషరీస్ కార్పొరేషన్ ద్వారా చేప పిల్లల పెంపకం, అమ్మకాలు జరిపి నిర్వహణ ఖర్చుపోగా మిగిలిన ఆదాయాన్ని మత్స్యకారులకే అందచేస్తున్నారు. దేశీయంగా ఆహార భద్రతలో మత్స్య రంగం కీలకపాత్ర పోషిస్తూ ప్రపంచ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా 7.6 శాతం ఉంది. ప్రపంచంలోనే ఇండియా నాలుగో అతిపెద్ద మత్స్య ఎగుమతిదారుగా ఉంది. భారత్‌లో దాదాపు మూడు కోట్ల మంది మత్స్యరంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రపంచ మత్స్య ఉత్పత్తిలో భారత్‌రెండోస్థానంలో నిలుస్తుంది. దేశీయంగా కోట్ల సంఖ్యలో ప్రజలు ఈరంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. చేపలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, ప్రకృతి విపత్తుల వంటి సమస్యలు మత్స్యకారులనుపట్టి పీడిస్తున్నాయి. అవన్నీ ఎదుర్కొని తెలంగాణ రాష్ట్ర మత్స్య కార్మిక సొసైటీలో ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తూ ఎటువంటి వివాదాలకు తావు లేకుండా పటిష్టమైన ప్రణాళికతో, పకడ్బందీగా మత్స్య పరిశ్రమనుఅభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం సీనియర్ అధికారులు, బ్యూరోక్రాట్లు, ఆర్థిక శాస్త్రవేత్తలతో చర్చలు జరిపి, సాధ్యాసాధ్యాలు ఆలోచించి మనకున్న ఆర్థిక వనరులను అర్థం చేసుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తుంది తెలంగాణ రాష్ట్రం. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఒక భాగంగా ఉన్నప్పుడు సముద్ర తీరం వెంట ఉన్నవారే మత్స్యకారులు అన్నట్లుగా ఉండేది. తెలంగాణపై దృష్టి సాధించక పోగా ఇక్కడి మత్స్యరంగాన్ని ధ్వంసం చేశారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమా అని భూగర్భ జలాలు పెరిగి, ఏ ఊరిలో చూసినా నిండుకుండలా మారాయి చెరువులు. సముద్రతీరం లేకపోయినా కాకతీయులు, రెడ్డి రాజుల కాలంలో నిర్మించిన మైనర్ ఇరిగేషన్ వ్యవస్థ గొప్పవరంగా ఉంది.



తద్వారా చేపల పెంపకానికి అద్భుత అవకాశాలు ఉన్నాయి. అప్పట్లో 75వేల చెరువులు ఉంటే అవన్నీ నాశనమై, చివరకు ఇప్పుడు 46,500 చెరువులు మిగిలాయి దేశంలో మరే రాష్ట్రంలో ఇన్ని చెరువులు లేవు. మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని తీసుకొని 15 నుంచి 16వేల చెరువులను బాగు చేయడం ద్వారా మత్స్య పరిశ్రమ అద్భుత ప్రగతిని సాధిస్తుంది. నాలుగున్నర నుంచి ఐదున్నర వేల కోట్ల రూపాయల విలువ చేసే చేపలను తెలంగాణ రాష్ట్రం ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నట్టు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆ లక్ష్యాన్ని కూడా మనం అతి త్వరలోనే చేరుతామని అంటున్నారు. దక్షిణ తెలంగాణలోని జురాల దగ్గర మొదలు పెట్టుకుంటే శ్రీశైలం, నాగార్జునసాగర్, టెయిల్‌పాండు, పులిచింతల, నల్గొండ జిల్లా మూసి ప్రాజెక్టు, మహబూబ్‌నగర్ కోయిల్ సాగర్, కొత్తగా వచ్చిన సంఘం బండ రిజర్వాయర్, ఉత్తర తెలంగాణ వైపు చూస్తే సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టు, ఎస్ఆర్ఎస్‌పి, ఎల్లంపల్లి, కడెం రిజర్వాయర్, ఆదిలాబాద్‌లో ఉండే అన్ని ప్రాజెక్టులు, ఎల్లంపల్లిలోయర్ మానేరు, మిడ్ మానేరు, అప్పర్‌మానేరు డ్యాంలు, వరంగల్‌లో పాకాల, గణపురం, రామప్ప లక్నవరం, ఖమ్మంలో లంకసాగర్, వైరా పాలేరు రిజర్వాయర్లు మనకు ఇలా చాలా ఉన్నాయి. మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని అనుకున్న లక్ష్యాలను చేరవచ్చు. చేప పిల్లలను ఉచితంగా ఇవ్వడం ద్వారా కూడా మత్స్య పరిశ్రమ అభివృద్ధి జరుగుతుంది. మన రాష్ట్రంలో మామూలుగా వచ్చే సాధారణ చేపల దిగుబడి యేడాదికి లక్ష టన్నుల వరకు ఉంటుంది. చేప విత్తనం వేసి పెంచడం ద్వారా మరో లక్ష టన్నుల ఉత్పత్తి అదనంగా వస్తుంది. భారత్‌లో గత పదేళ్లలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా అంతర్గతంగా ఉన్న జలాల నుంచి సమకూరుస్తున్న మత్స్య సంపద 55 శాతం అధికమైంది. ఆక్వాకల్చర్ విశ్వవ్యాప్తం కావడం దీనికి ప్రధాన కారణం. చేపల్లో కాల్షియం, మినరల్స్, ఒమేగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు అధికంగా ఉంటాయి. అందువల్ల ఆహారంలో వాటి వినియోగం పెరిగింది. వినియోగదారుల అభిరుచి మేరకు మత్స్య సంపదకు వివిధ రూపాల్లో విలువ జోడించి విక్రయిస్తున్నారు. మత్స్యకారుల్లో అధిక శాతం పెద్దగా చదువుకోని వారే ఈ పని చేస్తూ ఉంటారు. ఒకప్పుడు మన రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్యకారులు ఇక్కడ ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వలస వెళ్లి ఉపాధి పొందేవారు. దేశీయంగా చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలుస్తుంది. పశ్చిమబెంగాల్, గుజరాత్, కేరళ, తమిళనాడు తర్వాత స్థానాల్లో నిలుస్తాయి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం కూడా తక్కువేమీ కాదన్నట్లుగా చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రభాగంలో ఉంది. మత్స్యకారులు ప్రకృతి ఆటుపోట్లను తట్టుకుంటూ చేపలు పడితేనే ఆదాయం లేకుంటే నిరాశనిస్పృహలకు గురవుతూ అనిశ్చితితో వారు వారి జీవితాలను వెళ్లదీసుకుంటారు. మత్స్యకార మహిళల్లో చాలా మంది వీధుల్లో తిరుగుతూ చేపలను ఇళ్లముందుకు తెచ్చి విక్రయిస్తున్నారు. అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారికి టూ వీలర్స్ సబ్సిడీగా ఇచ్చి ఆదుకుంటున్నది. ●

# మన వాతావరణ అంచనా వ్యవస్థలు ప్రపంచంలోనే అత్యుత్తమం: రిజిజు




**న్యూఢిల్లీ,జులై 26:** దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో భారత వాతావరణ శాఖ పనితీరుపై కేంద్ర భూ విజ్ఞానశాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో వాతావరణ పరిస్థితులను అంచనా వేసే వ్యవస్థలు కొన్నేళ్లుగా కచ్చితమైన ఫలితాలతో ప్రపంచ దేశాలకన్నా అత్యుత్తమంగా పనిచేస్తున్నాయన్నారు. మనం విపత్తులను నిరోధించలేకపోయినప్పటికీ, భారత వాతావరణశాఖ జారీచేసే హెచ్చరికలను పాటించడం ద్వారా తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఐఎండి పాత్ర అత్యంత కీలకంగా మారిందన్నారు. వాతావరణంలో మార్పులను కచ్చితంగా అంచనా వేయడంలో కీలకపాత్ర పోషించే డాప్లర్ రాడార్ల సంఖ్యను దాదాపు రెట్టింపు చేస్తామన్న ఆయన, ప్రస్తుతం 35గా ఉన్న సంఖ్యను వచ్చే మూడేళ్లలో 68కి పెంచనున్నట్లు తెలిపారు. 2014 నుంచి ఐఎండి అద్భుతంగా పనిచేస్తోందన్న ఆయన, బిపర్ జోయ్ వంటి తుఫానులను కచ్చితంగా ట్రాక్ చేసిందంటూ ప్రశంసించారు.

# వడగళ్ల వాన దెబ్బకు విమానం గుల్ల..

## అత్యవసర ల్యాండింగ్



**రోమ్, జులై 26:** ఇటలీలోని మిలన్ నుంచి అమెరికాలోని న్యూయార్క్ జెకెఎఫ్ ఎయిర్‌పోర్టుకు బయల్దేరిన విమానం తీవ్రంగా దెబ్బతిని రోమ్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన 185 నంబర్ విమానం 215 మంది ప్రయాణికులతో మిలన్ నుంచి బయల్దేరింది. ఆ సమయంలో వాతవరణం అనుకూలంగానే ఉంది. కానీ ప్రయాణం ఆరంభించిన 15 నిమిషాల తర్వాత తీవ్రమైన వడగళ్లు, పిడుగులతో కూడిన వానలో చిక్కుకుంది. దీంతో విమానం ముక్కు, రెక్కలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. విమానాన్ని నియంత్రించడం పైలట్లకు ఇబ్బందికరంగా మారింది. దీంతో విమానాన్ని అత్యవసరంగా రోమ్‌లో ల్యాండింగ్ చేశారు. ఈ విషయంపై డెల్టా ఎయిర్‌లైన్స్ ప్రతినిధి మాట్లాడుతూ, మిలన్ నుంచి న్యూయార్క్ బయల్దేరిన డెల్టా ఫ్లైట్ 185ను వాతావరణం కారణంగా రోమ్‌లో ల్యాండ్ చేశాం. ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు' అని వెల్లడించారు. ప్రస్తుతం విమానం స్థితిని క్షుణ్ణంగా పరిశీలించామని వెల్లడించారు. విమానానికి జరిగిన నష్టాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. కానీ ప్రయాణికులు సోషల్ మీడియాలో పోస్టు చేసిన చిత్రాల్లో విమానం ముక్కు పూర్తిగా ధ్వంసమైనట్లు ఉంది. దీంతో పాటు రెండు ఇంజిన్లు, రెక్కలు కూడా వడగళ్ల కారణంగా దెబ్బతిన్నాయి. విమానంలో 215 మంది ప్రయాణికులు, 8మందిసహాయక సిబ్బంది, ముగ్గురు పైలట్లు ఉన్నారు. వడగళ్ల వర్షంలో చిక్కుకొన్నాక విమానం ఒక్కసారిగా అదుపు తప్పిందని ప్రయాణికులు వెల్లడించారు. ఒకదశలో విమానం ముక్కలైపోతుందేమోనని తాము భయపడ్డామని ఓ ప్రయాణికురాలు పత్రికలకు వెల్లడించారు. రోలర్‌కోస్టర్ ఎక్కినట్లు తమకు అనిపించిందని తన అనుభవాన్ని పంచుకొన్నారు.



# స్కూళ్లలో స్మార్ట్‌ఫోన్లు నిషేధించండి

## యునెస్కో గ్లోబల్ బ్యాన్ పిలుపు

**ప్యారిస్, జులై 26:** ప్రపంచవ్యాప్తంగా పాఠశాలల్లో, పాఠశాల దశలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు వినియోగించడంపై నిషేధించాల్సిన అవసరం ఉందని ఐక్యరాజ్య సమితి విభాగం యునెస్కో అభిప్రాయపడింది. ఈ మేరకు ఒక సమగ్ర నివేదికను రూపొందించింది. ఫోన్ ఎక్కువగా వాడడం వల్ల చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని, అధికస్థాయి స్క్రీన్ సమయం పిల్లల భావోద్వేగాలపై ప్రభావం పడుతోందని, వీటికి శాస్త్రీయంగానూ రుజువులు ఉన్నాయని విషయాన్ని కూడా తన నివేదికలో యునెస్కో పొందుపరిచింది. ' డిజిటల్ విప్లవం శక్తివంతమైందే కావొచ్చు. కానీ ముఖాముఖి బోధన అనేది పిల్లలకు చాలా అవసరం. ఆ అవసరాన్ని స్మార్ట్ ఫోన్, డిజిటల్ టెక్నాలజీ చివరకు ఏఐ సాంకేతికత ఎప్పటికీ భర్తీ చేయలేవని ప్రభుత్వాలు కూడా గుర్తించాలని యునెస్కో సూచించింది. కరోనా టైంలో కోట్ల మంది డిజిటల్ ఎడ్యుకేషన్‌కి పరిమితం అయ్యారని తెలిసిందే. కానీ అదే సమయంలో ఇంటర్నెట్‌కు దూరంగా ఉన్న లక్షల మంది పేదపిల్లలు పూర్తిగా చదువుకు దూరమయ్యారని యునెస్కో గుర్తుచేస్తోంది. అలాగే ఇప్పటికీ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కొనసాగించడాన్ని యునెస్కో తీవ్రంగా తప్పుబట్టింది. విద్యాసంస్థల్లో సాంకేతికత వివనియోగంపై చైనాను చూసి నేర్చుకోవాలని ప్రపంచానికి యునెస్కో సూచించింది. డిజిటల్ పరికరాలను బోధనా సాధనాలుగా ఉపయోగించడానికి చైనా సరిహద్దులను నిర్దేశించింది. మొత్తం బోధనా సమయంలో 30శాతానికి పరిమితంచేసిందని తెలిపింది. కరోనా టైంలోమాత్రమే చైనా ఆన్‌లైన్ విద్యను ప్రోత్సహించిందని, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాక తిరిగి విద్యాసంస్థలకే రప్పించుకుంటున్న విషయాన్ని ఈ సందర్భంగా యునెస్కో ప్రత్యేకంగా ప్రస్తావించింది.

# భారత్ నియంత్రణ రేఖ దాటడానికి రెడీగా ఉంది: రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ, జులై 26:** భారత్ గౌరవ ప్రతిష్టలను కాపాడుకోవడానికి నియంత్రణ రేఖను దాటడానికి సిద్ధంగా ఉందని, ప్రజలు కూడా సైన్యానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఆయన ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్ని ప్రసంగించారు. బుధవారం దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ' మనకు పాకిస్థాన్ వెన్నుపోటు పొడిచింది. భారత్ యుద్ధం చేయాల్సి వచ్చింది. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులకు వందనం చేస్తున్నాం. దేశం యుద్ధాన్ని ఎదుర్కోవాల్సినపరిస్థితి నెలకొన్న ప్రతిసారి ప్రజలు పరోక్షంగా మద్దతుగా నిలిచారు.

యుద్ధరంగంలో అసవరమైన చోట సైనికులకు నేరుగా మద్దతు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని నేను కోరుతున్నాను. దేశ గౌరవ ప్రతిష్టల కోసం మేము ఎక్కడి వరకైనా వెళ్లేందుకు సిద్ధమే. అవసరమైతే నియంత్రణ రేఖనూ దాటతాం. అందుకు మేము రెడీగా ఉన్నాం అని వ్యాఖ్యానించారు. సైన్యం సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్నంత సేపు శత్రువులకు ఇటు వైపు కన్నెత్తి చూసే ధైర్యం ఉండదని రాజ్‌నాథ్ అభివర్ణించారు. కేవలం కార్గిల్ యుద్ధంలోనే కాదు, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పలుమార్లు సైన్యం తమ ధైర్య సాహసాలతో దేశం గర్వించేట్లు చేసిందన్నారు.



మరోవైపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ ట్విట్టర్ వేదికగా కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు.' సాయుధ దళాల అసాధారణ ధైర్య సాహసాలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకొంటారు. భవిష్యత్తు తరాలకు వారి గాథలు స్ఫూర్తినిస్తాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ భారత వీరుల ధైర్య గాథను గుర్తుకు తెస్తుంది. వారు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వారికి హృదయ పూర్వక నివాలి'అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు.

# మైక్ కట్ చేయడం.. నాకు ' అవమానమే': ఖర్గే

**న్యూఢిల్లీ, జులై 26:** మణిపూర్ హింసపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ పార్లమెంటులో వివరణ ఇవ్వాలని విపక్ష సభ్యులు ఉభయ సభల్లో పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో రాజ్యసభలో మాట్లాడుతున్న క్రమంలో మైక్ కట్ చేయడం పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు, విపక్షనేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అది తన ఆత్మాభిమానాన్ని సవాలుచేయడమేనన్న ఆయన, చైర్మన్ అనుమతితో మాట్లాడుతున్న ప్పటికీ మైక్ కట్ చేయడం తనను అవమానించడమేనన్నారు. బుధవారం ఉదయం ఎగువసభ ప్రారంభమైన తర్వాత మాట్లాడిన మల్లికార్జున ఖర్గే పలు అంశాలను సభ దృష్టికి తీసుకువస్తున్నానని చెప్పారు. ' 267 కింద 50 మంది నోటీసులు ఇచ్చినప్పటికీ పార్లమెంటులో మాట్లాడేందుకు నాకు అవకాశం రాలేదు. కనీసం నేను మాట్లాడేటప్పుడైనా, అది పూర్తికాకుండానే నా మైక్‌ను ఆఫ్ చేశారు. ఇది నా హక్కులను భంగం కలిగించడమే. ఇది నాకు అవమానకంమే. వాళ్లు నా ఆత్మగౌరకవాన్ని సవాలు చేశారు. ఒకవేళ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ సభ నడుస్తుందనుకుంటే, అది ప్రజాస్వామ్యం కాదనే నేను భావిస్తా' అనిన మల్లి కార్జున ఖర్గే పేర్కొన్నారు. మంగళవారం సభలో చోటు చేసుకున్న వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ అధికార పక్షం తీరుపై మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అగ్రనేత మాట్లాడిన వెంటనే విపక్ష సభ్యులు ఆయనకు మద్దతుగా నిలిచి నినాదాలు చేశారు. దీంతో అది కార పార్టీ సభ్యులు కూడా 'మోడీ మోడీ' అంటూ ప్రతి నినాదాలు చేయడంతో సభ మొత్తం గందర గోళంగా మారింది. ఈ నేపథ్యంలో సభను క్రమపద్ధతిలోకి తీసుకురావాలని విపక్షనేత ఖర్గేతో పాటు సభాపక్షనేత పీయూష్ గోయల్‌లకు చైర్మన్ జన్‌దీప్ ధన్‌ఖడ్ విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఇరుపక్షాల సభ్యుల నినాదాలతో ఎగువసభ హోరెత్తిపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు.



## మతం నుంచి వ్యక్తిని, కమ్యూనిటీని బహిష్కరించే

# అధికారం ఏ వక్ఫ్‌బోర్డుకు లేదు

## కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతిఇరానీ



**న్యూఢిల్లీ, జులై 26:** ఓ మతం నుంచి కమ్యూనిటీని గానీ, వ్యక్తిని గానీ బహిష్కరించే అధికారం దేశంలోని ఏ వక్ఫ్‌బోర్డు లేదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతిఇరానీ బుధవారం స్పష్టం చేశారు. అహ్మదీయ కమ్యూనిటీని ముస్లిమేతరులుగా అభివర్ణిస్తూ ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు ఓ తీర్మానాన్ని ఆమోదించడంతో చెలరేగిన గొడవ నేపథ్యంలో కేంద్రమంత్రి స్మృతిఇరాని పై విధంగా అన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు వైఖరిని ప్రముఖ ముస్లిం సంస్థ జామాయిత్ ఉలేమా-ఇ-హింద్ మంగళవారం మద్దతు పలికింది. ఈ విషయమై కేంద్రమంత్రి స్మృతిఇరానీ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వక్ఫ్‌బోర్డులు పార్లమెంట్ చట్టం పరిధిలోకి వస్తాయన్నారు. అందుకు విరుద్ధంగా ఏ వక్ఫ్‌బోర్డు వ్యవహరించలేదని, పార్లమెంట్ గౌరవాన్ని, అది చేసిన చట్టాలను ఉల్లంఘించలేదని కేంద్రమంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను ఫత్వాద్వారా మార్పులు చేసేందుకు ఏ వక్ఫ్‌బోర్డుకు అనుమతి లేదన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రధానకార్యదర్శి నుంచి తాము సమాధానం కోరుతున్నామని, వాస్తవాలేమిటో తమ ముందుంచాలని చీఫ్ సెక్రటరీని కోరుతున్నామని కేంద్రమంత్రి అన్నారు. అలాగే ఈ వివాదంపై అహ్మదీయ ముస్లిం సమాజం నుంచి మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి అందిందని కేంద్రమంత్రి స్మృతిఇరానీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ స్పందన కోసం తాము ఎదురు చూస్తున్నామని అన్నారు.

## దేశంలో కరోనా తాజా

# కేసులు-60

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జులై26:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 60 కేసులు నమోదయ్యాయి. మృతి నమోదు కాలేదు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,95,392కు చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,62,008 మంది కోలుకోగా 1469 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,31,915కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.18శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,70,090కి చేరగా, 80,21,467 మంది వరకు కోలుకున్నారు. 1,48,556 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 69,07,094కి చేరింది. అందులో 68,34,130మంది కోలుకున్నారు. 71,945 మంది మరణించారు.

# ఆస్ట్రేలియా తీరంలో డజన్ల కొద్దీ పైలట్ తిమింగలాల మృతి!



**ఆస్ట్రేలియా, జులై 26:** ఆస్ట్రేలియాలోని ఓ సముద్ర తీరానికి 100కుపైగా పైలట్ తిమింగలాలు కొట్టుకొచ్చాయి. వీటిల్లో సుమారు 50కిపైగా ప్రాణాలు కోల్పోయాయి. మిగిలిన వాటి ప్రాణాలు కాపాడేందుకు సహాయక బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. తూర్పు అల్బానికి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలోకి చెయిన్స్ బీచ్‌లో ఈ ఘటన చోటు చేసుకొంది. మంగళవారం సాయంత్రం తీరానికి ఒక్కసారిగా డజన్ల కొద్దీ తిమింగలాలు కొట్టుకొచ్చాయి. చాలా వరకు తీరంలోని ఇసుకలో నిస్సహాయంగా చిక్కుకుపోయాయి. వీటిని రక్షించడానికి వైల్డ్‌లైఫ్ సహాయక బృందాలు రంగంలోకి దిగారు. బుధవారం ఉదయం నాటికే దాదాపు 36 పైలట్ తిమింగలాలు మృతి చెందాయి. ఆ తర్వాత వీటి సంఖ్య 51కి చేరింది. తాము మిగిలిన వాటిని రక్షించేందుకు యత్నిస్తున్నామని వైల్డ్‌లైఫ్ సర్వీస్ రీజనల్ మేనేజర్ పీటర్ హార్టీ వెల్లడించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రైమరీ ఇండస్ట్రీస్, జీవ వైవిధ్య శాఖ, వన్య ప్రాణి సంరక్షణ శాఖ అధికారులు ఇక్కడ సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలు ఈ తీరం వద్దకు రావద్దని అధికారులు అభ్యర్థించారు. ఈ పరిస్థితిపై వన్యప్రాణి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వానిస్సా పిరోట్టా మాట్లాడుతూ, ' ఒక్కసారి తిమింగలం ఇసుకలో చిక్కుకొంటే, దాని అంతిమ ఘడియలు మొదలైనట్లే' అని వ్యాఖ్యానించారు. ఈ బీచ్‌లో తిమింగలాల కళేబరాల నుంచి వచ్చే మాంసం వాసన షార్క్ చేపలను ఆకర్షిస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ ప్రాంతం లో సముద్రం వద్దకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. పైగా పశ్చిమ ఆస్ట్రేలియా తీరంలో షార్క్‌ల సంచారం చాలా ఎక్కువగా ఉంటుంది. పైలట్ వేల్స్, చాలా అరుదైన జీవులు, తిమింగలాలు రెండు మూడేళ్లకు ఒకసారి బిడ్డను కంటాయి. ఆ బిడ్డను పెంచడానికి తల్లి కొన్ని నెలల పాటు తిండీ తిప్పలూ లేకుండా ఉండిపోతుంది. అంతేకాకుండా ఆ బిడ్డ పెద్దదై తోడు వెతుక్కునే వరకూ కంటికి రెప్పలా కాపాడుకోవడానికి కొన్ని తిమింగలాలు మళ్లీ గర్భం దాల్చకుండా జాగ్రత్త పడతాయట. వీటి సంఖ్యతగ్గి పోవడానికి ఇది కూడా ఒక కారణం. పునరుత్పత్తి దశ దాటిన తర్వాత చాలా కాలం జీవించే ప్రాణులు మనిషి తర్వాత తిమింగలాలే. 40 యేళ్లకల్లా తిమింగలాలు పునరుత్పత్తి శక్తిని కోల్పోతాయి.

# విద్యుత్ సరఫరాపై బీహార్‌లో నిరసన, కాల్పుల్లో ఒకరి మృతి



**పాట్నా, జులై 26:** బీహార్‌లోని కటిహార్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ సరఫరాపై ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు కాల్పులు జరపడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బార్సోలైలోని సబ్‌డివిజన్ ఆఫీసర్ కార్యాలయం సమీపంలో జరిగింది. నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ ఏర్పడింది. తమ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలని డిమాండ్ చేస్తూ సబ్ డివిజనల్ కార్యాలయం సమీపంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇది ఉద్రిక్తతలకు దారి తీసింది. పోలీసులు లాఠీఛార్జ్ చేసే పరిస్థితి వచ్చింది. కొంతమంది రాళ్లదాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే ఈ ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. కాల్పుల్లో మరణించిన వ్యక్తిని 34 ఏళ్ల ఆలంగా గుర్తించారు. అతను బసల్ గ్రామానికి చెందినవాడు. స్థానిక మీడియా కథనాల ప్రకారం విద్యుత్ శాఖ తీరుకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన తెలిపారు. ఈ ప్రదర్శన సందర్భంగా కొంతమంది విద్యుత్ శాఖ కార్యాలయంపై దాడి చేశారని తెలుస్తోంది. పోలీసులు రంగప్రవేశం చేసి అదుపు చేసే ప్రయత్నం చేశారు. గుంపును చెదరగొట్టేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు.

# మూడువేల కార్లతో వెళుతున్న నౌకలో భారీ అగ్నిప్రమాదం!



**ఆమ్‌స్టర్‌డామ్, జులై 26:** నెదర్లాండ్‌కు చెందిన ఓ సరకు రవాణా నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దాదాపు 3 వేల కార్లతో నార్త్ సీ వెళుతున్న ఈ నౌకలో ఒక్కసారిగా చెలరేగాయి. ప్రమాద తీవ్రత పెరగడంతో భయాందోళనకు గురైన సిబ్బంది తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొందరు సముద్రంలో దూకినట్లు సమాచారం. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు సిబ్బందిని బయటకు తీసుకువచ్చారు. అయితే ఈ ఘటనలో ఓ వ్యక్తి ప్రాణ్యాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. నౌక పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అందులోని కార్లు దగ్ధమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని అన్నారు. జర్మనీలోని బ్రెమెన్ పోర్టు నుంచి ఈజిప్టులోని మరో పోర్టుకు ఫ్రైమాంటిల్ హైవేనౌక 2857 కార్లతో బయలుదేరింది. అందులో కొన్ని ఎలక్ట్రిక్ వాహనాలు కూడా ఉన్నాయి. సముద్రంలో ప్రయాణిస్తున్న నౌక అమేలాండ్ ద్వీపానికి 27 కిలోమీటర్ల సమీపంలో ఉండగా అందులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు అదుపులోకి వచ్చే అవకాశం కనిపించకపోవడంతో అందులో ఉన్న సిబ్బంది కొందరు సముద్రంలోకి దూకినట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న డచ్ కోస్ట్ గార్డ్ వెంటనే హెలికాప్టర్లు, బోట్ల సాయంతో అక్కడకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. నౌకలో మొత్తం 23 మంది సిబ్బంది ఉండగా వారందరినీ రెస్క్యూ సిబ్బంది బయటకు తీసుకువచ్చారు. అందులో ఓ వ్యక్తి అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించగా చాలా మందికి గాయాలయ్యాయి. మంటలు అదుపులోకి వచ్చే అవకాశం లేకపోవడంతో భారీ నౌక మునగకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మదనపల్లెలో కిలో టమాటా రూ.168

## మార్కెట్‌యార్డులో అత్యధిక ధర ఇదే, 30కిలోల టమాటా బాక్స్ రూ.5040

**మదనపల్లె, జులై 26 ప్రభాతవార్త :** టమోటా రైతులకు పండగే పండగ అంటూ ఎటు చూసినా చర్చించుకోవడం జరుగుతోంది. దేశ వ్యాప్తంగా టమోటా ధరలపైనే చర్చ జరుగుతోంది. అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా మార్కెట్‌యార్డులో టమోటాలు కొనుగోలు చేసి రైతు బజారుల్లో రూ.50లకే విక్రయిస్తున్నారు. బుధవారం మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డులో కేజి టమోటా రూ.168లు అత్యధిక ధర పలికింది. మార్కెట్‌యార్డు ఏర్పడినప్పటి నుంచి టమోటాకు ఇంత ధర పలకడం ఇదేనంటూ అధికారులు చెబుతున్నారు. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ ఏర్పడడం వల్ల ధరలు ఊహించని విధంగా పెరిగాయంటూ వ్యాపారస్తులు చెబుతున్నారు. పదికిలోల టమోటా బాక్స్ మొదటిరకం రూ.1560నుంచి 1680ల వరకు ధర పలికింది. 30కేజీల బాక్స్ రూ.5040లు ధర పలకింది. 361 మెట్రిక్ టన్నులు మార్కెట్‌కు వచ్చాయి. దిగుబడి తగ్గడం, ఇతర రాష్ట్రాల్లో టమోటాకు డిమాండ్ ఏర్పడడంతో గత 26 రోజులుగా ధరలు ఘననీయంగా పెరిగాయి. సామాన్య ప్రజానీకానికి టమోటా అందుబాటులో లేని విధంగా ధరలు పెరిగాయి. హోల్‌సేల్ ధరలు మార్కెట్‌లో కిలో రూ.168లు ఉంటే బయట ప్రాంతాల్లో కిలో రూ.200ల వరకు ధరలు పలుకుతున్నాయి. టమోటాలను కొనుగోలు చేయాలంటేనే వినియోగదారులు బొబెలెత్తుతున్నారు. టమోటాకు బంగారు ధరలు పలుకుతుండడంతో సాగు చేసిన టమోటా రైతులు ఆనందోత్సవాల్లో ఉంటున్నారు. మార్కెట్‌యార్డులో కూడా ఎలాంటి జాక్‌పాట్, కమీషన్ లేకుండా చైర్‌పర్సన్ తట్టి శారదమ్మ, డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి సెక్రటరీ అభిలాష్‌లు మార్కెట్‌యార్డులో ఫిర్యాద్ బాక్సులు ఏర్పాటు చేశారు. రైతులకు అన్ని విధాల సౌకర్యాలు సైతం కల్పిస్తున్నారు. ఈ ధరలు ఇంకా ఎన్నాళ్ళు ఉంటాయంటూ పలువురు చర్చించుకోవడం జరుగుతోంది. రాష్ట్రంలోనే టమోటా వ్యాపార లావాదేవీలకు మార్కెట్‌యార్డు పేరు పొందింది. ఏది ఏమైనా టమోటా ధరలు ఆకాశానంటుతుండడంతో టమోటాను బంగారు వస్తువులా చూసుకొంటున్నారు.



# మొబైల్ చూస్తూ జారిపడ్డ ఫిజీ ప్రధాని: తలకు తీవ్ర గాయం

**సువ , జులై 26:** ఫిజీ ప్రధానమంత్రి సితివేణి రబుకా ప్రమాదానికి గురయ్యారు. మొబైల్ ఫోన్ చూస్తూ కిందపడిపోవడంతో ఆయన తలకు దెబ్బతగిలింది. దీంతో ప్రధాని చైనా అధికారిక పర్యటనను అనూహ్యంగా రద్దు చేయాల్సి వచ్చిందని ఫిజిలోని చైనా రాయబార కార్యాలయం ప్రకటించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి గెంగ్డూలో జరిగే ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడల ప్రారంభోత్సవానికి ఫిజీ ప్రధాని హాజరుకావాల్సి ఉండగా ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ఒక ముఖ్యమైన దౌత్య కార్యక్రమంగా నిలవనుంది. అయితే తలకు గాయం కావడంతో చైనా పర్యటన రద్దు అయిందని స్వయంగా ప్రధాని వెల్లడించారు. ఫోన్‌ని చూస్తూ మెట్లు దిగుతుండగా జారిపడ్డానని, దాంతో తలకు గాయమైందని తెలిపారు. ఈ సంఘటన కారణంగా పర్యటనకు రావడం లేదని చైనాకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన కొత్త బిల్డింగ్ ప్రవేశ ద్వారం వద్ద మొబైల్ చూస్తూ పొరపాటున మెట్లపై జారి కిందపడిపోయాను. ఈ ప్రమాదంతో తలకు గాయమైంది. ఇప్పుడే ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చాను అని పేర్కొన్నారు.

కాగా గాయం నుంచి కోలుకున్న తర్వాత అధికారిక పర్యటన కోసం భవిష్యత్తులో చైనా నుంచి ఆహ్వానాలు అందుతాయని రబుకా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటన రద్దు ఫిజీ, చైనా మధ్య దౌత్య సంబంధాలపై ప్రభావం చూపదని భావిస్తున్నట్లు వెల్లడించారు.





# తిరుమలలో జడివాన

**తిరుమల,జూలై 26ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో తిరుమలను జడివాన వీడలేదు. బుధవారం ఉదయం నుండి కూడా అడపాదడపా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. సాయంత్రం అర్ధగంటపాటు చిరుజల్లులతో జడివాన కురిసింది. వరుసగా కురుస్తున్న వర్షాలు తిరుమలలో చలితీవ్రత పెరిగింది. చల్లటిగాలులు వీస్తున్నాయి. భక్తులు ఉదయం నుండే గదుల నుంచి బయటకు రావాలంటే చలికి వణుకుతున్నారు.

# తప్పిపోయిన మహిళల్లో చాలా మందిని గుర్తించాం

## ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం 26 వేల మంది మిస్ అయితే 23,300 మంది ఇళ్లకు చేరారు: డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి

**కర్నూలు, జూలై 26, ప్రభాతవార్త:** జాతీయ నేర గణాంకాల విభాగం లెక్కల మేరకు రాష్ట్రంలో 26వేల మంది మహిళలు మిస్ అయ్యారు... వారిలో 23,300 మంది ఇళ్లకు చేరారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి వివరించారు. ఈ విషయంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నేర నియంత్రణకు తీసుకోవలసిన విషయాల పై ఉమ్మడి జిల్లా అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు ,సిఐలకు పలు సూచనలు , సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. అనంతరం రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి కర్నూలు పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీరారెడ్డిలతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసులలో 26వేల మందిలో 23,300 మందిని గుర్తించి ఇళ్ళకు చేర్చామన్నారు. నేరాలు తగ్గించడమే ముఖ్య లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, గత 3 సంవత్సరాలతో పోలిస్తే 6 నెలల కాలంలో నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని, కర్నూలు, నంద్యాల జిల్లాలో గత 6 నెలల కాలంలో క్రైమ్ ఏవిధంగా ఉందో పరిశీలించామన్నారు. గత 3 సంవత్సరాలతో పోల్చి చూశామన్నారు. గణనీయంగా నేరాలు తగ్గాయన్నారు. బాడీలీ అఫెన్స్, మర్డర్, డౌరీ డెత్, హత్యాప్రయత్నాలు మొదలగు గ్రేవ్ క్రైమ్ కర్నూలు జిల్లాలో 27శాతం తగ్గాయన్నారు.బాడీలీ అఫెన్స్ నంద్యాల జిల్లాలో 25 శాతం తగ్గాయన్నారు. మహిళల పై నేరాలు కర్నూలు జిల్లా లో 46 శాతం, నంద్యాల జిల్లాలో 65 శాతం తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాదాలు కర్నూలు జిల్లాలో 39శాతం, నంద్యాలలో 36 శాతం తగ్గాయన్నారు. ఎస్సీ ఎస్టీ నేరాలలో 27 శాతం తగ్గాయన్నారు. దిశ యాప్ తో ముఖ్యంగా మహిళల పై నేరాలు చాలా వరకు తగ్గాయన్నారు. దిశ యాప్ కు ఫిర్యాదులు బాగా వస్తున్నాయన్నారు. వాటిని పరిష్కరించడం తో నేరాల తగ్గదల కనిపించిందన్నారు. గత సంవత్సరంలో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా కన్విక్షన్ బేస్ పోలీసింగ్ ఏర్పాటు చేశామన్నారు. దానితో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. మేజర్ గ్రేవ్ కేసులలో 120 కేసులకు గాను, 100 కేసులలో ఫలితాలు వచ్చాయన్నారు. డెత్ పెనాల్టీ మరియు, 30 ఏళ్ళ నుండి 40 ఏళ్ళ వరకు కూడా జైలు శిక్షలు విధించడం జరిగిందన్నారు. క్రైమ్ తగ్గడంతో పాటు, కంట్రోల్ లో ఉంచడమన్నారు. రౌడీ మూకల పై గట్టి నిఘా ఉంచామన్నారు. పోలీసు యంత్రాంగం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందన్నారు. గత సంవత్సరం లో రౌడీ మూకలపై, అక్రమ మద్యం రవాణా చేసే గ్యాంగ్ ల పై పీడీ యాక్టు క్రింద 35 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా పిడి యాక్టులు సిద్ధం చేశామన్నారు. గత సంవత్సరాలలో పోలీసులు చేసిన పని విధానాన్ని అంచనికి వర్గీకరించామన్నారు. డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు ఆయా పోలీసు స్టేషన్ లలోని ప్రాధాన్యత గల కేసులలో ప్రతి పోలీసు అధికారికి 10 కేసుల చొప్పున కేటాయించి అన్ని కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 13 వేల కేసులు అందజేస్తే 1400 కేసులు ట్రయల్ పూర్తయి 62 శాతం రికార్డు స్థాయిలో కన్విక్షన్ వచ్చిందన్నారు. ఎస్సైలకు పదోన్నతులు రావడం లేదని వినతి పత్రం అందజేశారన్నారు. సానుకూలంగా పరిశీలించామన్నారు. పోలీసుశాఖలోని ఎస్సైలకు సిఐలుగా పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. సూపర్ న్యూమరి డిఎస్పీలను రెగ్యులర్ డిఎస్పీలుగా పదోన్నతులు కల్పించామన్నారు. గత 3 సంవత్సరాలలో ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం మిస్సింగ్ కేసులలో 26 వేల మందిలో 23,300 మంది ట్రేస్ అయి ఇళ్ళకు చేరుకున్నారన్నారు. ట్రేస్ అయ్యే కొద్ది కేసులు పూర్తిగా తగ్గుతూ వస్తాయన్నారు.




కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎండియు ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుడిచేటి కిషోర్‌కుమార్

# రేషన్ షాప్ డీలర్ల ఆరోపణల్లో వాస్తవం లేదు

### ఒక్క గింజ తేడా లేకుండా కార్డుదారులకు సరఫరా చేస్తున్నాం

### ఎండియు ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుడిచేటి కిషోర్‌కుమార్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 26 ప్రభాతవార్త:** మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్(ఎండియు) ఆపరేటర్ల వ్యవస్థతో తమకు నష్టం వాటిల్లుతోందని గతంలో విజయవాడలో జరిగిన సమావేశంలో రేషన్ షాప్ డీలర్లు తమపై చేసిన ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదని ఎండియు ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుడిచేటి కిషోర్‌కుమార్ ఖండించారు.మంగళవారం సాయంత్రం ఆయన యూనియన్ నాయకులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఎండియు ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్‌ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందచేసి సమస్యలను వివరించారు.దీనికి స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రమాద బారిన పడి మరణించిన 58 మంది ఎండియు ఆపరేటర్లకు ఒక్కొక్కరికి లక్ష రూ॥ల చొప్పున ఇచ్చేలాగా సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తానన్నారు.ఇన్సూరెన్స్ పేపర్‌సలోని తప్పులను సరిదిద్దుతూ కొత్త ఇన్సూరెన్స్ పేపర్లను ఎండియు ఆపరేటర్లకు అందచేస్తామన్నారు.అలాగే వాహన మిత్ర డబ్బులను అందరికీ వచ్చేలాగా చేస్తామని,ఎండియు ఆపరేటర్ల వాహనాలకు ఫిట్‌నెస్ అపరాధం లేకుండా చేస్తామన్నారు.ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణం విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషోర్‌కుమార్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణతో కలిసి మాట్లాడుతూ రేషన్ డీలర్లు తమ ఎండియు ఆపరేటర్లపై చేసినవి నిరాధార ఆరోపణలని ఖండించారు.తాము ఒక్క గింజ కూడా తేడా లేకుండా కార్డుదారులకు బియ్యం సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.కరోనా లాంటి విపత్కర సమయంలో సైతం ఒక్కో ఆపరేటర్ 1500 నుండి 2 వేల ఇండ్లకు రేషన్ అందించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.డీలర్లకున్న సమస్యలను ప్రభుత్వం ముందు చెప్పుకోవచ్చు కానీ..తమ ఎండియు ఆపరేటర్లపై నిందలు వేయడం సరికాదన్నారు.ఎండియు ఆపరేటర్ల విధానం రాకముందు రేషన్ డీలర్లు 100 శాతం కార్డుదారులకు బియ్యం ఇచ్చేవారా అని ప్రశ్నించారు.ఇకనైనా తమ ఆరోపణలు చేయడం మానుకోవాలని రేషన్ డీలర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,కోశాధికారి సాంబశివరావు,సుధాకర్‌రెడ్డి, వేణు, అరవింద్,రామాంజనేయులు, దేవ,హేమంత్, తోట కుమార్, చిరంజీవి, అలాగే 26 జిల్లాల ఎండియు ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీమ ప్రాజెక్టులు రద్దుచేసిన జగన్

>> మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రాజేస్తున్నారని అన్నారు.. యువగళం పాదయాత్రలో లోకేష్ రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేసేలా ఒక ప్రణాళిక ప్రకటించారని, అవకాశాలు గని అయిన రాయలసీమను అభివృద్ధి చేస్తే రాష్ట్రం రూపురేఖలే మారిపోతాయన్నారు..గతంలో నీటికోసం తలెత్తిన సమస్యలను చాలా వరకు పరిష్కరించామని చంద్రబాబు వెల్లడించారు.. బుధవారం ఇక్కడి పార్టీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై చంద్రబాబు సుదీర్ఘమైన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మీడియాకు వివరాలు అందించారు. రాష్ట్రంలో రాయలసీమ తీవ్ర నీటి ఎద్దడి ఉంటుందని, ఈ కారణంగా సీమ నీటికష్టాలు తీర్చటానికి ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టును తీసుకొచ్చారన్నారు. కృష్ణా మిగులు జలాలను కరువు ప్రాంతానికి అందించటంకోసం, నలుగురు సిఎంలను ఒప్పించారన్నారు. ఆ ప్రాజెక్టుతో తమిళనాడుకు కూడ మంచినీరు అందించారని తెలిపారు. తెలుగుగంగ తర్వాత గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులతో మొత్తం రాయలసీమను సస్యశ్యామలం చేయాలని ఎన్టీఆర్ తలచారని అన్నారు. తాను వచ్చాక పట్టిసీమ నిర్మించి, కృష్ణాజలాలను సీమకు అందించానని అన్నారు. దేశమంతా ఆలోచిస్తున్న నదుల అనుసంధానం ప్రాజెక్టులో ఇదొక తొలి అడుగు అన్నారు.. నదుల అనుసంధానం చేయగలిగితే రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వవచ్చని ఆలోచించి దానికి అనుగుణంగా ఒక బ్లూప్రింట్ తయారు చేశామన్నారు.. గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదులతో కలిపి మొత్తం రాష్ట్రంలో చిన్నవి పెద్దవి 69 నదులు ఉన్నాయన్నారు. గోదావరిపై నిర్మించిన పోలవరం ప్రాజెక్టు పూర్తయితే, ఆ నీటిని నేనరుగా వివిధ మార్గాల్లో ఇచ్ఛాపురం వరకు అందించేలా ప్రణాళికలు చేశామని తెలిపారు. అదే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు మరోపక్క పోలవరం కుడికాలువ ద్వారా ప్రకాశం బ్యారేజీకి నీటిని తరలించి, శ్రీశైలంలోని కృష్ణానీటిని రాయలసీమకు తరలించేలా ప్రణాళికలు తయారుచేశామని తెలిపారు. మరోవైపు ప్రకాశం బ్యారేజీకి వచ్చే కృష్ణానీటిని వైకుంఠపురంలో ఒక బ్యారేజీ కట్టి అక్కడి నుంచి పల్నాడుజిల్లా నకిరికల్లులోని నాగార్జునసాగర్ కుడికాలువకు కలపాలని ఆలోచించామన్నారు.. దీనికి సంబంధించిన పనులకు టెండర్లు కూడ పిలవటం జరిగిందన్నారు. అదే సమయంలో బొల్లాపల్లిలో రిజర్వాయర్ కట్టి, నల్లమల ఫారెస్ట్‌లో ఒక 35 కిమీ టన్నెల్ నిర్మిస్తే, గోదావరి నీరు నేరుగా పెన్నానదికి వెళ్తుందన్నారు. అక్కడ నుంచి నేరుగా రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లకు కేంద్రబిందువైన బనకచర్ల రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తే, అక్కడి నుంచి కండలేరు, సోమశిల వరకు నీటిని పంపవచ్చన్నారు. ఈ మొత్తం ప్రణాళికతో నదుల అనుసంధానం మొత్తం పూర్తవుతుందన్నారు. ఈ విధమైన ఆలోచన, దూరదృష్టితో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని ఆలోచించానని అన్నారు.

సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి టిడిపి పదేళ్లలో రూ.68,293 కోట్లు ఖర్చుపెడితే, వైకాపా నాలుగేళ్లలో రూ.22,165 కోట్లు మాత్రమే వెచ్చించిందని అన్నారు. తెదేపా ప్రభుత్వం మొత్తం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 2014-19 లో రూ.68,293 కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. ఈప్రభుత్వం రూ.22,165 కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. మొత్తం బడ్జెట్‌లో తెదేపా ప్రభుత్వం 9.63 శాతం నిధులను సాగునీటి రంగానికి ఖర్చుపెడితే, ఈ ప్రభుత్వం 2.35 శాతమే ఖర్చుపెట్టిందన్నారు.ఆ నిధులు, పనులు చేయటానికి కాదని, కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టు సంస్థలకు దోచిపెట్టారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్య ఈ సిఎంకు తెలియదు అని అన్నారు. నాటకాలు ఆడాడని, మొదటిసారి అసెంబ్లీలో మాట్లాడుతూ, గోదావరి నీటిని శ్రీశైలానికి తీసుకొస్తానని ప్రగల్బాలు పలికారని, తెలంగాణ సిఎం ఒప్పుకున్నారని గొప్పలుచెప్పారన్నారు. తాను అపుడే చెప్పానని, మీ ఆలోచనలు సాధ్యం కావని, తెలుగుగంగ అనుభవంతో ఏం చేయాలో అదిచేయండని అన్నారు. తెదేపా ప్రభుత్వంలో సాగునీటిరంగానికి జరిగిన కేటాయింపులు, వెచ్చించిన నిధులు గురించి వివరిస్తూ బడ్జెట్‌లో పెట్టింది రూ.43,572 కోట్లు అయితే ఖర్చుపెట్టింది రూ.55,893.71 కోట్లు అని తెలిపారు. అదే తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధి అన్నారు. అదనంగా నీరు-ప్రగతి కార్యక్రమం కింద 12,400.23కోట్లు ఖర్చుపెట్టామన్నారు.. అదేవిధంగా రాయలసీమ ప్రాజెక్టుల నిర్మాణానికి తెదేపా ప్రభుత్వం, వైకాపా చేసిన ఖర్చును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా చంద్రబాబు వివరించారు. రాయలసీమకు సాగునీటిని అందించే అతిముఖ్యమైన తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం 2014-19లో రూ.504 కోట్లు ఖర్చుపెడితే వైఎస్సార్సీ ప్రభుత్వం రూ.383 కోట్లు ఖర్చుచేసిందన్నారు..అంతేకాకుండాఈ నాలుగేళ్లలో అదనపు ఆయకట్టు పెంచటానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మొత్తం ప్రాజెక్టు 2020 నాటికి పూర్తిచేస్తామన్నారని, ఇంతవరకు అతీగతీ లేదన్నారు. హంద్రీనీవా మొత్తం ఆయకట్టు 5,33,417 ఎకరాలని, టిడిపి ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.4,162 కోట్లుకాగా, వైఎస్సార్సీ ప్రభుత్వం చేసిన ఖర్చు కేవలం రూ.515 కోట్లు మాత్రమే అనానరు. టిడిపి హయాంలో ఫేజ్1 కింద 84శాతం పనులు జరిగితే, ఫేజ్2లో 75శాతం పనులు జరిగాయన్నారు. ఈ ప్రభుత్వం ఈప్రాజెక్టును 2020 జూన్‌నాటికి పూర్తిచేస్తామని ప్రగల్బాలు పలికిందని, ఇంతవరకు ఏమీ పూర్తికాలేదన్నారు. మడకశిర బ్రాంచి కెనాల్ ఆయకట్టు విస్తీర్ణం 80వేల ఎకరాలని, తెదేపా హయాంలో రూ.1942 కోట్ల పనులకు టెండర్లు పిలిచామని, వైకాపా ప్రభుత్వం వచ్చాన టిడిపి హయాంలో జరిగిన పనులకు పైసా ఇవ్వలేదన్నారు.అదేవిధంగా గాలేరునగరి ఫేజ్1, ఫేజ్2 మొత్తం ఆయకట్టు 2,58,500 ఎకరాలని, తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.1546 కోట్లు ఖర్చుపెట్టామని, వైకాపా ప్రభుత్వం రూ.443.43 కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. దీన్నికూడ 2020 జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పిన వైఎస్సార్సీ ప్రభుత్వం ఎక్కడిపనులను అక్కడే ఆపేసిందన్నారు.

**రాయలసీమంలో 102 ప్రాజెక్టులను ప్రీక్లోజర్ చేసిన జగన్**

**సీమద్రోహి:** వైఎస్సార్సీ ప్రభుత్వం 102ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లు మొత్తాన్ని ప్రీక్లోజర్ చేసిందని అన్నారు.. వీటిలో ప్రధానంగా కర్నూలులో 9ప్రాజెక్టులు, చిత్తూరులో 29, కడపలో 14, అనంతపురంలో 38, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు 16 ఉన్నాయన్నారు. మొత్తం రాయలసీమలోని 102 ప్రాజెక్టుల పనులు ఆపేసి, కాంట్రాక్టు సంస్థలకు బ్యాంక్ గ్యారంటీలు వెనక్కు ఇచ్చేశారన్నారు. సీమ ప్రాజెక్టుల పనులు ఆపేసిన వారు రాయలసీమ ద్రోహి కాక రక్షకుడు అవుతాడా? అనిప్రశ్నించారు. నేడు రాయలసీమ ప్రాజెక్టుల దుస్థితిని ప్రజల ముందు ఉంచానని, రేపు ఆంధ్రా ప్రాజెక్టులతోపాటు పోలవరం దుస్థితిని తెలియజేస్తానని అన్నారు. వైకాపా దుర్మార్గాలపై ప్రజలందరూ ఆలోచించాలని అన్నారు.

**5కోట్ల ప్రజల తరపున అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది:**

5 కోట్ల ప్రజల తరపున అడిగినవాటికి సమాధానం చెప్పాలని, బాధ్యత కలిగిన ప్రభుత్వమైతే సమాధానం చెబుతుందని అన్నారు. స్పందించకపోతే అభివృద్ధి వ్యతిరేకమైన ఈ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపటానికి ప్రజలంతా సిద్ధం కావాలని అన్నారు. టిడిపి ప్రభుత్వం రాగేనే రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులను నదుల అనుసంధానంలో భాగంగా పూర్తిచేసి, ప్రతి ఎకరాకు నీళ్లిస్తామన్నారు. జగన్ ప్రీక్లోజర్ చేసిన 102 ప్రాజెక్టులను మళ్లీ ఓపెన్‌చేసి అన్నీ పూర్తిచేస్తామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 64 ప్రాజెక్టులు ఉంటే,, తెదేపా ప్రభుత్వమే 24 పూర్తిచేసిందని మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చంద్రబాబు స్పందించారు. రాయలసీమకు ఇరిగేషన్ ప్రాజెక్టులు చాలా కీలకమని, ఒకప్పుడు నీళ్లు లేక పశువులను కాపాడటానికి ప్రత్యేక క్యాంపులు పెట్టామన్నారు.అలాంటి పరిస్థితిని చాలా వరకు మార్చామన్నారు.టిడిపి ప్రభుత్వంరాయలసీమ ప్రాజెక్టులకు రూ.12,441 కోట్లు ఖర్చుపెడితే, ఈ ప్రభుత్వం రూ.2,011 కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. సీమకు ఇంత అన్యాయం చేసినందుకు సిగ్గుతో తలవంచుకొని రాయలసీమ వాసులకు, రైతు లకు, యువతకు క్షమాపణలుచెప్పాలన్నారు.. చేతగాక పోతే దిగిపోవాలి తప్ప ఇలా ద్రోహం చేయటం సరికాదన్నారు.



మాదిగల ఐక్యత చాటుతున్న దృశ్యం

# మాదిగల ద్రోహి బిజెపి

### ఎస్సీ వర్గీకరణపై కాలయాపన: ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

**శ్రీకాళహస్తి, జూలై 26 ప్రభాతవార్త:** మాదిగల ద్రోహి బిజెపి ప్రభుత్వం అని, అందుకే షెడ్యూల్ కులాల వర్గీకరణ చట్టాన్ని తీసుకురావడంలో కాలయాపన చేస్తోందంటూ ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు ధ్వజమెత్తారు.స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ సమాజాన్ని ఓటు బ్యాంకుగా చూస్తున్న రాజకీయ పార్టీలకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ళయిన పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ప్రతిపాదన తేలేదన్నారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయని గత 30 ఏళ్ళుగా ఎస్సీ వర్గీకరణపై హామీలు గుప్పించిన ఏఒక్క రాజకీయ పార్టీ కూడా ఎస్సీ కులాల వర్గీకరణకు చట్టభద్రత కల్పించాలన్న డిమాండ్‌ను తెరపైకి తీసుకురాలేదని వాపోయారు. అడగకుండానే ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370, అయోధ్యరామ మందిర నిర్మాణం, జీఎస్టీ, అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించిన మోడీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు మాత్రం ఎందుకు ముందడుగు వేయడం లేదని ప్రశ్నించారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ చట్టం తన తండ్రి కల అన్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న మాదిగల్లో నేను పెద్ద మాదిగనవుతానన్న చంద్రబాబు, మాతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమన్న కాంగ్రెస్ పార్టీలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని నిలదీశారు. తరతరాలుగా మాదిగ సమాజానిన రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటూ అటు కర్ణాటక ప్రభుత్వం ఇటు తెలంగాణా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపగా జగన్ ప్రభుత్వం మాత్రం మౌనం వహించడం వెనుక ఆంతర్యమేమిటన్నారు. ఆగస్టు రెండోవారంలో హైదరాబాదు వేదికగా 20లక్షల మంది మాదిగలతో విశ్వరూపం మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇర్లరాజు, జి.మధు, చంద్ర, గిరి, వెంకటముని, బాలరాజు, ఈశ్వర్, యువరాజు, బలరాం, మధు, మాతయ్య, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లు-మద్దికెర మధ్య పూర్తి అయిన డబ్లింగ్, విద్యుద్దీకరణ మార్గం

# రాష్ట్రంలో మరోకీలక సెక్షన్‌లో డబ్లింగ్, విద్యుద్దీకరణ పూర్తి: జి.ఎం.అరుణ్‌కుమార్ జైన్

**గుంతకల్లు రైల్వే, జులై 26 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, దక్షిణ మధ్య రైల్వే గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలుమార్గంలో అంతర్భాగమైన డోన్-గుంతకల్లు మధ్య డబ్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టు పనులు పూర్తి కావడంతో, ఈమార్గంలో రైళ్ల నిర్వహణను ప్రారంభించినట్లు జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ప్రకటించారు.రాష్ట్రంలోని గుంటూరు,పల్నాడు, ప్రకాశం, నంద్యాల,కర్నూలుజిల్లాలను కలిపే గుంటూరు-గుంతకల్లు, గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలోని 401 కిలోమీటర్ల రైలు మార్గాన్ని డబ్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టును చేపట్టేందుకు 2016-17 ఆర్థిక సంవత్సరంలో రైల్వే శాఖ రూ.3,887 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. దీంతో గుంటూరు-పాతలూరుల మధ్య 32కిలోమీటర్లను, మద్దికెర- డోన్-57 కిలోమీటర్లు, బేతంచెర్ల-మల్కాపురం-23 కి.మీలు, మునుమాక- శావల్యాపురం-22 కి.మీలు, జగ్గంబోట్ల కృష్ణాపురం- చీకటిగల పాలెం-87 కి.మీలు, తాజాగా మద్దికెర-గుంతకల్లు-10.7 కి.మీలు వెరసి మొత్తం 232.4 కిలోమీటర్ల మేర డబ్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టు పనులను తమ సిబ్బంది చిత్తశుద్ధి, నిబద్ధతతో నిర్ణీత కాలవ్యవధిలో గానే పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతో గుంతకల్లు-డోన్ సెక్షన్‌లో నిరంతరాయంగా రైళ్ల రాకపోకలు నిర్వహించేందుకు మార్గం సుగమం అయిందన్నారు. ప్రస్తుతం కంబం-జగ్గంబోట్ల కృష్ణాపురం-సోమిదేవిపల్లిల మధ్య డబ్లింగ్, విద్యుదీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

# నేటి నుంచి తెలుగు రాష్ట్రాల నుండి గోవా వెళ్లే రైళ్ల రద్దు

### మరికొన్ని పాక్షికంగా రద్దు..

**గుంతకల్లు రైల్వే, జులై 26 ప్రభాతవార్తం** తెలుగు రాష్ట్రాల నుంచి గోవా వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను గురు శుక్రవారాల్లో రెండు రోజులపాటు రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. నైరుతి రైల్వే, హుబ్లీ డివిజన్ లోండా-వాస్కోడిగామా సెక్షన్‌లోని క్యాసల్‌రాక్-కరంజోన్ రైల్వే స్టేషన్ల మధ్య బ్రగాంజ ఘాట్‌లో రైలు మార్గంపై కొండచరియలు విరిగి పడుతుండటంతో ఈ మార్గంలో తిరిగే పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేయడంతోపాటు మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. నేడు (ఈ నెల 27న గురువారం) తిరుపతి నుంచి వాస్కోడిగామాకు బయల్దేరే నెంబర్ 17419 ఎక్స్‌ప్రెస్‌ను, హైదరాబాద్ నుంచి వాస్కోడిగామాకు బయల్దేరే నెంబర్ 17021 వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశారు. ఈ నెల 28న శుక్రవారం వాస్కోడిగామా నుంచి తిరుపతికి బయల్దేరే నెంబర్ 17420 ఎక్స్‌ప్రెస్‌ను, వాస్కోడిగామా నుంచి హైదరాబాద్‌కు బయల్దేరే నెంబర్ 17022 వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశామన్నారు. అలాగే ఈనెల 28న, వాస్కోడిగామా నుంచి జసిధికి బయల్దేరే నెంబర్ 17321 ఎక్స్‌ప్రెస్‌ను, వాస్కోడిగామా నుంచి షాలిమార్‌కు బయల్దేరే నెంబర్ 18048 అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను, వాస్కోడిగామా నుంచి కాచిగూడకు బయల్దేరే నెంబర్ 18048/17604 లింక్ ఎక్స్‌ప్రెస్ బోగీలను వాస్కోడిగామా-హుబ్లీల మధ్య పాక్షికంగా రద్దు చేశామన్నారు.

# నిర్దేశిత వ్యవధిలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి: జవహర్‌రెడ్డి

**విజయవాడ.జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీకి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు జలవనరుల శాఖ కీలకంగా వ్యవహరించాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం పోలవరం ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు.ఆయా ప్రాజెక్టులపై సమీక్షలో కీలకంగా చర్చించారు. పోలవరం ప్రాజెక్టు సనులు, పునరావాస ప్యాకేజీ పనుల వివరాలను సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రాజెక్టు సంబంధించి కేంద్రం ప్రకటించిన నిధుల విడుదల తదితరంశాల్లో అధికార యంత్రాంగంపరంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.ఈ విషయంలో అవసరమైన అన్ని ప్రతిపాదనలను కేంద్రానికి అందించాలన్నారు.ఈ ఏడాది చివరికి 5 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేసి,ఈ ఏడాది అంతానికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్పష్టం చేసారు.నిర్దేశిత గడువు ప్రకారం పనులు పూర్తి చేసేందుకు



తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ప్రాజెక్టుల నిర్మాణం పనుల్లో జాప్యాన్ని కారణాన్ని అన్వేషించి,వాటిని సరిదిద్దుకుంటూ వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్ట్ పనుల విషయంలో త్వరగా పూర్తి కావడం,నిర్దేశిత ఆయకట్టు ప్రాంతానికి ప్రయోజనం కలిగించడం ముఖ్యమన్నారు.పోలవరం ప్రాజెక్టు తొలిదశ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు పార్లమెంటు సాక్షిగా కేంద్రం ప్రభుత్వం ప్రకటించింది.ప్రాజెక్ట్‌ను 2024 నాటికి పూర్తి చేయలేకపోయినా, త్వరతిగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుం టామని తెలిపారు.ఈ క్రమంలో ప్రాజెక్ట్‌ల నిర్మాణంపై ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సమీక్షను నిర్వహించారు.

# ఫైబర్‌నెట్ వేదికగా వెబ్‌సిరీస్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మరో వారం రోజుల్లో ఫైబర్‌నెట్ వేదికగా వెబ్‌సిరిస్‌లు, షార్ట్ ఫిల్మ్ ప్రారంభిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్(ఏపీఎస్ఎఫ్ఎల్) డాక్టర్ పి,గౌతమరెడ్డి తెలిపారు. విజయవాడలోని ఏపీ ఫైబర్‌నెట్ కార్యాలయంలో" కాస్ట్లీకోరికలు" అనే చిత్రం విడుదల చేసారు.చిత్రానికి సంబంధించి పోస్టర్లును ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆ చిత్ర బృందంతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.ఫైబర్‌నెట్ ద్వారా" కాస్ట్లీ కోరికలు" అనే సినిమాను రూ.40కే విడుదల చేస్తున్నామన్నారు.కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన ఒక యధార్ధ ఘటన ఆధారంగా సస్పెన్ థ్రిలర్‌ను కెక్కిందన్నారు.కొత్త తరహా కాన్సెప్ట్ కావడం, హీరోయిన్ లేకుండా కేవలం యంగ్ స్టర్స్‌తో మాత్రమే తీసిన సినిమా కావడంతో ప్రేక్షకులు కుడా చూసేందుకు ఆసక్తి ఉన్నారన్నారు.ఈ చిత్రాన్ని ఈస్ట్‌వెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై బ్లాక్ స్పేస్ ప్రొడక్షన్‌లె ఎస్వీ ఝాన్సీలక్ష్మి నిర్మాతగా, ఎస్‌వీవీ సాయికుమార్ రాజు దర్శకత్వంలో తెరకెక్కించారు.గతంలో తొలి సినిమాను రూ.100కు అందించిన ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఈ చిత్రాన్ని కేవలం రూ.40కే అందిస్తున్న విషయాన్ని గౌతమ్‌రెడ్డి గుర్తు చేసారు.ఔత్సాహిక కళాకారులకు ఏపీ ఫైబర్ నెట్ సరైన వేదిక అని గౌతమ్‌రెడ్డి తెలిపారు.




కాస్ట్లీ కోరికలు చిత్రం పోస్టరును ఆవిష్కరిస్తున్న గౌతమరెడ్డి

# జగ్గయ్యపేటలో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అరెస్ట్

### 1.200ల కిలోగ్రాముల గంజాయి స్వాధీనం

**జగ్గయ్యపేట, జూలై 26, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ఆటోలో గంజాయి రవాణాచేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి వారి నుండి 1.200 కిలోగ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నందిగామ ఏసిపి కె జనార్ధన్ నాయుడు కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని విజయవాడ రోడ్‌లోగల వైఎస్ఆర్ విగ్రహ కూడలివద్ద ఎన్టీఆర్ జిల్లా సిటి పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా ఆదేశాలతో రూరల్ డిసిపి వి అజిత, పర్యవేక్షణలో వాహనాలను పోలీసులు తనిఖీచేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తూ పోలీసులను చూసిపారిపోతుండటంతో ఎస్ఐ బి వెంకటరామారావు, సిబ్బంది వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 1.200 కిలోగ్రాముల గంజాయిని స్వాధీనర్చుకున్నారు. జగ్గయ్యపేట ధనంబోడు కాలనీకి చెందిన షేక్ షాబుద్దీన్, విజయవాడ వైఎస్ఆర్ కాలనీకి చెందిన పోలంపల్లి రవికుమార్, మాచవరం కార్మిక నగర్‌కు చెందిన గరికపాటి బాబు లను అరెస్ట్‌చేశారు. ఆటోను సీజ్‌చేశారు. ఈసందర్భంగా సిఐ ఎం జానకీరామ్, ఎస్ఐ బివి రామారావుతో పాటు సిబ్బందిని ఏసిపి కె జనార్ధన్ నాయుడు అభినందించారు.



గంజాయి రవాణాచేస్తూ పట్టుబడిన నిందితులతో నందిగామ ఏసిపి కె జనార్ధ నాయుడు, జగ్గయ్యపేట సిఐ ఎం జానకిరామ్, ఎస్ఐ బివి రామారావు



రాజమహేంద్రవరంలో పురందేశ్వరికి ఘనస్వాగతం పలుకుతున్న బిజెపి శ్రేణులు

# పేదల వికాసం,అభివృద్ధే బిజెపి లక్ష్యం

## కేంద్రం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోంది

### బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బ్యూరో,జూలై 26, ప్రభాతవార్త:** దేశంలో పేదల వికాసం,అభివృద్ధే లక్ష్యంగా భారతీయ జనతాపార్టీ పనిచేస్తుందని,ఏపీ రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళిస్తోందని బీజేపీ రాష్ట్ర అద్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.రాజమహేంద్రవరంలో ఒక రోజు పర్యటన నిమిత్తం బుధవారం వచ్చిన ఆమె స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.ఏపీకి కేంద్ర ప్రభుత్వం 22 లక్షల ఇళ్లు ఇచ్చిందని, రాజమహేంద్రవరంనకు లక్షా 86 వేల ఇళ్ళు కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం ఎన్ని పూర్తి చేసిందో చెప్పాలని పురందేశ్వరి డిమాండ్ చేసారు.వైసీపీ పాలనలో మట్టి,ఇసుక మాఫియా చెలరేగిపోతోందని,చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితికి తీసుకువచ్చారని ఆరోపించారు.ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు.ఇళ్ళ స్థలాల పేరిట ఆవ భూముల కొనుగోళ్ళులో వైసీపీ నాయకులు పెద్ద మొత్తంలో దోచుకున్నారన్నారు.రాష్ట్రంలో రైతుల బాధలు వర్ణనాతీతమన్నారు.వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు ఏర్పాటు చేస్తామన్న మూడువేల కోట్ల ధరల స్థిరీకరణ ఏర్పాటుచేసారా?అని ప్రశ్నించారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని,పునరాస ప్యాకేజీ విషయంలో వైసీపీ ప్రభుత్వం సరైన గణాంకాలు కేంద్రానికి ఇవ్వడంలేదన్నారు.రాష్ట్రంలో జనసేన పార్టీతో పొత్తు కొనసాగుతుందని,మిగతా పార్టీలతో పొత్తులపై బీజేపీ అధిష్ఠానం చూసుకుంటుందని పురందేశ్వరి తెలిపారు.దొంగ ఓట్లతో వైసీపీ మరోసారి ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చూస్తోందని,రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిర్ణయంతో వైసీపీ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయ్యిందని పురందేశ్వరి అన్నారు.

**ఆగష్టు 10న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన :** గ్రామ స్వపరిపాలనను అటకెక్కించేలా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయితీలను నిర్వీర్యం చేస్తోందని పురందేశ్వరి అన్నారు.రాష్ట్రప్రభుత్వం పంచాయితీ నిధులను దారి మళ్ళించడంపై పార్టీలకతీతంగా గ్రామ సర్పంచిలు తమ మద్దతు కోరారని,వారికి బీజేపీ పూర్తి అండగా ఉంటుందన్నారు.ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని,ఆగష్టు 10న జిల్లాలో గ్రామ సర్పంచిలకు మద్దతుగా ధర్నాలు,17న రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై భారీ బహిరంగ సభ ఉంటుందని పురందేశ్వరి తెలిపారు.ఒక్కరోజు పర్యటనకు రాజమహేంద్రవరం విచ్చేసిన రాష్ట్ర అద్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి కొంతమూరు వద్ద గామన్ బ్రిడ్జిపై రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌ఛార్జి ఆకుల శ్రీదర్ ఆద్వర్యంలో ఉమ్మడి తూర్పుజిల్లా బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.అక్కడ నుండి ర్యాలీగా క్వారీ మార్కెట్‌లోని బీజేపీ కార్యాలయానికి తోడ్కొని వచ్చారు.

# ఔటర్‌రింగ్‌రోడ్ టెండర్ సమాచారంపై హైకోర్టుకు టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్ టెండర్‌పై సమాచారం ఇవ్వడం లేదని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తును హెచ్‌ఎం డిఎకు తాను దరఖాస్తు చేసుకున్నానని అయితే అధికారులు స్పందించడం లేదని రేవంత్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హెచ్‌ఎండిఎ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్‌ను ప్రతి వాదులుగా చేరుస్తూ రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తులో పేర్కొన్న అంశాలపై వెంటనే సమాచారం అందించాలని బాధ్యులను ఆదేశించాలని హైకోర్టును రేవంత్‌రెడ్డి కోరారు.

# ప్రాణం తీసిన ఈత సరదా



మానుపాటి వెంకటేష్ (ఫైల్)

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు వాటర్ ఫాల్స్‌లో పడి యువకుడు మృతి చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా సబితం వాటర్ ఫాల్స్ వద్ద బుధవారం జరిగింది. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన మానుపాటి వెంకటేష్ (23) వివేక నందా డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. కాలేజీలో స్నేహితులతో కలిసి వాటర్ ఫాల్స్ సందర్శనకు రాగా, ప్రమాదశాత్తు అందులో పడి మృతి చెందాడు. అనంతరం పెద్దపల్లి ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేఫ్టీ అధికారులు వెంకటేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. వాటర్ ఫాల్స్ వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉందని, ఎవరూ సందర్శనకు రావద్దని పోలీసులు ఎన్ని మార్లు విన్నవించిన యువత పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. బసంతనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభిస్తున్నారు.

# మెదక్ జిల్లాలో గంజాయి విక్రయదారుని అరెస్టు

**మెదక్, చిన్నశంకరంపేట, జులై 26, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌లో ఎండు గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రామాయంపేట ఆబ్కారి సిఐ జయసుధ బుధవారం తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన సమీర్ బోయ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గత కొన్ని రోజులుగా అతను ఎండు గంజాయిని



ఎండు గంజాయి నిందితుడిని పట్టుకున్న అబ్కారి సీఐ జయసుధ, సిబ్బంది

అమ్ముతున్నాడని తమ దృష్టికి రాగా దాడులు చేసి పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. అతని వద్ద 124 గ్రాముల ఎండు గంజాయి ప్యాకెట్లు దొరికాయని ఆమె తెలిపింది. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ జయసుధ తెలిపారు. పరిశ్రమలలో అక్రమంగా ప్రభుత్వం నిషేదించిన గుట్కాలను,గంజాయిని క్రయ,విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. రాష్ట్రం కాని రాష్ట్రం ఇక్కడ మత్తు పదార్థాలు విక్రయించి జైలుపాలైతే మిమ్మల్ని నమ్ముకొని ఉన్న కుటుంబ సభ్యుల పరిస్థితి ఎంటని ఆలోచించాలని ఆమె సూచించారు.అబ్కారి శాఖ ఎస్ఐ విజయ సిద్దార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో సమానంగా

# బిసి పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు వసతులు

- రేపు జిఓ విడుదల, లోగో ఆవిష్కరణ
- మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీ విద్యా సంబంధిత అంశాలైన జాతీయ సంస్థల్లో బీసీ రియింబర్స్‌మెంట్ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు సకల వసతులు వంటి నూతన కార్యక్రమాలకు సంబంధించి జిఓ విడుదల, నూతన లోగో ఆవిష్కరణను ఈ నెల 28న శుక్రవారం బిసి మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీని వాస్ గౌడ్‌తోపాటు బీసీ సంఘం నేతలు ఆర్.కృష్ణయ్య జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇతర నేతల సమక్షంలో విడుదల చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఈ మేరకు కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. విద్యనే అన్నింటికి మూలమని, సామాజిక సమానత్వం విద్యతోనే సాధ్యమనే గొప్ప నిర్ణయంతో ముఖ్యమంత్రి బీసీలకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.



కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

నిన్ననే తెలంగాణ బీసీ బిడ్డలకు జాతీయ స్థాయిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లోని ప్రతిష్టాత్మక ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ తదితర 200లకుపైగా విద్యాసంస్థల్లో బీసీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ అందజేసే పథకాన్ని ప్రకటించుకున్నా మన్నారు. వెనుకబడిన వర్గాల పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల విద్యార్థులకు తీపికబురు కేసీఆర్ సర్కార్ అందిస్తుందన్నారు. ప్రీమెట్రిక్ హాస్టల్ విద్యార్థుల మాదిరే రాష్ట్రంలోని బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల విద్యార్థులకు సైతం సంపూర్ణ వసతులు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 302 పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లలోని 34వేలకు పైగా బీసీ విద్యార్థులకు ఈ సంవత్సరం నుండి భోజన, వసతితో పాటు పూర్తి స్థాయిలో కాస్మెటిక్ చార్జీలు, వులన్ బ్లాంకెట్స్, బెడ్ షీట్స్, కార్పెట్, నోట్ బుక్స్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. గతంలో భోజన వసతి మాత్రమే అందజేసేవాళ్లమని, నేటి నిర్ణయంతో విద్యార్థులు మరింత ఉత్సాహంతో విద్యను అభ్యసించి రాష్ట్రం పేరును నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే బీసీ గురుకులాల విద్యార్థులు రాష్ట్రం పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా నిలుపుతన్నారని, మంగళవారమే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలోని ప్రతిష్టాత్మక సంస్థల్లో చేరే బీసీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ ప్రకటించిందని, ఇలాంటి అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ప్రత్యేకంగా మంత్రి గంగుల ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎసిబికి చిక్కిన లాలాగూడ లైన్‌ఇన్‌స్పెక్టర్

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** నగరంలోని లాలాగూడలో గల ట్రాన్స్‌కో విభాగం టిఎస్ఎస్‌పిడిసిఎల్‌కు చెందిన ఓ లైన్ ఇన్‌స్పెక్టర్ న్యాయవాది నుంచి ఆరు వేల రూపాయల లంచం తీసుకుంటూ ఎసిబికి దొరికిపోయాడు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎసిబి డిజి రవి గుప్తా దీనికి సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. లాలాగూడకు చెందిన మహమ్మద్ షాహిద్ అలీ అనే న్యాయవాది తన ఇంట్లో వున్న కమర్షియల్ కరెంట్ మీటర్‌ను డొమెస్టిక్ మీటర్‌గా మార్చేందుకు సంబంధిం చిన దరఖాస్తు చేసుకుని, ఇందుకు కావాల్సి న పత్రాలు సమర్పించాడు. అయితే దీనికి సంబంధించిన ఫైల్‌ను లాలాగూడ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వుంది. ఈ ఫైల్‌ను క్లియర్ చేసేందుకు లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు షాహిద్ అలీని లంచం అడిగాడు. చివరగా ఇద్దరి మధ్య ఆరు వేల రూపాయలకు అంగీకారం కుదిరింది. అయితే దీనిపై షాహిద్ అలీ ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై ఎసిబి అధికారులు పక్కా సమాచారంతో రంగంలో దిగి బుధవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో లాలాగూడ టిఎస్ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద కాపుకాశారు. కాగా లంచం సొమ్ము ఆరు వేల రూపాయ లతో షాహిద్ అలీ కార్యాలయంలోకి వెళ్లి దానిని లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు ఇచ్చాడు. ఈ డబ్బులను వెంకటేశ్వర్లు తీసుకుని తన జేబులో పెట్టుకున్న వెంటనే ఎసిబి అధికారులు రెప్పపాటులో దాడిచేసి పట్టుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లు వద్ద నుంచి ఆరు వేల రూపాయల లంచం సొమ్మును జప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. దీని తరువాత నిందితుడి ని నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రెండు వారాల రి మాండు నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా దీని తరువాత ఎసిబి అధికారులు లాలాగూడలోని టిఎస్ఎస్‌పిడిసిఎల్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. దీంతో అక్కడి ఉద్యోగులు హడలిపోయారు. కాగా సర్కారీ విభాగాల్లో ఎవరైనా లంచాలు అడిగితే వెంటనే 1064కు ఫోన్ చేయాలని ఎసిబి డిజి రవి గుప్తా కోరారు.

# 1,520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 26:** తెలంగాణలో మరో భారీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలైంది. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో 1520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులను భర్తీకి వైద్య,ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ బుధవారం సాయంత్రం ప్రకటించింది. ఇప్పటికే 1800లు పైగా నర్సింగ్ సిబ్బంది, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీకి శ్రీకారం చుట్టిన సర్కార్... తాజాగా కుటుంబ,ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ విభాగంలో ఖాళీగా ఉన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.

ఈ పోస్టులకు ఆగస్టు 25 ఉదయం 10.30 గంటల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తారు. ఈ మేరకు నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్‌లో పంచుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో కొలువుల జాతర కొనసాగుతుందని రాసుకొచ్చారు. అర్హులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. జోన్ల వారీగా, రిజర్వేషన్ల వారీగా ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయో జారీ అయిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో ముఖ్య అంశాలు ఇలా ఉన్నాయి. అభ్యర్థులు

**ఆగస్టు 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**అర్హులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి హరీశ్‌రావు సూచన**

తెలంగాణ రాష్ట్ర నర్సెస్,మిడ్‌వైఫ్ కౌన్సిల్ గుర్తింపు పొందిన సంస్థలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(మహిళ)ట్రెనింగ్ కోర్సు పాసై ఉండాలి. లేదంటే ఇంటర్ వొకేషనల్ మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్(ఫిమేల్) ట్రెనింగ్ కోర్సును అభ్యసించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాది పాటు క్లినికల్ ట్రెనింగ్ చేసి ఉండాలి.

అభ్యర్థులు వయసు 2023 జూలై1 నాటికి 18 నుంచి 44 ఏళ్లు మించరాదు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసి సర్టిఫికేట్ ఉన్నవారికి మూడేళ్లు చొప్పున వయో పరిమితి సడలింపు కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన వారికి వేతన స్కేలు నెలకు రూ.31,040-92,050గా నిర్ణయించారు. ఆన్‌లైన్ దరఖాస్తు రుసుం రూ.500, దానికి అదనంగా ప్రాసెసింగ్ ఫీజు రూ.200ల చొప్పున చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ,బీసీ,ఈడబ్ల్యుఎస్,దివ్యాంగులు,ఎక్స్ సర్వీస్‌మెన్‌లతో పాటు 18-44 ఏళ్లు కలిగిన నిరుద్యోగ కేటగిరీ అభ్యర్థులకు ప్రాసెసింగ్ ఫీజు నుంచి మినహాయింపు ఉంది. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌లను ప్రాథమికంగా పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించారు.

# పిఎం కిసాన్‌లో భారీ కుంభకోణం

## 14.28 లక్షల మంది అనర్హులకు రూ.1,754 కోట్ల పంపిణీ

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం నిధుల పంపిణీలో భారీ కుంభకోణం జరిగింది.

ఒక్క మహారాష్ట్రలో 14.28 లక్షల మంది అనర్హులకు 1,754 కోట్ల రూపాయలను పంపిణీ చేసినట్లు కేంద్రం గుర్తించింది. వీరందరికీ వ్యవసాయ భూమి లేకుండానే పిఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు ఉన్నారు. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అనర్హులకు పంపిణీ చేసిన మొత్తం సొమ్మును రికవరీ చేయడం ప్రారంభించింది. అయితే రికవరీ డ్రైవ్ నిర్వహిస్తున్నా కొందరు రాజకీయ నాయకుల నుండి సహాయ సహకారాలు లేకపోవడంతో రికవరీ చేయడంలో ఒకింత జాప్యం జరుగుతోం దని అధికారులు చెబుతున్నారు. రికవరీ నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా ఇప్పటి వరకూ 1.04 లక్షల మంది అనర్హుల వద్ద నుండి 93.21 కోట్ల రూపాయలను రికవరీ చేసింది.

కేంద్ర ప్రభుత్వం 100 శాతం నిధులతో భూమి కలిగి అర్హులైన రైతులకు మూడు సమాన వాయిదాలలో సంవత్సరానికి 6 వేల రూపాయలను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తోంది.

ఈ నేపథ్యంలో కొందరు అధికారులు, అనర్హులతో చేతులు కలిపి ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని పక్కదారి పట్టించారు. అయితే ఈ కేవైసీ విధిగా రైతులు చేయాలనే నిబంధన విధించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.



# సంక్షేమానికి చిరునామా తెలంగాణ

## 43,81,338కి చేరిన పెన్షన్లు

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** సంక్షేమానికి తెలంగాణ చిరునామాగా మారింది. పెన్షన్లను భారీగా పెంచిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే. ఈ మేరకు వీటి వివరాలను బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యంత బలహీన వర్గాలను ఆదుకునేందుకు 2014 నవంబరులో ఆసరా పెన్షన్ పథకాన్ని ప్రారంభించింది. వృద్ధులు, దివ్యాంగులు, ఎయిడ్స్ బాధితులు, నేత, కల్లుగీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు ప్నెన్లను ఇస్తోంది. అలాగే వృధ్యాప్యపు పెన్షన్లకు వయోపరిమితిని 65 నుండి 57 సంవత్సరాలకు తగ్గించడంతో అదనంగా మరో 10 లక్షల మందికి లబ్ధి చేకూరింది. పెన్షన్లకు గాను నెలకు 976.42 కోట్ల రూపాయలను అందిస్తోంది. తెలంగాణ ఏర్పడేనాటికి 28,47,855 మంది లబ్దిదారులు ఉండగా, గత నెలాఖరు నాటికి వీటి సంఖ్య 43,81,338కి పెరిగింది. నెలవారీగా ఇచ్చే పెన్షన్ మొత్తాన్ని కూడా దశల వారీగా పెంచింది. గతంలో వివిధ వర్గాల వారికి పెన్షన్ల కింద 200 రూపాయలు ఇస్తుండగా, తెలంగాణ ఏర్పడిన తదుపరి దాన్ని 2,016 రూపాయలకు, దివ్యాంగులకు 3,016 రూపాయలకు పెంచింది. అలాగే 2014లో పెన్షన్ల కింద నెలకు 67.47 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. నేడు అది 976.42 కోట్లకు పెరిగింది. పెన్షన్ల కింద 2014 నుండి ఇప్పటి వరకూ 58,696.25 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. ఇప్పుడు దివ్యాంగులకు పెంచిన 4,016 రూపాయలతో పెన్షన్ల మొత్తం 11,712.24 కోట్ల రూపాయలకు చేరుతుంది. దివ్యాంగులకు 3,016 రూపాయల నుండి 4,016 రూపాయలు ప్రభుత్వం పెంచింది. రాష్ట్రం ఏర్పడకముందు 3.57 లక్షల మందికి నెలకు 500 రూపాయల చొప్పున 17 కోట్ల రూపాయలు అందగా, స్వయం పాలనలో వాటి సంఖ్య 5,11,656కు పెరిగింది. కర్నాటకలో 1,100, రాజస్థాన్‌లో 750, చత్తీస్‌గడ్, బీహార్‌లో 500, మహారాష్ట్ర, ఎంపిలో 300, యుపి, తమిళనాడులో 1,000, ఏపిలో 3000, మిజోరంలో 100. ఒడిశాలో 200, జార్ఖండ్‌లో 700 ఇస్తుండగా, 4,016 రూపాయలు చొప్పున అత్యధిక పెన్షన్ ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వం వెల్లడించింది.

# గజ్వేల్‌లో మారని ప్రజల బతుకులు

- కెసిఆర్ అక్కడి నుండి వెళ్లిపోతున్నారు
- కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డికి అవకాశం ఇవ్వండి: విహెచ్

**గజ్వేల్, జులై 26, ప్రభాతవార్త:** గజ్వేల్ నియోజకవర్గంలో మారింది రోడ్లు కానీ ప్రజల బతుకులు కాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్మంతరావు విమర్శించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు కాబట్టే గజ్వేల్ నుండి వెళ్ళిపోతున్నారన్నారు. దళితబంధులో 30 శాతం, డబుల్ బెడ్ ఇళ్లలో 20 శాతం బిఆర్ఎస్ నేతలకు కమిషన్ల రూపంలో వెళ్తున్నాయన్నారు. దేశంలోనే నెంబర్-1 అవినీతిపరుడు సిఎం కెసిఆర్ అన్నారు. రాహుల్‌గాంధీ పాదయాత్రతో పేదలు, రైతులకు దగ్గరయ్యారని, తెలంగాణ రాష్ట్రంలో బిసి, మహిళా గర్జన కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోతున్నామన్నారు. ధరణి వచ్చాక పేదల భూములన్నీ కెసిఆర్ లాక్కున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తామన్నారు. బిసిలకు న్యాయం చేయని బిజెపి, తెలంగాణలో బిసి అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వకపోతే మీ పరిస్థితి ఏమిటనేది ఆలోచన చేయాలన్నారు. గజ్వేల్ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డికి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వి.హన్మంతరావు

అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో ముంచడం కాదని ఎవరిని ముంచాలో ప్రజలు నిర్ణయిస్తారన్నారు. అంతకుముందు గజ్వేల్ మండల పరిధిలోని రామచంద్రాపురంలో తూంకుంట నర్సారెడ్డి నిర్వహిస్తున్న గజ్వేల్ ఆత్మగౌరవ యాత్ర 10వ రోజుకు చేరుకోగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కాంగ్రెస్ పార్టీ బిసిసెల్ ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, కొడకండ్ల మాజీ ఎంపిటిసి ఆంజనేయులుయాదవ్, మైనార్టీ నాయకులు వాహెద్, క్యాసారం బాబా, నేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ లైసెన్స్‌తో ప్రమాదకర ఔషధాల విక్రయం

- టిఎస్ నాబ్‌కు పట్టుబడిన ముగ్గురు కేటుగాళ్లు


**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** సర్కారు నుంచి ఎలాంటి లైసెన్స్ లేకుం డానే నకిలీ లైసెన్స్‌తో ప్రమాదకర ఔషధాలను అమ్ముతున్న ముగ్గురు కేటు గాళ్లను తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టిఎస్ నాబ్) అధికారులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి పెద్దఎత్తున నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో వాడాల్సి న ప్రమాదకరమైన ఔషధాలను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టిఎస్ నాబ్ ఎస్‌పి గుమ్మి చక్రవర్తి బుధవారం మీడియాకు వెల్లడించారు. నగరంలోని మ ల్కాజిగిరికి చందిన సుశీల్ కుమార్ మిశ్రా (39), అతని భార్య నేహా చింతామన్‌రావ్ భగవత్ (33)లు ఏఎస్ ఎంటర్ ప్రైజెస్ పేరిట నకిలీ ఔషధ లైసెన్స్ పొంది నిపుణు లైన వైద్యులు వాడాల్సి న ప్రమాదకరమైన ఔషధాలను ఢిల్లీలో తమకు తెలి సిన వ్యక్తి ఉదయ్‌కిరణ్ (33) (ఇతను పాతబస్తీలోని చాంద్రాయణగుట్టకు చెందినవాడు, ఇతను ప్రైవేటు ఫార్మాలో మేనేజర్‌గా వున్నాడు))తో కలిసి ఒకేసారి పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి వాటిని హైదరాబాద్‌లో తమకు తెలిసిన చిన్నపాటి ఆసుపత్రులతో పాటు మాదకద్రవ్యాలకు అలవాటుపడిన ఇంకొందరు వ్యక్తులకు అధిక ధరలకు అమ్మసాగారు. ఈ ప్రమాదకర ఔషధాలు ఇంజక్షన్ల రూపంలో, ట్యాబెట్ల రూపంలో వున్నా యి. ఒక రకంగా చెప్పాలంటే ఈ మందులు మాదకద్రవ్యాల మాదిరిగా పనిచేస్తాయి. మానసిక రోగులకు కాస్త ఉపశమనం కలిగించేందుకు, లేదా ఆపరేషన్ల సందర్భంగా, తీవ్రంగా గాయాలపాలైన వారికి వైద్య సేవల సందర్భంగా ఈ మందులను మోతాదు ప్రకారం వాడుతుంటారు. నిపుణులైన వైద్యుల సిఫార్సు లేదా వారి పర్యవేక్షణ లేకుండా ఎవరు పడితే వారు వాడితే ప్రాణాలకు ప్రమాదం వుంటుంది. అయితే సుశీల్‌కుమార్ దంపతులు, ఉదయ్ కిరణ్‌లు కలిసి వీటిని రైతుబజార్‌లో కూరగాయల మాదిరిగా అమ్మసాగారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న టిఎస్ నాబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందం బుధవారం ఉదయం మలా ్కజిగిరి పోలీసులతో కలిసి దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేసింది. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి ఇంజక్షన్ల రూపంలో వున్న 10 ఎంఎల్ 225 ఫెంటానిల్ సిట్రేట్ మం దు, 2 ఎంఎల్ ఫెంటానిల్ ఇం క్షన్లు 3040, 1 ఎంఎల్ మోర్ఫిన్ సల్ఫేట్ ఇంజక్షన్లు 530, మూడు వేల మోర్ఫిన్ ట్యాబ్లెట్లు (30 ఎంజి), 10 ఎంజి మిడాజోలం 40 ఇంజక్షన్లు, కోడిన్ ఫాస్ఫేట్ ట్యాబ్లెట్లు 20 పట్టుబడ్డాయి. పట్టుబడ్డ నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. కాగా ఈ తరహా ప్రమాదకర ఔషధా ల విషయంలో యువ కులు జాగ్రత్తగా వుండాలని ఎస్‌పి గుమ్మి చక్రవర్తి కోరారు. వీటికి సంబం ధించిన సమాచారం వుంటే పోలీసులకు లేదా టిఎస్‌నాబ్ నంబర్ 8712661111కు తెలపాలని ఆయన కోరారు.

# పలివెల వద్ద నూతన బ్రిడ్జి నిర్మించాలి : ఎమ్మెల్సీ ఐ.వి



**కొత్తపేట, జులై 26, (ప్రభాతవార్త):** అమలాపురం-బొబ్బర్లంక రోడ్డులో కొత్తపేట మండలం పలివెల వద్ద నూతన బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐ.వి) కోరారు. ఈ మేరకు బుధవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు ఎమ్మెల్సీ లేఖ రాసారు. ప్రధాన పంట కాలువపై ఎన్నో ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ జెడ్ బ్రిడ్జి చాలా ఇరుకుగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ వంతెనపై నిత్యం వందలాది భారీ వాహనాలు, ఓఎన్జీసీ వాహనాలు, ఇసుక, ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలు తిరుగుతూ ఉంటాయన్నారు. ఈ వంతెన అమలాపురం, రాజమండ్రి రెవిన్యూ డివిజన్లకు ప్రధాన అనుసంధానంగా ఉందన్నారు. సుమారు రూ.4 కోట్ల అంచనా విలువైన ఈ బ్రిడ్జిని వంకరలు లేకుండా అలైన్మెంట్ మార్చి నూతన బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

# ఆర్టీసీ బస్సు కారు ఢీ: కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో తప్పిన ఘోర ప్రమాదం



**అంబాజీపేట, జులై 26, (ప్రభాతవార్త):** మండలంలోని వక్కలంక వంతెన వద్ద ప్రధాన రహదారిపై బుధవారం ఓ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన కారు పక్కనే ఉన్న పాన్ షాప్‌లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం నుండి మండపేట వెళుతున్న కారు, విజయవాడ నుండి అమలాపురం వైపు వస్తున్న ఆర్టీసీ బస్‌ను ఎదురుగా ఢీ కొనడంతో పక్కనే ఉన్న పాన్ షాప్లోకి కారు దూసుకెళ్లింది. కారు ముందు బాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి, పాన్ షాపు వద్ద ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# గృహహింస కేసులో రెండు సంవత్సరాలు జైలు శిక్ష



**గోకవరం, జులై 26, (ప్రభాతవార్త):** గోకవరం గ్రామంలో డ్రైవర్ కాలనీలో ఉంటున్న అన్నిక రాజ్యలక్ష్మి 2018 సంవత్సరంలో తన భర్త శివరామకృష్ణ తనను వేధిస్తున్నాడని గోకవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది సంబంధిత ఫిర్యాదుపై గోకవరం ఎస్సై గృహహింస మరియు ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయగా అప్పటి డిఎస్పి హుస్సేన్ శివరామకృష్ణను అరెస్ట్ చేసి ఎస్సీ ఎస్టీ కోర్ట్ నందు చార్జిషీటు దాఖలు చేశారు. తదుపరి ఈ కేసు ఎస్సీ ఎస్టీ కోర్టు నందు వాయిదాలు జరిగి ముద్దాయి శివరామకృష్ణ కు రెండు సంవత్సరాలు జైలు శిక్ష 1000 రూపాయలు జరినామా జడ్జి ఎం నాగేశ్వరరావు శిక్ష వెయ్యడం జరిగిందని ఎస్సై శివ నాగబాబు తెలియజేశారు.

# జిల్లాలో కొవ్వూరు నియోజక వర్గంలో తొలి సమీక్ష

(5వ పేజీ తరువాయి)

వ్యవస్థను ఏర్పాటు గ్రామాల్లోనికే తీసుకు వెళ్లేందుకు సచివాలయ వ్యవస్థ తీసుకుని రావడం జరిగిందన్నారు. ఆ ప్రక్రియను మరింత ముందుకు తీసుకుని వెళ్ళే క్రమంలో రైతుకు భరోసా కల్పించేందుకు ఆర్బీకేలు, ప్రజారోగ్య పరిరక్షణకు వై ఎస్ ఆర్ హెల్త్ సెంటర్స్ నిర్మించడం జరుగుతోందన్నారు. ప్రజా సంక్షేమం కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఇటువంటి సహాసోపేతమైన నిర్ణయం తీసుకుని దేశ వ్యాప్తంగా ప్రశంసంలు పొందారని అన్నారు. ప్రభుత్వం ఒక మంచి ఉద్దేశ్యంతో ప్రాధాన్యత భవనాలు నిర్మాణాలు చెస్తున్న దృష్ట్యా సామాజిక బాధ్యతతో కాంట్రాక్టర్లు గ్రామ ప్రజల అవసరాలు తీర్చేందుకు సేవా దృక్పధంతో ముందుకు రావాలాన్నారు. ప్రజా ప్రయోజనాలు దృష్ట్యా సెప్టెంబర్ 15వ తేది నాటికి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. వ్యవస్థ పరమైన మార్పులో ప్రజలకు చేరువ చేసే భవన నిర్మాణల పురోగతిని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో రాజానగరం నియోజజవర్గంలో ప్రాధాన్యతా భవన నిర్మాణాలు అన్ని పూర్తయ్యాని, అదే రీతిలో జిల్లాలో అన్ని భవనాలు పూర్తి చెయ్యాలని మంత్రి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశలో ఆయా నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు ద్వారా మరింత బాధ్యత తో పనులు పురోగతి సాధించడానికి ముఖ్యమంత్రి నియోజక స్థాయి సమీక్ష చేపట్టాలనే నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర హోం మంత్రి డా.తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రాధాన్యత భవనాలు, ఇతర పనులకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పూర్తి చేసిన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఆ మేరకు పరిపాలన పరమైన ఆమోదం ఇవ్వడం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద గుర్తించిన పనులు త్వరితగతిన పూర్తి చెయ్యాలని ఆదేశించారు. విద్యుత్ శాఖధికారులు నియోజకవర్గంలో పూర్తయినా జగనన్న కాలానీల్లో అన్ని గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని పెంచడం జరిగిందని, అసుపత్రిలో మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తాన్నారు. నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజాశ్రేయస్సు కొరకు సమసవేశంలో ప్రతిపాదించిన అన్ని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని మంత్రి తానేటి వనిత అన్నారు. విద్యుత్ ఆదునీకరణలో భాగంగా పరిష్కసరం కొరకు వచ్చిన విజ్ఞప్తులపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి 5 కోట్ల 17 లక్షలతో ఉచితంగా సేవాలాందిచడం అభినందనీయమన్నారు. కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ట్రైన్స్ ఆగేందుకు కేంద్రానికి సిఫార్స్ చేయడం జరిగిందని త్వరలో సత్ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ డా.కే.మాధవీలత మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతి నియోజకవర్గంలో జిల్లా ఇంచార్జి మంత్రి, స్థానిక మంత్రి ఆధ్వర్యంలో జిల్లా, మండలం స్థాయి అధికారులు నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పథకాల పురోగతిపై చర్చించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమేరకు సమస్యలను పరిష్కారం చేసి, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఇప్పటికే సచివాలయం వ్యవస్థ ప్రభుత్వ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు.

పూర్తయిన వైఎస్ఆర్ హెల్త్ సెంటర్ ద్వారా గ్రామాల్లో వైద్య సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను చేకూర్చుతున్నామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, తదితర పనులకు కేటాయించిన సీమ్మెంట్ తీసుకొని ఇతర పనులకు వాడుకొని చేపట్టిన నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగు తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు జె.సి. తేజ్ భరత్, మున్సిపల్, అడిషినల్ ఎస్.పి, రజని, కొవ్వూరు ఆర్డీఓ, ఎస్. మల్లిబాబు చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మునిసిపల్ వైస్ ఛైర్ పర్సన్, గంద్రోతు అంజలీ దేవి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివ రామకృ ష్ణ, ముని సిపల్ వైస్ ఛైర్ పర్సన్, పోసిన శ్రీలేఖ,యం. పి. పి.లు కాకర్ల నారాయణుడు మట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసుబాబు, జె. పి. టి. సి. లు, బొంతా వెంకట లక్ష్మి, డిసిహెచ్ఓ డా. ఎమ్. సనత్ కుమారి, సీపీఓ, ఎస్. ముఖలింగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఎస్.మాధవరావు, డిహెచ్ఓ, హౌసింగ్ డి. హెచ్. ఓ, పరశు రామ్, డియంహెచ్ఓ డా. కె.వెంకటేశ్వరరావు, ఉద్యాన వన శాఖ వి.రాధా కృష్ణ, పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్ జీ టి సత్య గోవింద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కె. విజయ కుమారి,డి ఈఓ, ఎస్. అబ్రహం, ఎస్.ఈ. పి. ఆర్, ఎ బి వి ప్రసాద్, ఎస్ ఈ ఆర్ డబ్ల్యు ఎస్ డి. బాల శంకర రావు, డి ఎల్ డివో వి.శాంతమణి, డిఆర్డీఏ పిడి,ఎస్. సుభాషిణి, కౌన్సిలర్లు, పలువురు జిల్లా శాఖా అధికారులు నియోజకవర్గ ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాదాలకుంటకు ఎమ్మెల్యే వరాల జల్లు



**గోపాలపురం, జులై 26, (ప్రభాతవార్త):** గోపాలపురం మండలంలోని వాదాలకుంట గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆ పంచాయితీకి వరాల జల్లు కురిపించారు. ఆధ్యాంతం ఎంతో ఆనందంగా సాగిన ఈ కార్యక్రమానికి ఆ గ్రామ సర్పంచ్ జొన్నకూటి మణమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాదాలకుంట పంచాయితీ రూ.37 లక్షలు జలజీవన్ మిషన్ నిదులు మంజూరైయ్యాయని, వాటి ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరా చెయ్యడం జరుగుతుందన్నారు. అయితే గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని అర్హులైన వారు ఇంకా ఉన్నారని, వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మహిళలు కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే ఊరికి దగ్గర్లో వున్న ఎకరం నుంచి రెండెకరాల భూమి కొనుగోలు చెయ్యాలని ఇదివరకే స్థానిక నాయకులకు చెప్పానని, ఇప్పుడైన స్థలం చూస్తే కలెక్టరుతో మాట్లాడి కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారు. భూమి కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఇచ్చే రేటుకు అధనంగా అయ్యే ఖర్చును సీనియర్ నాయకులు గద్దె ఈశ్వరుడు చెల్లిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. దీనితో సభలోని వారంత ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా డ్రైనేజుల నిర్మాణానికి వాదాలకుంటకు రూ.20 లక్షలు, వెదుళ్ళకుంటకు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. యువనాయకుడు జొన్నకూటి మోహన్ మాట్లాడుతూ.. తమ పంచాయితీలో చాలా మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా డబ్బులు ఇంకా జమ కాలేదని, దానికి గోపాలపురం బరోడా బ్యాంకు వారు ఇబ్బంది పెడ్తుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగ, స్పందించిన ఎమ్మెల్యే బ్యాంకు మేనేజరుకు ఫోన్ చేసి వివరాలు అడిగారు. ఈరోజు, రేపటిలోగా డబ్బులు జమ చేసేస్తామని బ్యాంకు అధికారులు బదులిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా సురక్షలో మంజూరైనా ధృవీకరణ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారయణ, జడ్పీటీసీ సభ్యురాలు కే.లలిత, స్పెషల్ ఆఫీసర్ సత్యగోవింద్, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, నాయకులు పోతిరెడ్డి నాగరాజు, ఎస్కె ఖాదర్ వలి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మల్లేపల్లి ఉపాధి హామీ మస్తర్లలో మాయాజాలం

## - తప్పులను ఒప్పుకున్న మేట్లు -ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్న ఏపీవో

**గండేపల్లి, జులై 26, (ప్రభాతవార్త):** జాబ్ కార్డు ఒకరిది..పని చేసింది మరొకరు.. డబ్బులు తీసుకుంది వేరొకరు..జూమ్ మంత్రకాళీ అంటూ మేట్ల మాయాజాలంతో పనికి వెళ్ళని వారి పేరున, గ్రామాంతరం వెళ్ళిన వారి పేరున మస్తర్లు వేసి అవినీతికి పాల్పడి దోచేస్తున్నారని ప్రధానంగా అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లనే అక్రమార్కుల దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తవ్వే కొద్ది అవినీతి బట్టబయలు అవుతుందనేందుకు నిదర్శనం గండేపల్లి మండలం మల్లేపల్లి పాతూరు గ్రామానికి చెందిన నడిశెట్టి రాంబాబు స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేసి తమ ప్రాంతంలో నలుగురు మేట్లు ఆధ్వర్యంలో ఉపాధి అవినీతి జరిగిందని విచారణ జరపాలంటూ ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం మల్లేపల్లి పాతూరు శివాలయం వద్ద ఏపీవో గంగాభవాని, ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. నలుగురు మేట్లు పరిధిలోని జాబ్ కార్డులు, స్థానికంగా ఉంటున్నారా, లేదా, ఎన్ని మస్తర్లు రోజుకు ఎన్ని మస్తర్లు నమోదయ్యాయి. అనే వాటిపై విచారణ నిర్వహించారు. దీనిపై మేట్లు కొందరు స్థానికంగా ఉండటం లేదని, ఒకరి జాబు కార్డు పై మరొకరు పనిలోనికి వస్తున్నారని, కొంత మంది వేరే ప్రాంతంలో పని చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయమై



ఏపీవో మాట్లాడుతూ నలుగురు మేట్లు వద్ద ఉపాధి కూలీల వద్ద లిఖితపూర్వకంగా స్టేట్మెంట్లు తీసుకోవడం జరిగిందని వీటిని అన్నిటిని ఉన్నతాధికారుల వద్ద ఉంచి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై గ్రామంలో తక్షణం ఆడిట్ నిర్వహించి జరిగిన అవినీతిని బట్టబయలు చేయాలని, అవినీతికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలంటూ రాంబాబు పట్టు పట్టారు.ఎపివో స్పందిస్తూ ప్రతీ ఏడాది ఆడిట్ జరుగుతుందని ప్రస్తుతం మేట్లు, కూలీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా వారు చేసిన తప్పులను ఒప్పుకున్న వాటిని పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు.అనంతరం అక్కడ వెళుతున్న సమయంలో ఇరువర్గాలకు మాటామాటా పెరిగి బాహాబాహీకి దిగడంతో ఈసి రమేష్ ఇరువర్గాలను వారించి అక్కడ నుండి పంపించారు.

# పలు దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

## - కొత్తపేటలో రూ.3.15 లక్షల విలువైన పప్పు ధాన్యాలు సీజ్



**కొత్తపేట, జులై 26, (ప్రభాతవార్త):** కొత్తపేట, పి.గన్నవరం మండలాల్లో బుధవారం విజిలెన్స్, సివిల్ సప్లయిస్, లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం పలు కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ రాజమహేంద్రవరం రీజనల్ ఇన్చార్జి అధికారి కె.కుమార్ ఆధ్వర్యంలో పప్పు ధాన్యాలు నిల్వలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోలో విధించిన స్టాక్ పరిమితుల నేపథ్యంలో హోల్ సేల్, రిటైల్ షాపులను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కొత్తపేట మండలం గంటి శ్రీ రాఘవేంద్ర దాల్ అండ్ ఫ్లోర్ మిల్లు దుకాణంలో స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్స్ నిర్వహించడం లేదని, స్టాక్ వివరాలను ప్రభుత్వ వెబ్సైట్లో నమోదు చేయడం లేదని, ఎఫ్.ఏ.ఎస్.ఎస్.ఐ లైసెన్స్ లేదని గుర్తించారు. దీంతో సదరు షాపు యజమానిపై కొత్తపేట సివిల్ సప్లయిస్ అధికారులు 6 ఏ కేసు నమోదు చేసి రూ. 3,15,000 విలువైన పప్పు ధాన్యాలను సీజ్ చేసారు. అలాగే 25 కేజీల మినపప్పు ప్యాకెట్ పై మేండిటరీ డిక్లరేషన్ లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి కుమార్ మాట్లాడుతూ హోల్ సేల్, రిటైల్ కిరాణా షాపుల యజమానులు ప్రభుత్వం నిర్ధేశించిన స్టాక్ పరిమితులకు మించి పప్పు ధాన్యాలను అక్రమంగా నిల్వ చేసినా, గరిష్ట అమ్మకపు ధర కన్నా ఎక్కువ ధరకు అమ్మకాలు చేసినా సదరు దుకాణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పి.గన్నవరంలో తనిఖీలు.. కేసుల నమోదు**

ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి కుమార్ మాట్లాడుతూ పి.గన్నవరం శ్రీ లక్ష్మి వేంకటేశ్వర కిరాణా అండ్ జనరల్ స్టోర్ లో 500 గ్రాముల జీడిపప్పు ప్యాకెట్ పై, వేమన సత్యనారాయణ రైస్ అండ్ జనరల్ స్టోర్ లో 25 కేజీల రైస్ ప్యాకెట్‌పై, శ్రీ అచ్యుత రామయ్య కిరాణా, ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్‌లో 250 గ్రాముల నెయ్యి ప్యాకెట్లపై, శ్రీ వెంకటలక్ష్మి నాగేశ్వర ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్ లో 450 గ్రాముల చాక్లెట్ ప్యాకెట్ల పై మేండిటరీ డిక్లరేషన్లు లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేసారని చెప్పారు.

# విద్యా సంవత్సరం విధి విధానాలపై ఉపాధ్యాయులకు శిక్షణ



**గండేపల్లి, జులై 26, (ప్రభాతవార్త):** గండేపల్లి మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు 25, 26 తేదీలలో విజయవంతంగా ముగిసినట్లు మండల విద్యాశాఖాధికారి కే.హెచ్.నాయక్ తెలిపారు. మండలంలోని ఒకటి నుండి ఐదు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు అందరూ ఈ శిక్షణకు హాజరయ్యాన్నారు. ఆగస్టు మొదటి వారంలో జరగబోయే ఫార్మేటివ్ వన్ అసెస్మెంట్ సంబంధించి సూచనలు ఇవ్వడం జరిగిందని ఈ విద్యా సంవత్సరం పాఠశాల నందు అమలు చేయవలసిన కార్యక్రమాలను అన్నిటిని విజయవంతంగా ప్రధానోపాధ్యాయులకు తెలియజేయడం జరిగిందని తెలిపారు.

# బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ రాష్ట్ర జట్టుకు 'చరిష్మసాయి రుత్వి'



**అంబాజీపేట, జులై 26, (ప్రభాతవార్త):** అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదుతున్న నిమ్మకాయల చరిష్మ సాయి రుత్వి రాష్ట్ర బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాయి రామ్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో క్రీడాకారిణి చరిష్మసాయి రుత్విని బుధవారం అభినందించారు. ఈ నెల 21 నుండి 23 వరకు రామచంద్రాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అంతర్ జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన చరిష్మ పాండిచ్చేరిలో జరిగే రాష్ట్ర జట్టుకు ఎంపికైందని పాఠశాల పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన చరిష్మకు బి.ఎఫ్.ఐ. జాయింట్ సెక్రటరీ జి.చక్రవర్తి, రాష్ట్ర బాస్కెట్ బాల్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ నడింపల్లి అప్పలరాజులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్పర్సన్ అరిగెల రామ తులసి, ఆశ్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబు, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, వి.సత్యనారాయణ, ఎం.ఎల్.గాయత్రి, ఎ. శ్రీనివాసరావు, ఎ.రామలింగేశ్వరరావు, అంజిబాబు, ఫణిలు చరిష్మసాయి రుత్వితో పాటు, పీడీ ఆదిలక్ష్మిని అభినందించారు.

Print and Published Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajahmahendravaram - 533 103, Phone : 2469407, 2469408, RNI No. 64863/96, Editor: Damerla Sai Baba, Responsible for election of News-under the PRB Act. Regd.No. H/SD/337/90-11 Air Surcharge : Delhi : 40Ps

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

గురువారం జులై 27 2023



# పంచాయితీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్




**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బ్యూరో, జులై 26, (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌ను జిల్లా కలెక్టర్ డా కే.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్‌లు బుధవారం ఉదయం స్థానిక ప్రవేటు వసతి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో సమీక్ష చెయ్యడానికి జిల్లాకు ఆయన రావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ప్రాధాన్యత భవనాల నిర్మాణం, అదనపు నిధుల కేటాయింపు తదితర అంశాలపై కలెక్టర్ మాధవీలత వివరించడం జరిగింది.

# జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వనిత



**చాగల్లు, జులై 26, (ప్రభాతవార్త):** ప్రతి గ్రామంలోనూ ప్రతి ఒక్కరికి పథకాలు అందుతున్నాయని చిన్న చిన్న కారణాల వలన సాంకేతిక లోపం వలన పథకాలపై పూర్తి అవగాహన లేకపోవడం వలన లబ్ధి చేకూరాలని పక్షంలో ఈ సురక్ష కార్యక్రమం ద్వారా ఆయా వ్యక్తులకు లబ్ధి చేకూరుతుందని హోం శాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామంలో బుధవారం నాడు ఏర్పాటు చేసిన సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి వనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి నూరు శాతం పథకాలు అందించాలని లక్ష్యంతో మన ముఖ్యమంత్రి జగనన్న కృషి చేస్తున్నారని ఇప్పటికే రాష్ట్రంలో 99 శాతం మంది అర్హులకు పథకాలు అందుతున్నాయని మిగిలిన ఒక్క శాతం అర్హులకు కూడా ఈ జగనన్న సురక్ష పథకం ద్వారా అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 ఉచిత సేవలకు సంబంధించిన 2050 యొక్క ధ్రువపత్రాలను లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు.. గత ప్రభుత్వాలు కేవలం మాటలకే పరిమితమైనయని కానీ మన జగనన్న ప్రభుత్వం జగనన్న ముఖ్య మంత్రి చేయాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు సచివాలయం సిబ్బంది వైసీపీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు న్యాయం చేయకపోతే మళ్లీ ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటా : ఎమ్మెల్యే గొల్లపల్లి



**యానం, జులై 26, (ప్రభాతవార్త):** యానం నియోజకవర్గం యానాంలోని అర్హులైన అందరి మత్స్యకారులకు పరిహారం అందాలి...పరిహారం ఆపాలని మాజీ మంత్రి మల్లాడి ఎత్తుగడలను చిత్తు చేయాలి...మత్స్యకారుల పరిహారం మొత్తం సొమ్ము...ఏ స్వచ్ఛంద సంస్థకో దారిమళ్లకూడదనే పోరాటం.. ఒఎన్‌జిసి పరిహారం కోసం గతంలో ఆమరణ నిరాహారదీక్ష చేసాను. ఆరేళ్ల ఆలస్యం తర్వాత నా హయాంలో 2021లో పరిహారం అందింది. మళ్లీ అంది తీరుతుంది. 6 నెలల నుంచి పరిహారం పంపిణీ కోసం పుదుచ్చేరిలో అధికారులు చుట్టూ తిరుగుతుంటే నాపై నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలు ఎలా నమ్ముతారు? స్పష్టం చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ యానాం నియోజకవర్గ పరిధిలో చేపలవేటనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న వారికి ఒఎన్‌జీసి సంస్థ అందించే నష్టపరిహారం సొమ్ము అర్హులైన చేపల వేటను నమ్ముకుని జీవిస్తున్న పేద మత్స్యకారులకు అందరికి అందాలని ఆవిధంగా న్యాయం జరగాలని దానికి మళ్లీ ఏ పోరాటానికైనా ఆఖరుకి ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్దమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ లబ్దిదారుల జాబితాను మత్స్యశాఖ విడుదల చేసిందని అయితే దానిలో చాలామంది అర్హులైనవారి పేర్లు గల్లంతయ్యాయని అనేక మంది ఆవేదన చెందుతున్నారని దీంతో తాను ఆ సమస్యపై ఆర్ఎఒ మునిస్వామితో సమావేశమయినట్లు తెలిపారు. తాను రిజిష్టర్ బోట్లతో పాటు అన్ రిజిష్టర్ బోట్లును సైతం ఎట్టి పరిస్థితుల్లోను పరిగణనలోనికి తీసుకుని లబ్దిదారుల జాబితాను తయారు చేయాలని గతంలోనే తీర్మా (మిగతా 6వ పేజీలో)

## యానాం మద్యం సీసాలపై ఏపి ఫేక్ లేబుళ్లు అతికిస్తున్న ముఠా

### - ముగ్గురు అరెస్టు- ఒక కంప్యూటర్, స్కానర్, ప్రింటర్, ఫేక్ లేబుళ్లు స్వాధీనం



**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట, జులై 26, (ప్రభాతవార్త):** యానాం నుంచి తెచ్చిన మద్యం సీసాలపై ఆంధ్రప్రదేశ్ మద్యానికి సంబంధించిన లేబుల్ నమూనాలో ముద్రించిన ఫేక్ లేబుళ్లు అతికించి విక్రయాలు చేస్తున్న వ్యక్తులను కొత్తపేట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్.ఈ.బి), డి.టి.ఎఫ్ పోలీసులు అరెస్టు చేసారు. కొత్తపేట ఎస్.ఈ.బి స్టేషన్ వద్ద బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా వివరాలు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా ఆదేశాల మేరకు గతంలో కొత్తపేట ఎస్.ఈ.బి స్టేషన్ పరిధిలో ఎస్.ఈ.బి సి.ఐ మద్దాల శ్రీనివాస్, డి.టి.ఎఫ్ సి.ఐ కె.వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించి పెనుగొండ మండలం చిన మల్లం గ్రామానికి చెందిన గుడాల చంద్రశేఖర్ స్వామి అనే వ్యక్తికి చెందిన ఒక కారు, 500 యానాం మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు తదుపరి విచారణలో భాగంగా బుధవారం గుడాల చంద్రశేఖర్ స్వామిని అరెస్టు చేసి విచారించారు. దాని ఆధారంగా అతనికి ఫేక్ లేబుళ్లు అందజేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు చెందిన పీతల భగత్ సింగ్, ఫేక్ లేబుళ్లు ముద్రిస్తున్న అదే గ్రామానికి చెందిన రుద్ర డిజిటల్ యజమాని పొలనాటి సాయిని అరెస్ట్ చేసారు. అలాగే వారి వద్ద నుంచి 270 ఫేక్ లేబుళ్లు, ప్రింటింగ్‌కి ఉపయోగిస్తున్న కంప్యూటర్, స్కానర్, కలర్ ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే పీ.డి యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ ఫేక్ లేబుళ్ల కేసులో నిందితులను పట్టుకున్న కొత్తపేట ఎస్.ఈ.బి. సి.ఐ మద్దాల శ్రీనివాస్, డి. టి.ఎఫ్ సి.ఐ కె.వీరబాబు, సిబ్బందిని అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా అభినందించారు.

# పేదల వికాసం, అభివృద్ధే బీజేపీ లక్ష్యం

### - కేంద్రం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళిస్తోంది : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి





**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో, జులై 26, (ప్రభాతవార్త):** దేశంలో పేదల వికాసం, అభివృద్ధే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందని, ఏపీ రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో ఒక రోజు పర్యటన నిమిత్తం బుధవారం వచ్చిన ఆమె స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం 22 లక్షల ఇళ్లు ఇచ్చిందని, రాజమహేంద్రవరంనకు లక్షా 86 వేల ఇళ్ళు కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం ఎన్ని పూర్తి చేసిందో చెప్పాలని పురందేశ్వరి డిమాండ్ చేసారు. వైసీపీ పాలనలో మట్టి, ఇసుక మాఫియా చెలరేగిపోతోందని, చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితికి తీసుకువచ్చారని ఆరోపించారు. ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఇళ్ళ స్థలాల పేరిట ఆవ భూముల కొనుగోళ్ళలో వైసీపీ నాయకులు పెద్ద మొత్తంలో దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో రైతుల బాధలు వర్ణనాతీతమన్నారు. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు ఏర్పాటు చేస్తామన్న మూడువేల కోట్ల ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసారా? అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని, పునరావాస ప్యాకేజీ విషయంలో వైసీపీ ప్రభుత్వం సరైన గణాంకాలు కేంద్రానికి ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీతో పొత్తు కొనసాగుతుందని, మిగతా పార్టీలతో పొత్తులపై బీజేపీ అధిష్ఠానం చూసుకుంటుందని పురందేశ్వరి తెలిపారు. దొంగ ఓట్లతో వైసీపీ మరోసారి ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చూస్తోందని, రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిర్ణయంతో వైసీపీ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయ్యిందని పురందేశ్వరి అన్నారు.

**ఆగష్టు 10న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన :**

గ్రామ స్వపరిపాలనను అటకెక్కించేలా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయితీలను నిర్వీర్యం చేస్తోందని పురందేశ్వరి అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్లించడంపై పార్టీలకతీతంగా గ్రామ సర్పంచులు తమ మద్దతు కోరారని, వారికి బిజెపి పూర్తి అండగా ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని ఆగస్టు 10న జిల్లాలో గ్రామ సర్పంచిలకు మద్దతుగా ధర్నా, 17న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజా సమస్యలపై బహిరంగ సభ జరుగుతుందని పురందేశ్వరి తెలిపారు. బొక్కరోజ పర్యటనకు రాజ్యమహేంద్రవరం విచ్చేసిన పురందేశ్వరికి కొంతమూరు వద్ద గామన్ బ్రిడ్జిపై రాజమహేంద్రవరం రూరల్ ఇన్చార్జి ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అక్కడనుండి ర్యాలీగా క్వారీ మార్కెట్లోని బిజెపి కార్యాలనికి తోడ్కోని వచ్చారు.

## తీరప్రాంత ప్రజల శ్రేయస్సుకు మడ అడవులు దోహదం

### - జిల్లా శాఖ అధికారిని భరణి




**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బ్యూరో, జులై 26, (ప్రభాతవార్త):** మడ అడవులు తీర ప్రాంత ప్రజల శ్రేయస్సుకు, ఆహార భద్రత రక్షణ కొరకు దోహదపడతాయని జిల్లా అటవీ శాఖ అధికారిని ఎస్ భరణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాడ అడవుల పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని కాకినాడలో గల వి ఎస్ లక్ష్మి మహిళా కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారిని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మడ అడవులు సునామీలు తుఫాన్లు కోత మరియు పెరుగుతున్న సముద్రమట్టాలకు వ్యతిరేకంగా పనిచేస్తాయని ఇవి సముద్రం మరియు భూమి మధ్య సరిహద్దులుగా నిలుస్తాయని అనేక తీరప్రాంత వర్గాలకు రక్షణ కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. మడ పర్యావరణ వ్యవస్థ యొక్క నేలలు కార్బన్ సింకులుగా పనిచేస్తాయని, భూమి ఆధారిత అడవులతో పోలిస్తే పది శాతం ఎక్కువ కార్బన్ నిల్వ చేయగలవని పేర్కొన్నారు. మడ అడవులు వివిధ రకాల చేపలు పక్షులు మరియు ఇతర జంతువులకు నిలయంగా నిలుస్తాయని మడ చెట్లు వేర్లు మరియు కొమ్మలు జంతువులకు ఆహారం మరియు ఆశ్రయినందిస్తాయని అనేక జాతులు చేపలకు నర్సరీలుగా కూడా పనిచేస్తున్నాయన్నారు. రేంజర్ వరప్రసాద్ మాట్లాడుతూ మడ అడవులు కాలుష్య కారకాలు మరియు అవక్షేపాలను ఫిల్టర్ చేయడం ద్వారా నీటిని శుద్ధి చేయడానికి సహాయ పడతాయి అన్నారు గణనీయమైన పర్యావరణ ప్రాముఖ్యతను మడ అడవులు కలిగి ఉన్నాయని వివిధ జీవులకు రక్షత నర్సరీలుగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు అనంతరం కళాశాల సిబ్బంది జిల్లా అటవీ శాఖ అధికారిని ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్య అధ్యపక సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో కొవ్వూరు నియోజక వర్గంలో తొలి సమీక్ష

### ఇంఛార్జి మంత్రి శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ, హోం మంత్రి వనితలు



**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బ్యూరో, జులై 26, (ప్రభాతవార్త):** నియోజక వర్గ స్థాయి సమీక్ష ద్వారా సమస్యల పరిష్కారానికి, ప్రజల ఆకాంక్ష మేరకే ఫలితాలు ప్రతిబింభించడం సాధ్యం అవుతుందని జిల్లా ఇంఛార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినీమాటోగ్రాఫ్ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ, హోం మంత్రి తానేటి వనితలు పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లాలో తొలి నియోజక వర్గ స్థాయి సమీక్షకు కొవ్వూరు నియోజకవర్గం వేదిక కావడం జరిగిందన్నారు. బుధవారం మధ్యాహ్నం కొవ్వూరు నియోజక వర్గ స్థాయి సమీక్ష సమావేశం స్థానిక ప్రయివేట్ సమావేశం మందిరంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా ఇంఛార్జి మంత్రి సిహెచ్. శ్రీనివాస్ వేణుగోపాల్ కృష్ణ, స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర హోం మంత్రి డా.తానేటి వనిత, జిల్లా కలెక్టర్ మాధవీలత, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా, డివిజన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా ప్రాధాన్యత భవనాలు, విద్య, హౌసింగ్, ఎన్ పి ఐ, టిడ్కో, వ్యవసాయ, హర్టి కల్చర్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, ఆర్ డబ్ల్యు ఎస్,హౌర సరఫరాలకు చెందిన 11 అంశాల మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి మంత్రి సిహెచ్. శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ, పరిపాలన సంస్కరణల్లో భాగంగా పాలనా వికేంద్రీకరణ (మిగతా 8వ పేజీలో)

## అర్హులందరికీ జగనన్న సురక్ష ద్వారా సంక్షేమ పథకాలు అందించడానికి అవసరమైన ధ్రువపత్రాలు పంపిణీ

### - పథకాలు అందించేందుకు అవసరమైన ధ్రువపత్రాలు పంపిణీ - రాష్ట్ర ప్రభుత్వ విప్, పియుసి చైర్మన్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



**ఆత్రేయపురం, జులై 26 (ప్రభాతవార్త):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా మండల కేంద్రమైన ఆత్రేయపురం అల్లూరి సీతారామ రాజు సెంటర్లో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్ర మంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, పియుసి చైర్మన్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. అర్హులైన ఏ ఒక్కరు సంక్షేమ పథకాలు లబ్ధి పొందడానికి ఆటంకం కలగకూడదన్న ఉద్దేశ్యంతో నెల రోజులు పాటు సంక్షేమ క్యాలెండర్ ప్రకారం ధ్రువపత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో జనన, మరణ, కుల, ఆదాయ, వివాహ, రేషన్ కార్డు, తదితర 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా అందించడం జరిగిందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 1,13,000 ధ్రువ పత్రాలు అందించడం జరిగిందన్నారు. ఆత్రేయపురం గ్రామానికి సంబంధించి 3782 ధ్రువపత్రాలను ఏ విధమైన తారతమ్యాలు లేకుండా అందించినట్లు తెలిపారు. తొలుత ఎమ్మెల్యే చిలుకూరి బాబిరాజు ప్రజా ప్రతినిధులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆత్రేయపురంలో జరిగిన సభకు గ్రామ సర్పంచ్ గద్దం సుధా అధ్యక్షత వహించారు. కార్యక్రమాలలో జడ్పిటిసి సభ్యులు బోనం సాయి బాబు, వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కప్పల శ్రీధర్, రైతు అభివృద్ధి సలహా కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీను రాజు, చిలువూరు బాబిరాజు, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసిల్దార్ డివిజన్ అనిల్ కుమార్, డాక్టర్ సుష్మిత, ఎంపీటీసీ సభ్యురాలు సరెళ్ల ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మానవుడే మహనీయుడు



**ముమ్మిడివరం, జులై 26, (ప్రభాతవార్త):** యువతలో శాస్త్రీయ అభ్యుదయ భావాలు పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మానవుడే మహనీయుడు పేరిట రాష్ట్ర స్థాయిలో ప్రచార ఉద్యమం నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ముమ్మిడివరంలో జిల్లా అధ్యక్షులు జనిపెల్ల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన సదస్సులో వెంకటేశ్వర రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో శాస్త్రీయ సాంకేతిక ప్రగతి ఫలాలు అనుభవిస్తున్న నేటి సమాజం భావజాలపరంగా రాను రాను ప్రగతి నిరోధక భావజాలంలోకి కురిపోతుందన్నారు. సాంస్కృతిక కాలుష్యం పర్యావరణ కాలుష్యం భావ కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరుకుంటుందని దీనిపై భవిష్యత్ తరాలు శాస్త్రీయ అభ్యుదయ భావాలను పెంపొందించుకోవాలన్నారు. 10 మంచి అంశాలు 100 మంచి పాటలతో మానవుడే మహనీయుడు రూపొందించామని ఆయన వివరించారు. జిల్లా అధ్యక్షులు జె సత్యనారాయణ మాట్లాడుతూ మానవుడే మహనీయుడు కార్యక్రమం సమాజానికి ఎనిమిది తొమ్మిది పది తరగతుల విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నత సమాజ నిర్మాణానికి ఉన్నత భావాలు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ అబ్బులు పి లక్ష్మి శ్రీనివాసన్ డాక్టర్ రాంప్రసాద్ డాక్టర్ రామాంజనేయులు వి వెంకటేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి జోగి రమేష్ నోటిని అదుపులో పెట్టుకోవాలి

**ముమ్మిడివరం, జులై 26, (ప్రభాతవార్త):** గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అమరావతిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో జరిగిన సభలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై చేసిన వ్యాఖ్యలను జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు పితాని బాలకృష్ణ తీవ్రంగా ఖండించారు. పవన్ కళ్యాణ్ కాగ్ నివేదిక బైజుస్ సంస్థలపై అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి తదితర మంత్రులు పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. అధికారం పోతుందనే అభద్రతాభావంతో ముఖ్యమంత్రి తన మంత్రులతో విమర్శలు చేయిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తమ సీట్లు కాపాడుకునే ప్రయత్నంలో మంత్రులు జగన్మోహన్ రెడ్డి భజన చేస్తూ పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి, జగన్మోహన్ రెడ్డికి బై బై చెప్పడానికి రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని బాలకృష్ణ విమర్శించారు.

## వరద ముంపు ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్త



**పి.గన్నవరం, జులై 26, (ప్రభాతవార్త):** తుఫాన్లు, భారీ వర్షాలు మూలంగా ముంపు బారిన పడే అవకాశమున్న ప్రాంతాలలో 400 కుటుంబాలకు కేంద్ర బిందువుగా ఒక కుకింగ్ సెంటర్ ఏర్పాటుచేసి ముంపు బాధితులకు ఆహారం అల్పాహారం చిన్నారులకు పాలు, సురక్షిత తాగునీరు సరఫరాపై డివిజన్ మండల స్థాయి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిధిలోని మానేపల్లి శివాయిలంక, పి గన్నవరం గ్రామాలలో పర్యటించి ముంపు ప్రభావిత ప్రాంతాలలో డివిజన్ మండల స్థాయి అధికారులతో కలిసి పర్యటించి వరద పరిస్థితిని ద్విచక్ర వాహనంపై పయనించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు అన్నింటిని వరదల సమయంలో కాకుండా ముందుగానే సేకరించు కోవాలని సూచించారు. ముంపు పొంచి ఉన్న గ్రామాలలో వరద పరిస్థితులపై సమీక్షించి ఆయా ప్రాంతాలలో ముందుస్తు హెచ్చరికలు జారీచేస్తూ ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు భోజన ఏర్పాట్లకు సంసిద్ధంగా ఉండాలన్నారు. సహాయ పునావాస కార్యక్రమాలకు సన్నద్ధం కావాలన్నారు. పునరావాస కేంద్రాలలో కనీస వసతులు ముందుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం ముక్కంటి తాసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 28న ఇన్‌ఛార్జ్ మంత్రి జోగి రాక

**అమలాపురం, జులై 26, (ప్రభాతవార్త):** రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇంచార్జ్ మంత్రి జోగి రమేష్ ఈ నెల 28న శుక్రవారం కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలోను, వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపన కార్యక్రమాలలో ఇన్‌ఛార్జ్ మంత్రి పాల్గొంటారు. అదేవిధంగా జిల్లాకు చెందిన అధికార, అనదికారులతో వివిధ అంశాలపై చర్చిస్తారు.

## కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం 66 లక్షల 14 వేల 313 రూపాయలు

### ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు వెల్లడి





**ఆత్రేయపురం, జులై 26, (ప్రభాతవార్త):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి హుండీల ద్వారా 28 రోజులకు 66 లక్షల 14 వేల 313 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు వెల్లడించారు.

ఆలయ ఆవరణలో హుండీలను దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారులు మీసాల రాధాకృష్ణ, ఎన్ వి ఎన్ ఎస్ వి ప్రసాదరాజు, ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, గ్రామ సర్పంచ్ పోచిరాజు బాబురావు దంపతులు, ఆలయ అర్చకులు సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలోలెక్కించారు. ఆలయ ప్రధాన హుండీల ద్వారా 50 లక్షల 22 వేల 67 రూపాయలు, అన్న ప్రసాదం హుండీల ద్వారా 15 లక్షల 92 వేల 246 రూపాయలు ఆదాయంలో లభించినట్లు తెలిపారు. అలాగే 26 గ్రాముల బంగారం, 585 గ్రాములు వెండి, పలు విదేశాల కరెన్సీ నోట్లు లభించాయి. అలాగే ఆలయ ఆవరణలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారికి హుండీల ద్వారా 1 లక్ష 53 వేల 994 రూపాయలు ఆదాయం లభించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాలలో ఆలయ పర్యవేక్షకులు రాపాక శ్రీనివాస్, శ్రీదేవి, సిబ్బంది నారాయణ, రామానుజన్, ఆలయ కమిటీ సభ్యులు పేర్చర్ల సురేష్ రాజు, రెడ్డి చంటి రవిదేవి, మెర్ల వెంకటేశ్వరరావు, మన్యం భాను, రొట్టె రాజేశ్వరి రాజబాబు, ఏపుగంటి కనకారావు, శనగల సత్యనారాయణ, వాడపల్లి వెంకట సత్య సాయి, బివై కిరణ్, పోలీస్ సిబ్బంది, రావులపాలెం కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలకు చెందిన సిబ్బంది, ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.


## మత్స్యకారులకు న్యాయం చేయకపోతే మళ్లీ ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటా : ఎమ్మెల్యే గొల్లపల్లి

(5వ పేజీ తరువాయి)

నించినట్లు ఆ విధంగా షరుతు విధించినట్లు పేర్కొన్నారు. దాంతో సిఎం రంగసామి, ఎల్జి తమిళసై సౌందరాజన్, మత్స్య శాఖ మంత్రి, పుదుచ్చేరి ఉన్న తాధికారులు సైతం దానికి అంగీకరించి ఆవిధంగా నిబంధనలకు సవరణ చేసారని ఆవిధంగా అప్పట్లో జిఒ విడుదల చేశారన్నారు. అయితే 'ప్రస్తుతం వచ్చిన జిఒలో మార్పులు ఉండటంతో అర్హులైన చాలామందికి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చే నిబంధనలనే యానాంలో సైతం అమలు చేయాలని తాను కోరానని తెలిపారు. వేటనిషేధ సమయంలో ఖాళీగా ఉండక ఉపాధికోసం పలువురు మత్స్యకారులు పలుచోట్లకు కూలి పనికి సైతం వెళ్లారని అటువంటి వారిని ప్రస్తుతం మత్స్యకారులు కాదంటే ఎలా అని ప్రశ్నించారు. అటువంటివారికి సైతం న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. మత్స్యకారుల్లో అర్హులైనవారికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశ్యమని పరిహారం సొమ్ము ఎవరైతే లబ్దిదారుడు ఉన్నాడో ఆ కుటుంబానికి మాత్రమే చెందాలని వారే దానిని అనుభవించాలన్నదే తన తపన అని పేర్కొన్నారు. కోట్లాది రూపాయిల మత్స్యకారుల పరిహారం ఏ స్వచ్ఛంద సంస్థకో దారి మళ్లకూడదని ఆ విధంగా జరగకూడదన్నదే తన పోరాటమని పేర్కొన్నారు. చాలామంది దీనిని రాజకీయం చేయాలని చూస్తున్నారని తానే ఆపుతున్నట్లుప్రచారం చేయడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తాను 6 నెలల నుంచి పరిహారం జరగాలని పుదుచ్చేరిలో అధికారుల చుట్టూ తిరుగుతుంటే ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రజలు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. తాను, తన కార్యకర్తలు పరిహారం ఆపుతున్నానని అసత్యప్రచారం చేస్తున్నారని అటువంటివాటిని ఖండిస్తున్నానని గంగమ్మ తల్లి సాక్షిగా, తన తల్లి సాక్షిగా చెబుతున్నానని స్పష్టం చేశారు. మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు పరిహారం ఆపాలని చూడాలని ఎన్ని ఎత్తుగడలు వేసినా అది జరగదని స్పష్టం చేశారు. మత్స్యకారులకు నష్టపరిహారం విషయంలో ఏవైనా అడ్డంకులు సృష్టించినా ఆగినా వేలాది మందితో మళ్లీ ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని దీనిలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. పేదోడు గెలవాలని ప్రతి మత్స్యకార నాయకుడు కోరుకోవాలని, అంతేకాని దీనిని రాజకీయం చేయవద్దని హితవుపలికారు. పరిహారంకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలకు సవరణలు చేసి మత్స్యకారులందరికి న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు. తప్పనిసరిగా మత్స్యకారులందరికి న్యాయం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు.

## చిన్నారుల ప్రాణాంతక వ్యాధుల నివారణకు మిషన్ ఇంద్రధనస్సు : కలెక్టర్ హిమాన్షు శుక్లా

**అమలాపురం కలెక్టరేట్, జులై 26, (ప్రభాతవార్త):** జీరో నుండి ఐదు సంవత్సరాల వయసుగల చిన్నారులలో ప్రాణాంతక వ్యాధు లను అదుపులోనికి తెచ్చేందుకు మిషన్ ఇంద్రధనస్సు -5.0 భరోసాను కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలియజేశారు. బుధవారం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం అమలు విధివిధానాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 550 గ్రామ వార్డు సచివాలయం ద్వారా కోనసీమ జిల్లాలో ఉన్న 1,42,000 మంది చిన్నారుల డేటా ఆధారంగా ఏ ఒక్కరూ మిస్ కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటి కల్లా మోజిల్, రూబెల్లా వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం ఆరోగ్యకరమైన చిన్నారులపై ఆధారపడి ఉంటుందని, ముఖ్యంగా తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తోందన్నారు. చిన్నారులకు ప్రాణాంతకంగా పరిణమించే పోలియో, ధనుర్వాతం, మశూచి, హెపటైటిస్, మీజిల్స్ తదితర వ్యాధులపై ప్రభుత్వాలు కృషి చేస్తుందన్నారు. మిషన్ ఇంద్రధనస్సును కేంద్ర ప్రభుత్వం 2014 డిసెంబరు 25న ప్రారంభించిందని కలెక్టర్ శుక్లా తెలిపారు. టీకాకు నోచుకోని చిన్నారులను గుర్తించి వచ్చే నెల నుంచి అక్టోబర్ వరకూ మూడు దశలుగా టీకాలు వేస్తామన్నారు. మొదటి దశలో ఆగస్టు 6 నుంచి 12 వరకు, రెండవ దశలో సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు మూడవ దశలో అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ జిసి హర్షిత్, యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శృతి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఎం దుర్గారావు దొర, జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిని జీవి సత్యవాణి, మున్సిపల్ కమిషనర్ విఐపి నాయుడు, ఒంటెద్దు వెంకన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.




వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

## కోవిడ్ సమయంలో వైద్యుల సేవలు ఎనలేనివి - కనిపించే ప్రత్యక్ష దైవాలు డాక్టర్లే : ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

### - ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ వైద్యులకు సత్కారం



**రావులపాలెం, జులై 26, (ప్రభాతవార్త):** కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి డాక్టర్లు అందించిన సేవలు ఎనలేనివని, డాక్టర్లు కనిపించే దైవాలని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం విజయవేదిక ఫంక్షన్ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఎఫ్) రావులపాలెం శాఖ వార్షిక సమావేశం నిర్వహించారు. రావులపాలెం శాఖ అధ్యక్షుడు డా.శేషుబాబు, కార్యదర్శి డా.రమేష్ రెడ్డి, డా.గంగిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిర్ల చేతుల మీదుగా సీనియర్ వైద్యులు మాజీ ఎమ్మెల్యే ఐ.ఎస్.రాజు, పడాల వెంకటరెడ్డి, మెంటే ఉదయభాస్కరరావు, చిన్నంరాజులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందర్ రెడ్డి కూడా వైద్యులే అని, సమాజానికి ఎనలేని సేవలు అందించే వైద్యులను సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తానని అన్నారు. సమాజంలో కుల, మతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు మొక్కే దేవుళ్ళు డాక్టర్లు అన్నారు. అయితే డాక్టర్లను కూడా కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని అలాంటి వారి నుంచి రక్షణ కల్పించడం ప్రజా ప్రతినిధులుగా తమ భాధ్యత అని, డాక్టర్లకు ఏ విధమైన ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గానికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## బాధితుడికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం



**మామిడికుదురు, జులై 26, (ప్రభాతవార్త):** ఇటీవల అప్పనపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన గడప గడపకి మన ప్రభుత్వ కార్యక్రమంలోఅదే గ్రామానికి చెందిన ఇసుకపట్ల సత్యనారాయణ తండ్రి వెంకన్న ఆరోగ్య పరిస్థితి బాగోలేని కారణంగా వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించవలసిందిగా పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును గ్రామ సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా మానవతా దృక్పథంతో స్పందించిన జగన్ మోహన్ రెడ్డి రూ. 3 లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఆ చెక్కును బుధవారం నగరం శాసనసభ్యులు క్యాంపు కార్యాలయం వద్ద పి.గన్నవరం శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో గెద్దం వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## షహజాదే ఖాసింకు ఘన నివాళి




**మామిడికుదురు, జులై 26, (ప్రభాతవార్త):** మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా ఏడవ రోజు గుర్రాలపై పీర్లను ఊరేగించారు. నగరం గ్రామంలో ఉన్న షహజాదే ఖాసిం పంజాల నుండి ఐదు గుర్రాలపై పీర్లను తీసి మాతం చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం మామిడికుదురులోని హాజరత్ అబ్బాస్ పంజాలో మెహేంది మజ్లిస్ జరిగింది. ఈ మజ్లిస్‌లో మౌలానా సయ్యద్ మొహమ్మద్ అలి జాఫరీ కర్బలా పుణ్యభూమిలో షహజాదే ఖాసిం వీరమరణం పొందిన సంఘటనను వివరించగా భక్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పంజా నిర్వాహకులు (ముతవల్లి) సర్ఫిల్ ఫర్హత్ అలీ బేగ్ ఆధ్వర్యంలో భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు.

## శ్రీ ప్రతిభ విద్యాలయ స్కూల్లో ఘనంగా కార్గిల్ అమరవీరులకు నివాళులు



**ప్రత్తిపాడు, జులై 26, (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో శ్రీ ప్రతిభ విద్యాలయ స్కూల్లో ఘనంగా కార్గిల్ అమర వీరులకు విద్యా సంస్థల అధినేత దాసం శేషారావు ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఉగ్రవాదులతో కలిసి కాశ్మీర్‌లోని కార్గిల్ సెక్టార్ని ఆక్రమించిన పాకిస్తాన్ సైన్యాన్ని ఇండియన్ ఆర్మీ తరిమి కొట్టిందని ఈ యుద్ధంలో అమరులైన జవాన్ల త్యాగాలను స్మరించుకోవాలని ఏటా జూలై 26న విజయ్ దివాస్ ను జరుపుకుంటున్నామని శ్రీ ప్రతిభ విద్యాలయం అధినేత దాసం శేషారావు తెలియజేశారు.భారతీయ సైనికులు ప్రాణానికి తెగించి ప్రాణాలు అర్పించిన భారత సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని మరియు జైహింద్ జై భారత్ అని విద్యార్థిని విద్యార్థులు నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఏవో నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత గ్రామాలలో సందర్శించిన జిల్లా ఎస్పీ శ్రీధర్



**పి.గన్నవరం, జులై 26, (ప్రభాతవార్త):** మండలంలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన జి.పెదపూడి లంక, బూరుగులంక, అరిగేలవారి పేట, ఊడిముడి లంక గ్రామాలను జిల్లా ఎస్పీ శ్రీధర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వద్ద గోదావరి వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. లంక గ్రామాలకు పడవలపై వెళ్లేవారు పరిమిత సంఖ్యలో వెళ్లాలని సూచించారు. అదేవిధంగా స్థానిక సచివాలయ సిబ్బంది పోలీసులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా సుడిగాలి పర్యటన

## నదీకోత నుంచి వీరవల్లిపాలెం గ్రామాన్ని కాపాడండంటూ వేడుకోలు



**అయినవిల్లి, జులై 26, (ప్రభాతవార్త):** ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ప్రతీ ఏటా గోదావరి ఉగ్ర రూపానికి మా గ్రామం నదీ కోతకు గురై నదీ గర్భంలో కలిసిపోతుందని, గోదావరిలో గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టి కోతకు గురౌతున్న మా గ్రామాన్ని కాపాడండంటూ వీరవల్లిపాలెం గ్రామస్తులు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను వేడుకున్నారు.అయినవిల్లి మండల పరిధిలోని అయినవిల్లి లంక వద్ద ఎదురు బిడియం కాజ్వే, వీరవల్లి పాలెం వరద ప్రభావిత ప్రాంతాలలో బుధవారం జిల్లా కలెక్టర్ పర్యటించి వరద స్థితిగతులను పరిశీలించారు. ఈనేపథ్యంలో వీరవల్లిపాలెం గ్రామంలో వరద ఉధృతిని, నదీ కోతను పరిశీలించారు. నదీ కోత నివారణ నుంచి వీరవల్లిపాలెం గ్రామాన్ని కాపాడేందుకు గోదావరిలో కళా వెంకట్రావు గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టి కోతకు గురి కాకుండా గ్రామాన్ని కాపాడారని, తదనంతరం వరదల ఉధృతికి ఆ గ్రోయిన్స్ శిధిలావస్థకు చేరడంతో మాజీ ఎమ్మెల్యే దివంగత నేత కుడుపూడి చిట్టబ్బాయి తిరిగి గ్రోయిన్స్‌ను నిర్మించడంతో నదీ కోతకు గురి కాకుండా కాపాడారని తెలిపారు.కాగా వరదల ఉధృతి కారణంగా గ్రోయిన్స్ శిధిలావస్థకు చేరడంతో గ్రామం నదీ గర్భంలో కలిసిపోతుందని,గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టి గ్రామాన్ని కాపాడండంటూ ఆ గ్రామానికి చెందిన మిండగుదిటి రాంబాబుతో పాటు గ్రామస్థులు పలువురు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కోరారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేపట్టి గ్రామాన్ని నాదీ కోత నుంచి కాపాడేందుకు గ్రోయిన్స్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు కొరకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతానని తెలిపారు. తుఫాన్లు మూలంగా గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు అయినవిల్లిలంక కాజ్వే వద్ద వరద స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటిస్తూ వరద హెచ్చరికలకు అనుగుణంగా వరద పరిస్థితిని సమీక్షిస్తూ ముందుగా ముంపు బారిన పడిన ముంపు బాధితులను అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం అయినవిల్లి గ్రామంలో ఎస్.ఎన్.వి.ఆర్ (శ్రీ నరహరిశెట్టి) జూనియర్ కళాశాలను సందర్శించి గ్రాస్ ఎన్రోల్మెంట్ నిష్పత్తిని, స్టూడెంట్ ఇన్ఫో యాప్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. పదో తరగతి పాసైనవారు తప్పనిసరిగా తత్స సమాన విద్య కోర్సులలో జాయిన్ అయింది లేనిది యాప్ ద్వారా పరిశీలించారు. స్థానికంగా నియమించిన ఎస్ డి ఆర్ ఎఫ్ టీం సేవలు వరద ప్రభావిత గ్రామాల్లో తప్పనిసరిగా వినియోగించుకొని ప్రాణ ఆస్తి నష్టాలు జరగకుండా మండల అధికారులు పూర్తి సమన్వయం వహించాలన్నారు. కలెక్టర్ వెంట జడ్పిటీసి గన్నవరపు శ్రీనివాసరావు, దాసరి వీరస్వామి, మిండగుదిటి రాంబాబు, మేడిశెట్టి రాజా, అడపా బాలాజీ, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం ముక్కంటి, ఇంచార్జ్ తాసిల్దార్ అశోక్ కుమార్, మండల విద్యా శాఖ అధికారిని కనకదుర్గ, ఎస్ ఎన్ వి ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు, కార్యదర్శి గరిమెళ్ళ రవి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ సేవను పవన్ కళ్యాణ్ గుర్తించారు : బత్తుల



**కోరుకొండ, జులై 26, (ప్రభాతవార్త):** జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ రాజానగరం నియోజకవర్గంలో తమ కుటుంబం అంతా 15 నెలలపాటు చేసిన శ్రమను, సేవను గుర్తించి తమకు ఈ బాధ్యతలు అప్పగించారని, రాజానగరం నియోజకవర్గ నూతన జనసేన పార్టీ ఇంచార్జ్ బత్తుల బలరామకృష్ణ అన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనకు గాదరాడ తన స్వగ్రామంలో జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించి సన్మానించారు. అక్కడి నుండి కోరుకొండ ప్రధాన రహదారి మీదుగా వందల సంఖ్యలో బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీని గాదరాడ నుండి కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రాబోయే 2024 ఎన్నికలలో జనసేన పార్టీని గెలిపించి రాష్ట్ర సీఎంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని చేయడమే మా లక్ష్యం అని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా జనసేన అధినాయకులు పవన్ కళ్యాణ్ చెవిన పెట్టారని, జనసేన పార్టీలో ఎటువంటి వర్గ పోరు, విభేదాలు లేవని స్పష్టం చేశారు.

ప్రజలు జనసేన పార్టీ వైపే చూస్తూ ఎక్కువ అభిమానం చూపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నియోజకవర్గంలో కోరుకొండ సీతానగరం రాజానగరం మండలాల నుండి జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి : ఎమ్మెల్యే కొండేటి



**అంబాజీపేట, జులై 26, (ప్రభాతవార్త):** రసాయన ఎరువుల వినియోగం ద్వారా పండించిన పంటలతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయాధికారులకు పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. ప్రధానమంత్రి అనుసుచిత్ జతి అభ్యుదయ యోజన (పీఎంఎజెఎవై) పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం ఆద్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. అంబాజీపేట మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాలంలో పశువుల పెంటతో పాటు సేంద్రీయ ఎరువులను ఉపయోగించి పెరట్లోనూ, పొలాల్లోనూ కూరగాయలుతో పాటు, వరిని పండించేవారని, ఆ ఆహారాన్ని తీసుకునే ప్రజలు ఆరోగ్యంగా జీవించేవారన్నారు. మానవుని సగటు ఆయుస్సు పెరగడానికి, సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడానికి సేంద్రీయ ఎరువుల ద్వారా పండించిన పంటలను భుజించడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సాహించాలని వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని, ఉచితంగా అందిస్తున్న వివిధ రకాల విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను షెడ్యూల్డ్ కులాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిట్టిబాబు సూచించారు. ఎస్సీ కార్పోరేషన్ ఈడీ డి.సునీత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలని వైసీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, దానిలో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం చేపట్టే ఎస్సీకులాలకు చెందిన 823 మంది రైతులకు (ఒక్కొక్క కిట్ రూ.9,500) రూ.78.18 లక్షలు విలువైన విత్తనాలు, డ్రమ్స్, టార్పాలిన్స్, కిచెన్ గార్డెన్ కిట్స్ అందిస్తున్నామన్నారు. ఆ కిట్స్లో జొన్నలు, మొక్కజొన్న, జీలుగ, పిల్లిపెసర, జనుము, రాగులు,కొర్రలు, సజ్జలు, మినుములు, పెసలు, కందులు, విజిటబుల్ కిట్స్తోతో కలిపి 12 రకాల విత్తనాలను అందిస్తున్నామన్నారు. అలాగే ఉమ్మడి తూర్పుజిల్లాలో 3003 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు రూ.222.68 లక్షలు విలువైన కిట్లను అందిస్తున్నామని సునీత తెలిపారు. అంబాజీపేటలో రెండు దశాబ్దాల కాలంగా శిధిలమై, నిరుపయోగంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ కాంప్లెక్స్ భవనంను తొలగించి, దాని స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ ప్రోగ్రాం జిల్లా మేనేజర్ జె. ఎలియాజర్, ఎస్సీ కార్పొరేషన్ ఈవో జె. సత్యవతి, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.డి. విజయకుమార్, పిఆర్పి జె. నాగమణి, జడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వేటూకూరి వెంకటరాజు, వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ చైర్మన్ దొమ్మేటి సత్యమోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పేరి శ్రీనివాస్, నాయకులు ఎం.ఎం.శెట్టి,పితాని వీరాస్వామి, జనిపెల్ల ఏడుకొండలు, మైలా ఆనందరావు, వాసంశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహిళాభ్యుదయమే తెలుగుదేశం లక్ష్యం

## - టీడీపీ నేత యనమల కృష్ణుడు




**తుని, జులై 26, (ప్రభాతవార్త):** తుని మండలం చేపూరు గ్రామంలో లో తెలుగుదేశం పార్టీ నేతలు మహాశక్తి యాత్ర బుధవారం నిర్వహించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో మహిళాభ్యుదయం కోసం చేసిన ప్రణాళికలను వివరిస్తూ యనమల కృష్ణుడితో కలిసి మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. మహాశక్తి ర్యాలీని ప్రారంభించిన యనమల కృష్ణుడు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మహిళలకు లభించే ప్రయోజనాలను వివరించారు.చంద్రబాబు నాయకత్వంలోనే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించారని రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే మహాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన మహాశక్తి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని మహిళలు స్వచ్ఛందంగా హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు పోల్నాటి శేషగిరిరావు,ఎస్ ఎల్ రాజు మోతుకూరి వెంకటేష్, అప్పన రమేష్, వంగలపూడి బుజ్జి, గాది వరహాల బాబు, పేకేటి హరి కృష్ణ కొంద్ర నాగేశ్వరరావు, పక్కుర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కూలిన ట్రాన్స్‌ఫార్మర్...తప్పిన ముప్పు




**యు.కొత్తపల్లి, జులై 26, (ప్రభాతవార్త):** మండలంలోని మూలపేట శివాలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ బుధవారం కుప్పకూలింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ట్రాన్స్ ఫార్మర్ దిమ్మ నాని పోయి కూలిపోవడంతో నేల మీద పడిపోయింది. ఆ సమయంలో సమీపంలో ఎవరు లేకపోవడంతో ముప్పు తప్పింది. విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

# గుర్రంపాలెంలో జగనన్న సురక్ష



**జగ్గంపేట, జులై 26, (ప్రభాతవార్త):** గడపగడపకు తిరిగినప్పుడు సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరిగిందని, ఐతే ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నయోమో తెలుసుకునేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీడీవో వసంత్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చంటిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్రంపాలెం గ్రామానికి నేను చాలా రుణపడి ఉన్నానని, ఈ గ్రామంలో నాకు ఇచ్చిన మెజారిటీ ఎవరికి ఇవ్వలేదన్నారు. ఈ గ్రామానికి వివిధ పథకాల ద్వారా సుమారు 12 కోట్లపైన లబ్ధిచేకూరిందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఇంకా ఎవరైనా ఉంటే వారికి ఈ జగనన్న సురక్ష ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ సురక్ష కార్యక్రమం ప్రతి సచివాలయంలో నిర్వహిస్తున్నాము 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు రైస్ కార్డ్స్ మరియు ఆధార్ లింక్‌తో పాటు సర్టిఫికెట్స్ 630 అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ తోట రవి,గ్రామ సర్పంచ్ చీపురుపల్లి లక్ష్మీ రాఘవ, వైస్ ఎంపీపీ నక్కా శీను, వైసిపి నాయకులు పడాల విష్ణు, అధికారులు నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయం స్టాఫ్, వాలంటీర్స్ పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలు తక్షణం ఇవ్వాలి : ఎమ్మెల్సీ ఐ.వి



**అమలాపురం, జులై 26, (ప్రభాతవార్త):** కోవిడ్-19 వలన రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు 2917 మంది నాడు మరణించారని వీరందరికీ కారుణ్య నియామకాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ ఐ.వి విజ్ఞప్తి చేశారు. ఆయా డిపార్ట్మెంట్లో ముఖ్యంగా స్థానిక సంస్థలు, ఇతర శాఖలలో ఖాళీలు లేకపోవడం వలన వీళ్ళు కారుణ్య నియామకాలు ఆ మేరకు పొందలేకపోయారన్నారు. దీనిమీద ముఖ్యమంత్రి నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆదిత్యనాథ్ దాస్‌కి పిడిఎఫ్ తరఫున ఉద్యోగ సంఘాల జేఏసీ తరఫున వన్ టైం సెటిల్మెంట్గా అన్ని శాఖలలో ఉన్న ఖాళీలను ఓపెన్ చేసి కారుణ్య నియామకాలు ఇవ్వాలని నాడు విజ్ఞప్తి చేశామన్నారు.ఇప్పటికీ ప్రభుత్వ నెంబర్.1473 గా ఈరోజు ఉత్తర్వులు విడుదల చేయటం జరిగిందన్నారు.ఈఉత్తర్వులలో 2917 మందికి గాను ఇప్పటికీ 1488 మందికి మాత్రమే ఆయా శాఖలలో కారుణ్య నియామకాలు ఇవ్వడం జరిగిందని ఇంకా 1149 మంది వెయిటింగ్లో ఉన్నారన్నారు. దరిమిలా ఈ 1149 మందికి ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు, సచివాలయ కార్యదర్శిలుగా కారుణ్య నియామకాలు ఇవ్వాలని అధికారులని ఆదేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్లు వెంటనే వీరికి కారున్య నియామకాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ ఐ.వి విజ్ఞప్తి చేశారు.

# రూ.14 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

## - రికవరీ చేసిన పోలీసు సిబ్బందికి రివార్డులు ప్రకటించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



**కాకినాడ రూరల్, జులై 26, (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పర్యవేక్షణలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు 14 లక్షల సొత్తును స్వాధీన పరుచుకున్నారు. రూరల్ మండలం సర్పవరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ బుధవారం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడకుండా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బయటకు కనపడే విధంగా తాళం వేయబడిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గృహోపకరణాలను దొంగతనాలు చేస్తూ పట్టుబడిన కాకినాడ రూరల్ మండలానికి చెందిన నార్ని సతీష్ చంద్ర, బుడగ ఆనంద్ కుమార్, కర్రీ నాగ శివకుమార్‌లను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సర్పవరం, పిఠాపురం, తిమ్మాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసి అరెస్టు చేసి ముద్దాయిలను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎంతో చాకచక్యంగా వ్యవహరించి దొంగిలించిన సొత్తు రికవరీ చేయడంలో ప్రత్యేక కృషి చేసినటువంటి సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ, క్రైమ్ స్టాఫ్ కానిస్టేబుల్ జి సత్యనారాయణ, ఎల్.గణేష్, కే.వెంకటరత్నం, ఎం.సతీష్ కుమార్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి. పీ మురళీకృష్ణారెడ్డి సర్పవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత



**అల్లవరం, జులై 26, (ప్రభాతవార్త):** రెల్లిగడ్డ గ్రామానికి చెందిన బొమ్మి నాగ వీర వెంకట సత్యనారాయణ గత కొంతకాలంగా కామెర్ల వ్యాధితో హాస్పిటల్‌లో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటివద్ద చికిస్త పొందుతున్న ఆయనను అల్లవరం మండల అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మరియు మందుల ఖర్చు నిమిత్తం 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రెల్లిగడ్డ గ్రామ కమిటీ అధ్యక్షులు నడింపల్లి చంటి రాజు, సమన్వయ కమిటీ నాయకులు కడలి వెంకటేశ్వరరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పశ్చిమాల ఏడుకొండలు, అల్లవరం గ్రామ కమిటీ అధ్యక్షులు మామిడిశెట్టి శ్రీరామ్, నడింపల్లి వెంకట సుబ్బరాజు బొమ్మి చందర్రావు, బొమ్మి వెంకటేశ్వరరావు, చేట్ల రవి, బొమ్మి శ్రీను,కల్లేపల్లి రామ రాజు, నడింపల్లి నాగరాజు, పాటి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.




## 14 టోర్నీల్లో ఏడోసారి అదే తీరు

**న్యూఢిల్లీ:** భారత స్టార్ షట్లర్, తెలుగమ్మాయి పివి సింధు వరుస వైఫల్యాలు కొనసాగుతున్నాయి. గాయాల నుంచి కోలుకొని రీఎంట్రీ ఇచ్చిన తర్వాత ఆమె ఆట గాడి తప్పింది. వరుస టోర్నీల్లో నిరాశపరుస్తూనే ఉంది. గతవారం కొరియా ఓపెన్‌లో మొదటి రౌండ్‌లో ఓడిన ఆమె ఈ రోజు జపాన్ ఓపెన్‌లోనూ పేలవ ఆటతీరు కనబరిచింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటి దారి పట్టింది. ప్రపంచ 17వ ర్యాంక్‌కు పడిపోయిన సింధు 12,21, 13,21తో వరుస గేమ్స్‌ల్లో చైనాకు చెందిన జాంగ్ యి మన్ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. ప్రపంచ 18వ ర్యాంకర్ అయినా జాంగ్ యి తో ఆడిన గత మూడు మ్యాచ్‌ల్లో సింధుకు ఇది రెండో ఓటమి కావడం విశేషం. ఇక ఈ ఏడాది ఆడిన 14 టోర్నమెంట్లలో సింధు తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటి దారి పట్టడం ఇది ఏడోసారి కావడం గమనార్హం.

## శ్రీశాంత్‌కు మూఢనమ్మకాలు ఎక్కువ

### టీమిండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్

ముంబయి: మానేకాక అప్పట్లో టీమిండియాతో ప్రయాణించేవాడు. మసాజ్ చేయడంతో పాటుగా పూజలు కూడా చేసేవాడు. నిజానికి శ్రీశాంత్‌కు మూఢనమ్మకాలు ఎక్కువ. తనలాంటి ఫాస్ట్‌బౌలర్‌ను నైనేతే ఎప్పుడూ చూడలేదు. మానేకాక పూజ సమయంలో అగర్‌బత్తీలు అరటిపండుకు కుచ్చి నిలబెట్టేవాడు. అయితే శ్రీశాంత్ నమ్మకాల గురించి తెలిసిన ఓ క్రికెటర్ అతడిని ఆటపట్టించాలని భావించాడు. శ్రీశాంత్ నువ్వు గనుక ఇప్పటికిప్పుడు అరటిపండు తింటే ఈ మ్యాచ్‌లో అయిదు వికెట్లు తీస్తావు తెలుసా అని ఊరించాడు. అప్పటికే ఆ అగర్‌బత్తీలు పెట్టిన అరటిపండు అక్కడ పెట్టి రెండురోజులు అయింది. అయినా శ్రీశాంత్ దానిని తిన్నాడు. వికెట్లు తీయాలనే కోరికతో అలా చేశాడు అని టీమిండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ భారత మాజీ పేసర్ శ్రీశాంత్ గురించి చెప్పుకొచ్చాడు. జియో సినిమా షోలో భాగంగా టీమిండియా ఆటగాళ్ల వింత నమ్మకాల గురించి ప్రస్తావన రాగా 2006 నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నాడు. కాగా నాడు ఆ అరటిపండు తిన్న శ్రీశాంత్ అప్పటి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లో కలిపి అయిదు వికెట్లు తీశాడు. జమైకాలో వెస్టిండీస్‌తో టెస్టుసందర్భంగా మొత్తంగా 49పరుగులు ఇచ్చి ఈమేరకు వికెట్లు పడగొట్టాడు. ఇక ఇదే షోలో పాల్గొన్న టీమిండియా మాజీ పేసర్ జహీర్‌ఖాన్ మాట్లాడుతూ భారత క్రికెటర్లలో చాలా మందికి ఇలాంటి మూఢనమ్మకాలు ఉంటాయని చెప్పుకొచ్చాడు. రంజీ అడే రోజుల్లో కొంతమంది ఏదైనా ఒకరోజు అయిదు వికెట్లు తీస్తే ఆ బట్టలు, ఆఖరికి లోదుస్తులు కూడా ఉతక్కుండా ఉంచుకునే వాళ్లని తెలిపాడు. అదృష్టం తమతో పాటు అలాగే అతుక్కుపోవాలని ఇలా చేసే వాళ్లని చెప్పుకొచ్చారు. శ్రీశాంత్ ఒక్కడికే కాకుండా చాలా మందికి ఇలాంటి నమ్మకాలు ఉంటాయని జహీర్ ఖాన్ పేర్కొన్నాడు. కాగా కేరళకు చెందిన శ్రీశాంత్ ప్రస్తుతం జింబాబ్వే ఆఫ్రో టీ10 లీగ్‌తో బిజీగా ఉన్నాడు.

# విండీస్‌తో వన్డే సిరీస్, ఆసియా ట్రోఫీకి అంకురార్పణ!




**న్యూఢిల్లీ:** వర్షం కారణంగా రెండు టెస్టుల సిరీస్‌ను 1,0 ఆధిక్యంతో సొంతం చేసుకున్న టీమిండియా గురువారం నుండి వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధం కానుంది. ఆసియా కప్ టోర్నీకి ముందు భారత్ ఆడే చివరి వన్డే సిరీస్ ఇదే. ఆ తర్వాత వచ్చే వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా ఈ సిరీస్‌ను టీమిండియా సద్వినియోగం చేసుకోవాలి. టెస్టుల్లో కనీసం పోరాడలేకపోయిన విండీస్‌ను ఈసారి తక్కువగా అంచనా వేయకూడదు. స్టార్లతో కూడిన జట్టునే ఎంపిక చేయడంతో పోరు రసవత్తరంగా సాగుతుండడంలో ఎలాంటి అనుమానం లేదు. ఇప్పుడు బరిలోకి దిగే కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు లేకుండానే మెగా టోర్నీని టీమిండియా ఇడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి కెప్టెన్ రోహిత్ శర్మతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం ఎప్పటిలానే శుభ్‌మన్‌గిల్‌కే వస్తుందా? లేకపోతే రుతురాజ్‌గైక్వాడ్‌కు అవకాశం ఇస్తారా? అనేది ప్రశ్నార్థకం. మూడో స్థానంలో ఎలాగు విరాట్ కోహ్లి ఉండనే ఉంటాడు. సూర్యకుమార్, సంజూశాంసన్, ఇషాన్‌కిషన్‌లో ఇద్దరు మాత్రమే తుది జట్టులోకి వస్తారు. సూర్యకుమార్‌కు వన్డేల్లో పెద్దగా రికార్డులు లేవు. కానీ ఇటీవల ఐపిఎల్ సీజన్‌లో సూపర్ ఇన్నింగ్స్‌లు ఆడాడు. సంజూ శాంసన్ ఫర్వాలేదు. అదేవిధంగా వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన ఇషాన్ కిషన్‌కు పక్కన పెట్టడం కష్టమే. వికెట్ కీపర్‌గా కిషన్‌కే ఎక్కువ అవకాశాలు ఉంటాయనేది విశ్లేషకుల అంచనా. బౌలింగ్ విభాగం విషయానికొస్తే వైస్ కెప్టెన్ హార్థిక్ పాండ్యా నాయకత్వంలో సీమర్లు ముకేశ్‌కుమార్, సిరాజ్ తుది జట్టులో ఉంటారు. ఉమ్రాన్ మాలిక్, జయదేవ్‌కు నిరీక్షణ తప్పదు. ఇక స్పెషలిస్ట్ స్పిన్నర్ల జాబితాలో కుల్‌దీప్‌ను తీసుకునేందుకు అవకాశాలు పుష్కలం. అయితే మణికట్టు మాంత్రికుడు చాహల్‌ను పక్కన పెట్టడం కష్టమే. ఆల్‌రౌండర్లు రవీంద్రజడేజా, అక్షర్‌పటేల్ ఇద్దరినీ తీసుకుంటే బ్యాటింగ్‌కు ఉపయోగపడతారు. అప్పుడు ప్రత్యేకంగా మరో బ్యాటర్‌ను తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ముగ్గురు స్పిన్నర్లు, ముగ్గురు పేసర్లు అందుబాటులో ఉన్నట్లు ఉంటుంది. ఇందులో ముగ్గురు బ్యాటింగ్ చేయగల సత్తా ఉన్న ఆటగాళ్లు కావడం విశేషం. హార్డ్ హిట్టర్ హెట్‌మయర్, పేసర్ ఒషేన్ థామస్ వెస్టిండీస్ వన్డే జట్టులోకి పునరాగమనం చేశారు. భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌కు ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో వారికి స్థానం లభించింది. నికోలస్ పూరన్, జేసన్ హోల్డర్ సెలక్షన్‌కు అందుబాటులో లేరు. హెట్‌మయర్ దాదాపు ఏడాదిగా ఏ ఫార్మాట్లోనూ విండీస్ జట్టులో లేడు. అతడు చివరిసారి 2021 జులైలో వన్డే మ్యాచ్ ఆడాడు. సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నా ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు విండీస్ సెలక్టర్లు అతన్ని ఎంపిక చేయలేదు. విండీస్ వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించని సంగతి తెలిసిందే. భారత్, విండీస్‌ల మధ్య తొలి రెండు వన్డేలు ఈ నెల 27,29వ తేదీల్లో కింగ్‌స్టన్‌లో జరుగుతాయి. ఆగస్టు 1న మూడో వన్డేకు ట్రినిడాడ్ ఆతిథ్యమిస్తుంది. వన్డేల తర్వాత రెండు జట్లు అయిదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో తలపడతాయి.

భారత్: రోహిత్ శర్మ, శుభమన్‌గిల్, రుతురాజ్ గైక్వాడ్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, సంజూశాంసన్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, శార్దూల్ ఠాకూర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, యుజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, జయ్‌దేవ్ ఉనద్కత్, సిరాజ్, ఉమ్రాన్ మాలిక్, ముకేశ్‌కుమార్. విండీస్: షైహోప్, రోవ్‌మన్ పావెల్, అలిక్ అథనేజ్, యనిక్ కారియా, కీసీ కార్టీ, డొమినిక్ డ్రేక్స్, షిమ్రాన్ హెట్‌మయేర్, అల్జారీ జోసెఫ్, బ్రాండన్ కింగ్, కేల్‌మేయర్స్, మోతీ, జయ్‌దెన్ సీలెస్, రొమారియో షెపెర్డ్, కెవిన్ సిన్‌క్లెయిర్, ఓషానె థామస్.



## అమ్మాయిలకు అంత కోపమా? హర్మన్‌ప్రీత్‌ను తప్పుబట్టిన షాహిద్ అఫ్రిది!

**న్యూఢిల్లీ:** టీమిండియా మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తీరును పాక్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది కూడా తప్పుబట్టారు. ఔట్ విషయంలో హర్మన్‌ప్రీత్ కౌర్ అంతలారియాక్ట్ అవ్వాల్సిన అవసరంలేదని అభిప్రాయపడ్డాడు. బంగ్లాదేశ్‌తో ఇటీవల ముగిసిన మూడో వన్డేలో అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన హర్మన్‌ప్రీత్‌పై ఐసిసి కఠిన చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హర్మన్ ప్రవర్తనను టీమిండియా మాజీ క్రికెటర్లు మదన్‌లాల్, డయానా ఎదుల్జీ తప్పుబట్టగా తాజాగా షాహిద్‌అఫ్రిది కూడా ఆమెతీరుపైవిమర్శలు గుప్పించాడు. అయితే మహిళా క్రికెట్‌లో ఇలాంటివి జరగడం చాలా అరుదు. ఎందుకంటే మహిళలు ఇంతగా ఆగ్రహానికి గురవరు. హర్మన్‌ప్రీత్‌కు విధించిన ఈ శిక్షతో భవిష్యత్తులో ఇలాంటివి జరగవనుకుంటున్నా. క్రికెట్‌లో దూకుడు సహజమే. అయితే నియంత్రించుకునే శక్తి కూడా ఉండాలి. హర్మన్ ప్రవర్తహద్దులు దాటింది. ఔట్ విషయంలో అంతగా రియాక్ట్ అవ్వాల్సిన అవసరంలేదు అని అఫ్రిది చెప్పుకొచ్చాడు.

## హెచ్ఎఐకు కేంద్ర క్రీడాశాఖ గుర్తింపు

### జాతీయ హ్యాండ్‌బాల్ సెక్రటరీగా జగన్‌మోహన్‌రావు ఏకగ్రీవం

### అభినందించిన మంత్రులు హరీష్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, జూలై 26,ప్రభాతవార్త:** గ్రూప్ రాజకీయాలు, వర్గపోరు, వివాదాల సుడిగుండంలా ఇన్నాళ్లూ నలిపోయిన జాతీయ హ్యాండ్‌బాల్ సంఘాన్ని తన చాణిక్యంతో తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షులు అర్శనపల్లి జగన్మోహన్‌రావు ఎట్టకేలకు బయటపడేశారు. జగన్మోహన్‌రావు సారథ్యంలోని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఎఐ) జాతీయ క్రీడా సంఘంగా గుర్తిస్తూ కేంద్ర క్రీడాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతనెలలో జస్టిస్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్ పర్యవేక్షణలో ఎన్నికైన హెచ్‌ఎఐ నూతన కార్యవర్గాన్ని అమోదిస్తున్నట్లు కేంద్ర క్రీడాశాఖ తన ఉత్తర్వుల్లో తెలిపింది. హెచ్‌ఎఐ అధ్యక్షుడిగా దిగ్విజయ్ చౌతాలా, ప్రధాన కార్యదర్శిగా జగన్‌మోహన్‌రావు, కోశాధికారిగా కేజ్‌రాజ్‌సింగ్ ఎన్నికను ధృవీకరిస్తున్నట్లు తెలిపింది. దేశంలో హ్యాండ్‌బాల్ కార్యకలాపాలను ఇక నుంచి పూర్తిగా హెచ్‌ఎఐనే నిర్వహిస్తుందని పేర్కొంది. అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం (ఐహెచ్‌ఎఫ్), భారత ఒలింపిక్‌సంఘం ( ఐఓఏ), ఇంతకుముందే హెచ్‌ఎఐకే జైకొట్టడంతో కేంద్ర క్రీడాశాఖ కూడా హెచ్‌ఎఫ్‌ఐను పక్కనపెట్టి తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షులు అర్శనపల్లి జగన్మోహన్‌రావు సారథ్యంలోని హెచ్‌ఎఐకి గుర్తింపు ఇచ్చింది. ఈనేపథ్యంలో ఆర్థికమంత్రి హరీష్‌రావు, క్రీడామంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవిత, భారత ఒలింపిక్‌సంఘం ఉపాధ్యక్షులు గగన్‌నారంగ్, శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, పుల్లెల గోపీచంద్, అంబటి రాయుడువంటి వారు జగన్మోహన్‌రావుకు ట్విట్టర్‌లో అభినందించారు.

**హ్యాండ్‌బాల్ అభివృద్ధే ఏకైక అజెండా : జగన్మోహన్‌రావు**

కేంద్ర క్రీడాశాఖ నుంచి హెచ్‌ఎఐకి గుర్తింపు రావడంపట్ల జగన్మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాపై విశ్వాసం ఉంచిన ప్రతి రాష్ట్ర సంఘానికి, క్రీడాకారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గతరెండేళ్లుగా తన నాయత్వంపై విశ్వాసం ఉంచి హెచ్‌ఎఐతో ప్రయాణం చేసిన హ్యాండ్‌బాల్ కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో జరగబోయే ఆసియా క్రీడల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే నేషనల్ గేమ్స్‌లో తిరిగి హ్యాండ్‌బాల్‌ను ప్రవేశపెట్టనున్నారని గతనెలలో ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పిహెచ్‌ఎల్)ను విజయవంతంగా నిర్వహించామని ,భవిష్యత్‌లో మహిళా హ్యాండ్‌బాల్‌లీగ్ కూడా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జగన్మోహన్‌రావు వెల్లడించారు.

# వాణిజ్యం

## బియ్యం ఎగుమతులపై ఇండియా బ్యాన్ ఎత్తేయాలి: ఐఎంఎఫ్

**న్యూఢిల్లీ, జులై 26:** బియ్యం ఎగుమతులపై భారతదేశం విధించిన నిషేధంతో గ్లోబల్ ఇన్‌ఫ్లేషన్ ముప్పు పొంచి ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఆందోళన వ్యక్తంచేసింది. ఇప్పటికే పలు దేశాల్లో బియ్యం కొరత ఏర్పడిందని పేర్కొంది. అమెరికా, ఆస్ట్రేలియాలతో పాటు పలు దేశాల్లో బియ్యం కొనుగోలుకు జనం బారులు తీరుతున్నారని వెల్లడించింది. దీంతో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేసింది. దేశీయ అవసరాల కోసమే భారత ప్రభుత్వం బియ్యం ఎగుమతులపై బ్యాన్ విధించిందనే విషయం తమకు తెలుసని ఐఎంఎఫ్ చీఫ్ ఎకనామిస్ట్ పీరే అలివర్ గౌరించాస్ పేర్కొన్నారు. అయితే ఎకాఎకిన బ్యాన్ విధించడం వల్ల విదేశాలలో బియ్యం కొరత ఏర్పడుతుందని, సడెన్‌గా డిమాండ్ పెరగడం వల్ల ధరల్లో ఒడుదుడుకులు ఏర్పడతాయని చెప్పారు. ఇది గ్లోబల్ ఇన్‌ఫ్లేషన్‌కు దారితీస్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో రైస్‌పై విధించిన బ్యాన్‌ను సాధ్యమైనంత త్వరగా ఎత్తివేసేలా తాము ఇండియాను ప్రోత్సహిస్తామని ఆయన వివరించారు. ఈ నెల 20న కేంద్ర ప్రభుత్వం రైస్ ఎగుమతులపై ఆంక్షలు విధించింది. నాన్ బాస్మతి రైస్ ఎగుమతులపై బ్యాన్ విధించింది.



దేశీయ అవసరాల దృష్ట్యా ఈ నిర్ణం తీసుకుంది. అయితే బాస్మతి రైస్, పారాబాయిల్డ్ రైస్‌లపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. వైట్‌రైస్‌ను అమెరికాతో పాటు ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇటలీ, స్పెయిన్, శ్రీలంక తదితర దేశాలకు ఇండియా ఎగుమతి చేస్తోంది. భారత ప్రభుత్వ నిర్ణయంతో అమెరికాలో బియ్యం కోసం డిపార్ట్‌మెంట్ స్టోర్ల ముందు జనం బారులుతీరారు. బియ్యం బస్తాలను అర్జెంటుగా కొని తీసుకెళ్లేందుకు క్యూ కట్టారు. దీంతో డిపార్ట్‌మెంట్ స్టోర్లలో తాత్కాలికంగా రైస్‌కు కొరత ఏర్పడింది. తాజాగా ఆస్ట్రేలియాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బియ్యం కొనుగోలు చేసేందుకు క్యూలలో నిల్చున్న జనం ఫోటోలు, విడి యోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఆర్‌బిఎల్ వాటాలపై మహీంద్రా ఫోకస్!

**న్యూఢిల్లీ, జులై 26:** రత్నాకర్ బ్యాంకు లిమిటెడ్‌లో దేశీయ కార్పొరేట్ దిగ్గజం మహీంద్రా గ్రూప్ వాటాలు కొనుగోలు చేయనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నవారు వెల్లడించారు. దాదాపు 4శాతం వాటాను ఓపెన్ మార్కెట్‌లో కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై స్పందించడానికి ఆర్‌బిఎల్ బ్యాంకు నిరాకరించింది. ఈ బ్యాంకులో వ్యూహాత్మక వాటాదారుగా ఉండేందుకు అనుమతి లభిస్తే 15-20 శాతం వాటాను దక్కించుకోవాలని మహీంద్రా భావిస్తోంది. ప్రస్తుతం ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం దిగ్గజ పారిశ్రామిక సంస్థలు అత్యధికంగా ఏదైనా బ్యాంకులు 10శాతం వరకూ వాటాలను కొనుగోలు




చేయవచ్చు. కానీ ప్రమోటర్లుగా మాత్రం ఉండకూడదు. అంతేకాకుండా ఈ సంస్థలకు బ్యాంకింగ్ లైసెన్స్‌లను ఇవ్వడాన్ని కూడా నిషేధించింది. వాస్తవానికి ఈ గ్రూప్ గతంలో మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీస్ ద్వారా ఆర్థిక సేవల రంగంలోకి అడుగు పెట్టింది. మరోవైపు ఆర్‌బిఎల్ బ్యాంకు గత కొన్నేళ్లుగా ఒడుదుడుకులను ఎదుర్కొంటోంది. పదవీకాలం పొడిగించకపోవడంతో బ్యాంకు ఎండి, సిఇఒగా విశ్వేశ్వర్ అహూజా వైదొలిగారు. ఆయన హఠాత్తుగా వైదొలగడం, ఆర్‌బిఐ ఈ బ్యాంకు కార్యకలాపాలు, ఆర్థిక పటిష్టతపై దృష్టి పెట్టింది. ఈ బ్యాంకులో బేరింగ్స్ ఏషియాకు 10 శాతం వాటా, గజా కేపిటల్, సిడిసిలు ఈ బ్యాంక్‌లో వాటాదారులుగా ఉన్నారు. ఇటీవల ఆర్‌బిఐ బ్యాంకు జూన్ త్రైమాసికంలో రూ.288 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. గత ఆర్థికసంవత్సరం ఇదే సమయంలో వచ్చిన లాభంతో పోలిస్తే ఇది 43శాతం అధికం. నికర వడ్డీ ఆదాయం 21శాతం పెరిగి రూ.1,246 కోట్లకు చేరింది. రుణాలు 21 శాతం వృద్ధి చెందడంతో నికర వడ్డీ మార్జిన్ కూడా 0.48శాతం పెరిగి 4.84 శాతానికి చేరింది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు


**ముంబై, జులై 26:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిసాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్‌అండ్‌టి, టాటా మోటార్స్ వంటి ప్రధాన షేర్లలో కొనుగోళ్లు జోరందుకోవడం, అమెరికా ఫెడ్ నిర్ణయం కారణంగా అంతర్జాతీయంగా మార్కెట్లలో మిశ్రమంగా ట్రేడవుతున్న వేళ దేశీయ సూచీలు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 66,434 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 66,897 వద్ద గరిష్టానికి చేరిన సూచి చివరికి 351.49 పాయింట్లు లాభపడి 66,707.20 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 97.70 పాయింట్ల లాభంతో 19,778.30 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.82 వద్ద నిలిచింది. ఎల్‌అండ్‌టి, ఐటిసి, రిలయన్స్ ఇండస్ట్రీస్, సన్‌ఫార్మా, యాక్సిస్ బ్యాంకు వంటి షేర్లు పుంజుకున్నాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, ఏసియన్




పెయింట్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. మొదటి త్రైమాసికంలో లార్సెన్ అండ్ టూబ్రో ఏకీకృత ప్రాతిపదికన రూ.3,116.12 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాదితో పోలిస్తే ఇది 36శాతం అధికం. చరిత్రలో తొలిసారి రూ.10వేల కోట్ల విలువైన షేర్లను టెండర్ ఆఫర్ పద్ధతిలో కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కంపెనీ షేర్లు రాణించాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్‌ఎస్‌ఇలో 3.56శాతం లాభంతో రూ.2,652 వద్ద ఆ కంపెనీ షేర్లు నిలిచాయి. టాటా మోటార్స్ మొదటి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.3,300.65 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2022-23 ఇదే కాలంలో సంస్థ రూ.4,950.97 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. బ్రిటన్‌లోని అనుబంధ సంస్థ జాగ్వార్ లాండ్ రోవర్ పనితీరు మెరుగవ్వడం, వాణిజ్య వాహనాల వ్యాపారం రాణించడం వల్లే ఈ సారి భారీ లాభాలు నమోదు చేయగలిగింది. ఈ క్రమంలో ఉదయం 4శాతం మేర రాణించినప్పటికీ, చివరికి 0.26శాతం లాభంతో 641 రూపాయల వద్ద నిలిచింది.

## 'వీసా'తో అదానీ గ్రూప్ డీల్!

**న్యూఢిల్లీ, జులై 26:** ఈ మధ్య జనం క్రెడిట్ కార్డులను విపరీతంగా వాడేస్తున్నారు. అందులోనూ ఆయా కంపెనీలతో చేతులు కలిపిన కో బ్రాండెడ్ కార్డులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తద్వారా ఆ సంస్థలు ఇచ్చే ఆఫర్ల ద్వారా పెద్ద మొత్తంలో ఆదా చేసుకునే అవకాశం ఉండడంతో ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ దేశీయ దిగ్గజ వ్యాపార సంస్థ అదానీ గ్రూప్‌తో పేమెంట్ కంపెనీ వీసా చేతులు కలిపింది. కోబ్రాండెడ్ కార్డులు జారీ చేసేందుకు వీలుగా ఇరు కంపెనీల మధ్య ఒప్పందంపై సంతకాలు కూడా జరిగాయి. తద్వారా ఇండియాలో మరింతగా విస్తరించేందుకు వీసాకు అవకాశం ఏర్పడనుంది. 'రిటైల్, ఎయిర్‌పోర్ట్స్, ఆన్‌లైన్ ప్రయాణ సేవల ద్వారా ఇప్పటికే 400 మిలియన్ల వినియోగదారులకు సేవలందిస్తునాము. కాగా ప్రస్తుతం తీసుకున్న



ఈ చర్య వల్ల బిజినెస్ ఉన్నత శిఖరాలకు చేరుతుందని ఆశిస్తున్నాం' అని వీసా సిఇఒ ర్యాన్ మెక్‌ఇనెర్నీ తెలిపారు. అదానీ ఆధ్వర్యంలోని విమానాశ్రయాల ద్వారా ప్రయాణించే కస్టమర్‌లకు, ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ పోర్టల్ క్లియర్‌ట్రిప్, ట్రైన్ బుకింగ్ ప్లాట్‌ఫారమ్ అదానీ వన్ ఉపయోగించే వారికి ఈ ఒప్పందం వల్ల వీసా యాక్సెస్ లభిస్తుంది.

## రియల్‌మీ నుంచి ఉన్నతోద్యోగులు అవుట్!

**ముంబై, జులై 26:** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీకి మరో షాక్ తగిలింది. కొంతమంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో సహా డజను మందికిపైగా ఉద్యోగులు రియల్‌మీ ఇండియా సంస్థకు రాజీనామా




చేసినట్లు తెలిసింది. కొన్ని రోజుల క్రితం రాజీనామా చేసిన మాజీ సిఇఒ మాధవ్ సేత్ పెట్టిన కొత్త సంస్థ హానర్ టెక్‌లో చేరేందుకే ఆ ఉద్యోగులు రియల్‌మీని వీడినట్లు సమాచారం. రియల్‌మీ ఇండియా సంస్థకు చెందిన అత్యున్నత డైరెక్టర్లతో పాటు పలువురు ఉద్యోగులు మాధవ్ సేత్ కొన్ని కంపెనీ హానర్ టెక్‌లో చేరిన నేపథ్యంలో రియల్‌మీ ఇండియా సంస్థలో మరిన్ని సామూహిక రాజీనామాలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజీనామా చేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లలో మాజీ సేల్స్ డైరెక్టర్ సేల్స్ డైరెక్టర్ దీపేష్ పునమియా కూడా ఉన్నారు. ఇటీవల ఆయన హానర్ టెక్ కంపెనీలో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్‌గా చేరారు. కాగా ఉద్యోగుల రాజీనామాల విషయంపై రియల్‌మీ సంస్థ నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఎగుమతులకు సంబంధించిన కొత్త వెంచర్‌ను ప్రారంభించడం కోసమని మాధవ్ సేత్ జూన్ నెల్లో రాజీనామా చేశారు. అప్పటి వరకు కంపెనీలో ఆయన ఐదేళ్లు పనిచేశారు. రియల్‌మీ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్‌గా, రియల్‌మీ ఇంటర్నేషనల్ బిజినెస్ గ్రూప్‌నకు ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు.

## అసర్ఫీ హాస్పిటల్ లిస్టింగ్ అదుర్స్

**ముంబై, జులై 26:** స్టాక్ మార్కెట్లోకి అసర్ఫీ హాస్పిటల్ షేర్లు బుధవారం ఎంట్రీ ఇచ్చింది. తొలి రోజే దాదాపు 100శాతం ప్రీమియంతో బిఎస్‌ఇ ఎన్‌ఎస్‌ఇ ఎక్ఛేంజ్‌లో అడుగుపెట్టాయి. దీని లిస్టింగ్ ధర ఒక్కో షేరుకు 98.80 రూపాయలుగా ఉంది. ఆ తర్వాత కొద్ది సేపటికే ఇంట్రాడే ట్రేడింగ్‌లో స్టాక్ గరిష్టమైన 103.74 రూపాయలకు చేరింది. అయితే కంపెనీ షేర్లను అసలు 52 రూపాయలకి విక్రయించింది. దీంతో ఇన్వెస్టర్ల పెట్టుబడి ఏకంగా రెండింతలైంది. అసర్ఫీ హాస్పిటల్ ఐపిఒ జులై 17న ప్రారం భమై జులై 19న ముగిసింది. దీని కోసం ఐపిఒ ప్రైస్ బ్యాండ్ విడుదల చేసిన కంపెనీ 51-52 రూపాయలుగా నిర్ణయించింది. ఈ క్రమంలో కంపెనీ 51.80 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించింది. వీటి మొత్తం విలువ 26.94 కోట్ల రూపాయలుగా ఉంది. ఐపిఒకు హేమ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా ఉండగా, కామియో కార్పొరేట్ సర్వీసెస్ ఐపిఒ రిజిస్ట్రార్‌గా వ్యవహరించింది. ఐపిఒలో రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం




1,04,000 రూపాయల మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒక్కో లాట్ సైజ్ రెండు వేల షేర్లుగా కంపెనీ నిర్ణయించింది. ఐపిఒ ద్వారా సేకరించిన నిధులను కంపెనీ జార్ఖండ్‌లోని రంగూని కేన్సర్ ఆసుపత్రికి ఖర్చు చేయనున్నట్లు వెల్లడించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.